www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 39 Vol సంచిక : 12 No | విజయవాడ, శనివారం 12 జనవరి 2019 | 12+12 పేజీలు వెల : 4.00 Rs



హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్‌లపై
సస్పెన్షన్ వేటు
12

మళ్లీ మండుతున్న పెట్రోలు
వరుసగా మూడోరోజు పెరిగిన ధర

న్యూఢిల్లీ : దేశంలో పెట్రో ధరలు అలా తగ్గుముఖం పట్టాయో లేదో.. మళ్లీ జోరందుకుంటున్నాయి. రెండు రోజులుగా పెట్రోలు, డీజిల్ ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. రేట్ల పెంపునకు అంతర్జాతీయంగా చమురు ధరల పెరుగుదలను సాకుగా చూపెడుతున్నాయి ఆయిల్ కంపెనీలు. ఢిల్లీలో లీటరు పెట్రోలు ధర 69.07 రూపాయలకు(శుక్రవారం నాడు 19 పైసలు వడ్డింపు) చేరుకున్నది. హైదరాబాద్‌లో లీటరు పెట్రోలు ధర రూ.73.31గా ఉన్నది. అటు డీజిల్ ధర కూడా శుక్రవారం 28 పైసలు పెరిగింది. ఢిల్లీలో లీటరు డీజిల్‌కు రూ.62.81 కాగా.. హైదరాబాద్‌లో ఈ ధర రూ.68.32గా ఉన్నది.

అలోక్‌వర్మ రాజీనామా
సహజ న్యాయాన్ని విస్మరించారని లేఖలో వ్యాఖ్య



న్యూఢిల్లీ: సిబిఐ డైరక్టర్‌గా తొలగింపునకు గురై, ఫైర్ సర్వీసెస్ డిజిగా నియమితులైన అలోక్‌వర్మ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను శుక్రవారం ఆయన కేంద్ర ప్రభుత్వానికి పంపారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలోని హైపవర్ కమిటీ సహజన్యాయాన్ని విస్మరించిందని ఈ లేఖలో ఆయన పేర్కొన్నట్లు సమాచారం. తన వాదన వినిపించుకునే అవకాశం కూడా ఇవ్వకుండా ఉద్యోగం నుండి తొలగించడం ఎంత వరకు సబబని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం సిబిఐ విచారణ ఎదుర్కొంటున్న వ్యక్తి చేసిన ఫిర్యాదు ఆధారంగా తనపై విచారణ జరిపిన సివిసి ఈ నివేదిక రూపొందించిందన్న వాస్తవాన్ని కూడా కమిటీ పరిగణనలోకి తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ విచారణ ప్రక్రియను పర్యవేక్షించిన రిటైర్డ్ న్యాయమూర్తి ఎకె పట్నాయక్ ముందుకు కూడా ఈ ఫిర్యాదీ రాలేదని వివరించారు. అంతేకాక ఈ నివేదికలో పేర్కొన్న అభిప్రాయాలేవీ తనవి కావని జస్టిస్ పట్నాయక్ కూడా తేల్చిచెప్పారని అలోక్ వర్మ తన లేఖలో వెల్లడించారు. ఉన్నతాధికార కమిటీ గురువారం తీసుకున్న నిర్ణయాలు కేవలం తన పనితీరుపై మాత్రమే కాక సిబిఐని ప్రభుత్వం ఏ విధంగా పరిగణిస్తోందన్న అంశాన్ని కూడా ప్రతిబింబించాయన్నారు. ఇది అందరూ సమిష్టిగా, ముఖ్యంగా ప్రభుత్వం ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన సమయమని వర్మ తన లేఖలో వ్యాఖ్యానించారు. గురువారం రాత్రి సమావేశమైన ప్రధానమంత్రి నేతృత్వంలోని హైపవర్ కమిటీ అలోక్‌వర్మను సిబిఐ డైరక్టర్‌గా తొలగించాలని మెజార్టీ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆ కమిటీలోని లోక్‌సభ విపక్షనేత మల్లికార్జున ఖర్గే ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. అయితే. కమిటీ నిర్ణయం పట్ల తీవ్ర మనస్థాపానికి గురైన అలోక్‌వర్మ ఫైర్ సర్వీసెస్ డిజిగా నూతన బాధ్యతలు మిగతా 9లో

మరో కుట్ర
అలోక్ వర్మ బదిలీపై సిపిఎం
8

పింఛన్ ఇక 2వేలు

- జన్మభూమి సభలో చంద్రబాబు ప్రకటన
- ఏప్రిల్ నుంచి ఎన్‌టిఆర్ వైద్యసేవలకు రూ.5 లక్షలు



ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి/అమరావతి బ్యూరో

వృద్ధులు, వితంతవులకు ఇస్తున్న పింఛన్ మొత్తాన్ని రెట్టింపు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. . శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బోగోలులో శుక్రవారం జరిగిన జన్మభూమి- మా ఊరు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఒంటరిమహిళలు, వికలాంగుల పింఛను మొత్తాన్ని కూడా రెట్టింపు చేయనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇస్తున్న వెయ్యి రూపాయలకు బదులుగా, ఇక నుండి 2 వేల రూపాయలను ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. జనవరి నెల నుండే ఈ నిర్ణయం అమలులోకి వస్తుందని, అయితే జనవరిలో పెరిగిన మొత్తాన్ని కలిపి ఫిబ్రవరిలో 3 వేల రూపాయలుగా అందిస్తామని తెలిపారు. విభిన్నప్రతిభావంతులకు, ట్రాన్స్‌జెండర్లకు రూ.1500 నుంచి రూ.3000కు, డయాలసిస్ రోగులకు రూ.2500 నుంచి రూ.3500కు పెంచినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్రాంతి కానుకగా ఆయన దీనిని అభివర్ణించారు. ఆడపిల్లల ఆత్మగౌరవాన్ని కాపాడటం కోసం ప్రభుత్వం రక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అందుకోసం రూ.120 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రధాని మోడీ రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకోకపోగా అణగతొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రాజధాని నిర్మాణానికి కేంద్రం రూ.75 వేల కోట్లు ఇవ్వాల్సి ఉందని ఇటీవల లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలోని మేధావుల కమిటీ కూడా ఇదే అంశాన్ని చెప్పిందని ఆయన అన్నారు. నరేంద్ర మోడీ డిక్టేటర్‌గా తయారయ్యారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో మోడీ, జగన్, కెసిఆర్ ఒక్కటై టిడిపిని ఓడించాలని కుట్రలు చేస్తున్నారని, ప్రజలంతా టిడిపికి అండగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో 66,270 ఎకరాల సిజెఎఫ్‌ఎస్ భూములను డికెటి పట్టాలుగా మార్చి 60,596 మందికి అందజేశారు. సభలో రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి. నారాయణ, ఎంఎల్‌సి బీదా రవిచంద్ర, జెడ్‌పి ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఎంఎల్‌ఎలు పాశం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, బొల్లినేని రామారావు, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కలెక్టర్ ఆర్. ముత్యాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దగదర్తి మండలం, దామవరం వద్ద నిర్మించనున్న ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేశారు. జువ్వలదిన్నెలో శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం రూ.110 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు.

54 లక్షల మందికి లబ్ధి

పించన్ల పెంపు నిర్ణయంతో రాష్ట్రంలో 54,14,592 మంది లబ్ధి పొందనున్నారని ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేసింది. జన్మభూమి ఆరో విడతలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కొత్తగా మరో 3,50,000 మందికి పింఛను మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఈ ప్రకటనలో తెలిపారు.

ఫిబ్రవరి నుంచి పింఛను అందుకోనున్న వివిధ వర్గాల సంఖ్య

వివిధ కేటగిరీలు	మొత్తం పింఛన్లు
వృద్ధులు	24,22,444
వితంతువులు	20,13,808
విభిన్నప్రతిభావంతులు	6,41,820
చేనేత కార్మికులు	1,07,992
కల్లుగీత కార్మికులు	28,011
హెచ్‌ఐవి వ్యాధిగ్రస్తులు	32,979
ట్రాన్స్‌జెండర్లు	1,665
మత్స్యకారులు	45,358
ఒంటరి మహిళలు	1,12,471
డయాలసిస్ రోగులు	8,044
మొత్తం	**54,14,592**

18-20 మధ్య
జనసేనతో లెఫ్ట్ చర్చలు

- ఎపిలో రాజకీయ ప్రత్యామ్నాయమే లక్ష్యం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో నూతన రాజకీయ ప్రత్యామ్నాయానికి జనసేన, సిపిఎం, సిపిఐ పార్టీలు కలిసి కృషి చేస్తున్నాయని, ఈ నెల 18, 19, 20 తేదీల్లో మూడు పార్టీలు కలిసి చర్చించి రానున్న ఎన్నికల్లో ఎవరు ఎక్కడ పోటీచేయాలన్న విషయాన్ని నిర్ణయిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. శుక్రవారం విశాఖలో సిపిఎం కార్యాలయం(ఎన్‌పిఆర్ భవన్)లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను చూస్తే పలు తరగతుల ప్రజలు బిజెపికి ఓట్లేయలేదని స్పష్టమైందన్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ బిల్లును హడావుడిగా తీసుకొచ్చిందని తెలిపారు. జాతీయ స్థాయిలో ఇప్పుడు కూటములవల్ల ఉపయోగం వుండదన్నారు. దేశంలో వ్యవసాయ సంక్షోభం నెలకొందని, తక్షణం పార్లమెంట్‌లో చట్టం చేసి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర భూసేకరణ చట్టం 2013కు సవరణలు తెస్తే టిడిపి, వైసిపి మద్దతు పలికాయని, పవన్‌కల్యాణ్ వామపక్షాలతో కలిసి వ్యతిరేకించారని గుర్తు చేశారు. విశాఖలో ఈ నాలుగేళ్లలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయని రూ.20 వేల కోట్ల భూ కుంభకోణం జరగ్గా అధికార పార్టీ దాన్ని రూ.2 వేల కోట్లకు కుదించే యత్నాలకు దిగిందని ఆరోపించారు. అనకాపల్లి బెల్లం దేశంలోనే ప్రసిద్ధమైనదని, చంద్రబాబు ప్రభుత్వం గుజరాత్ నుంచి అధిక ధర కేజీ రూ.49కు కొని రేషన్ మిగతా 9లో

జర్నలిస్టు హత్య కేసులో డేరా బాబా దోషి
నిర్ధారించిన కోర్టు, 17న శిక్ష ఖరారు చేస్తామని వెల్లడి



న్యూఢిల్లీ: 2002లో జరిగిన జర్నలిస్టు రామ్‌చందర్ ఛత్రపతి హత్య కేసులో స్వయం ప్రకటిత మతబోధకుడైన డేరాసచ్చా సౌదా అధినేత గుర్మీత్ రామ్‌రహీమ్‌సింగ్ (డేరాబాబా)తో పాటు మరో ముగ్గురిని దోషులుగా నిర్ధారిస్తూ హర్యానాలోని పంచకుల సెషన్స్ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. వీరికి శిక్షలను ఈ నెల 17న ఖరారుచేయనున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. రామ్‌రహీమ్‌సింగ్ పై వెల్లువెత్తిన అత్యాచార ఆరోపణల్లోని నిజాలను రామ్‌చందర్ ఛత్రపతి తన కథనాల ద్వారా వెలుగులోకి తెచ్చారు. ఇద్దరు మహిళలపై అత్యాచారం చేసిన కేసులో డేరాబాబా ఇప్పటికే జైలులో వున్న విషయం తెలిసిందే. ఈ కేసులో ఆయనకు 20 ఏళ్ల జైలు శిక్షను విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. అదే కోర్టు ఇప్పటి కేసులో కూడా తీర్పు వెలువరించటం విశేషం. కోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో రాష్ట్రంలో హింస చెలరేగకుండా కోర్టు ఆవరణతో పాటు అనేక ప్రాంతాలలో 144వ సెక్షన్ క్రింద నిషేధాజ్ఞలను విధించారు. 2017లో జరిగిన హింసాకాండలో 32 మంది మరణించిన విషయం తెలిసిందే. తనపై అత్యాచారం చేసినట్లు ఒక సాధ్వి రాసిన లేఖను జర్నలిస్టు ఛత్రపతి తన పత్రిక పూరాసచ్‌లో ప్రచురించిన కొద్ది నెలలకే రామ్‌రహీమ్‌సింగ్ ఆయన్ను 2002 అక్టోబర్ 24న తన రివాల్వర్‌తో పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చిచంపారు. అయితే ఈ కేసులో పోలీసులు రామ్‌రహీమ్‌సింగ్ పేరును ఎఫ్‌ఐఆర్‌లో నమోదుచేయకపోవటంతో అప్పట్లో 21 ఏళ్ల వయస్సున్న ఛత్రపతి కుమారుడు అన్షుల్ డేరాబాబాపై న్యాయపోరాటాన్ని కొనసాగించాడు. ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థకు బదిలీ చేయాలని కోరుతూ అన్షుల్ 2003 జనవరిలో పంజాబ్ హర్యానా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ మేరకు కేసును సిబిఐకి అప్పగించటంతో రామ్‌రహీమ్‌సింగ్‌పై అభియోగాలు నమోదు చేస్తూ 2007 జులైలో ఛార్జ్‌షీట్ దాఖలైంది. ఛత్రపతిని హత్య చేయాల్సిందిగా రామ్‌రహీమ్‌సింగ్ తనను ఆదేశించినట్లు గతంలో సింగ్ వద్ద డ్రైవర్‌గా పనిచేసిన ఖట్టాసింగ్ గత ఏడాది కోర్టుకు వివరించారు.

'భావనపాడు'
నిర్వాసితులు గరం గరం

- ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి తిరస్కరించిన జనం
- అయినా నోటిఫికేషన్ ఇచ్చేస్తామన్న మంత్రి



గ్రామస్తుల ప్రతిపాదనలను మంత్రి దృష్టికి తీసుకెళ్తున్న భావనపాడు మాజీ సర్పంచ్ అల్లుపల్లి పోతయ్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లా భావనపాడు పోర్టు నిర్మాణ నేపథ్యంలో నిర్వాసితులకు ఇచ్చే పరిహారం, పునరావాసం ప్రతిపాదనల తీరుపై రాష్ట్ర మంత్రి కె అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పోర్టు నిర్మాణానికి వజ్రపు కొత్తూరు మండలం భావనపాడు, దేవునల్తాడ, సంతబొమ్మాళి మండలం మర్రిపాడు ఈ మూడు గ్రామాలకు చెందిన 2,320 ఎకరాల సేకరణకు ప్రభుత్వం తాజాగా నోటిఫికేషన్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. పునరావాసం, పరిహారంపై స్థానికులు అడిగిన దానిపై స్పష్టంగా హామీ ఇవ్వకుండా ముఖ్యమంత్రితో మాట్లాడుతామని మంత్రి చెప్పడాన్ని వారు తప్పుపడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజి తమకు సమ్మతం కాదని, భూమికి నష్టపరిహారం, ఇతర విషయాలపై ప్రజలు తమ ప్రతిపాదనలు పెట్టారు. వాటిపై సానుకూలంగా మాటాడుతారని ఎదురుచూసిన ప్రజలు.. మంత్రి సమాధానంతో కాసేపు షాక్‌కు గురయ్యారు. మరోసారి ప్రజలకు నచ్చచెప్పడానికి అచ్చెన్నాయుడు ప్రయత్నించినా స్థానికులు సానుకూలంగా స్పందించలేదు.

2015 సెప్టెంబర్ ఒకటి, రెండు, మూడు తేదీల్లో వేసిన భూసేకరణ నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే ఇచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరో నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమవ్వడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పునరావాసం, పరిహారంపై స్థానికులు అనేక అంశాలను మంత్రి ముందు ఉంచారు. తమ డిమాండ్లను నెరవేర్చి, ఇవ్వాల్సినవన్నీ ఇచ్చిన తర్వాతే పోర్టుపై ముందుకు సాగాలని తేల్చి చెప్పారు. తమ గ్రామంలో కాకుండా భావనపాడులో సభ నిర్వహించడాన్ని నిరసిస్తూ దేవునల్తాడ గ్రామస్తులు సమావేశానికి హాజరు కాలేదు. ప్రభుత్వ ప్రతిపాదలను విన్న సంతబొమ్మాళి మండలం మర్రిపాడు గ్రామస్తులు సభ మధ్యలోనే వెళ్లిపోయారు. భూములకు సంబంధించి ప్రభుత్వం ఎకరాకు చెల్లించనున్న 12.5 ఎకరాలు మాకు సమ్మతం కాదంటూ వారంతా తేల్చి చెప్పారు. అయినా మంత్రి పట్టించుకోకుండా 2013 చట్టం ప్రకారం ఇవ్వాల్సిన పరిహారం, ప్యాకేజి ఇస్తామనీ, మిగతావి సిఎం చూస్తారంటూ నోటిఫికేషన్ ఇచ్చేస్తాం... సహకరించండి... అనడం ప్రజలకు తీవ్ర అసంతృప్తి కలిగించింది.

ఇంటికి, ఇంటి నిర్మాణ స్థలానికి ప్రస్తుతమున్న మార్కెట్ ధరకు ఐదు రెట్లు చెల్లించాలని, మత్స్యకారులకు వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ రూ.రెండు లక్షలు ఇవ్వాలని, పోర్టు మిగతా 9లో

అమెరికా జోక్యాన్ని సహించం
9

- వెనిజులా అధ్యక్షునిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన అనంతరం మదురో



ట్రంప్‌కు నిరసనల సెగ



- వైట్ హౌస్ ఎదుట ఫెడరల్ ఉద్యోగుల నిరసన
- పలు నగరాల్లో ఆందోళనలు
- దావోస్ పర్యటన రద్దు చేసుకున్న ట్రంప్

వాషింగ్టన్ : సరిహద్దు గోడ కోసం దేశాన్ని ఇరవై రోజులుగా స్తంభింపజేస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరిపై నిరసనలు పెల్లుబికాయి. అధ్యక్ష భవనం (వైట్ హౌస్)తో సహా అమెరికాలోని పలు నగరాలు నిరసనలతో హోరెత్తాయి. వైట్ హౌస్ ఎదుట ఫెడరల్ ఉద్యోగులు పెద్దయెత్తున ప్రదర్శన నిర్వహించారు. సరిహద్దు గోడకు నిధులివ్వాల్సిందేనని మంకుపట్టు పట్టిన ట్రంప్ అవసరమైతే తనకున్న ప్రత్యేకాధికారాన్ని ఉపయోగించి ఎమర్జెన్సీ విధిస్తానని బెదిరించారు. ఈ మిగతా 9లో

ఎపి ఆన్‌లైన్‌కే సెట్ల నిర్వహణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష(సిఇటి)ల నిర్వహణను 2019-20 సంవత్సరానికి కూడా ఉన్నత విద్యామండలి ఎపి ఆన్‌లైన్‌కు అప్పగించింది. ఇందుకు సంబంధించిన జీవో 4ను ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కె దమయంతి శుక్రవారం జారీ చేశారు. సెట్ల పరీక్షలను ఉన్నత విద్యామండలి కంప్యూటర్ ఆధారంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. 2018-19లో పరీక్షల్ని ఎపి ఆన్‌లైన్ ఎటువంటి సమస్యలు లేకుండా సక్రమంగా నిర్వహించిందని, అందువల్లే వచ్చే విద్యాసంవత్సరానికి కూడా అప్పగిస్తున్నామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సర్వీసు ధరలను జీవో 22 ఆధారంగా నిర్ణయించాలని సూచించారు.



ఆంధ్ర వంటకాల్ని అందించేందుకే ఫుడ్ ఫెస్టివల్

పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ జయరామిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్ర వంటకాలను జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులకు పరిచయం చేయాలన్న ఆలోచనలతోనే ఫుడ్ ఫెస్టివల్స్‌ను నిర్వహిస్తున్నామని పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ జయరామిరెడ్డి అన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌ను విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్రానికి చెందిన 66 రకాల ఆహార రుచులతో ఒక పుస్తకాన్ని తీసుకురానున్నట్లు చెప్పారు. సిఎం చంద్రబాబు నాయుడు పర్యాటక ప్రగతిపై దృష్టి సారించారన్నారు. పర్యాటకంగా అభివృద్ధి చెందితే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా మెరుగు పడతాయన్నారు. ప్రజల రుచులకు అనుగుణంగా వంటకాలు సిద్ధం చేయాలన్నారు. పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ పర్యాటకులను విశేషంగా ఆకర్షించేందుకు మంచి ఆహారాన్ని అందించాలని, సరిగా సమకూర్చగలిగితే వచ్చిన పర్యాటకులే బ్రాండ్ అంబాసిడర్లుగా మారతారని చెప్పారు. రాష్ట్రంలో తయారు చేస్తున్న వెదురు చికెన్ ఇప్పుడు జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం పరిపాలనా సంచాలకులు సాంబశివరావు, మార్కెటింగ్ సంచాలకులు శ్రీనివాసరావు, ఉపసంచాలకులు నిషార్ అహ్మద్, జనరల్ మేనేజర్లు హరనాథ్, సుదర్శన్, నోవాటెల్ జనరల్ మేనేజర్ మధుపాల్ తదితరులు పాల్గొన్నారు.



పండగ పోటు

- ప్రయివేటు ట్రావెల్స్ దోపిడీ
- మూడురెట్లు అదనపు ఛార్జీలు వసూలు
- ఆర్‌టిసిలోనూ ప్రత్యేక బాదుడు
- ప్రయాణికులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే సామెతకు వక్రభాష్యం చెబుతున్నాయి ప్రయివేటు ట్రావెల్స్ యాజమాన్యాలు. సంక్రాంతి నేపథ్యంలో ప్రయాణికులపై ఇవి అదనపు బాదుడును మొదలెట్టాయి. ప్రస్తుతం ఉన్న ఛార్జీల్లో 50 శాతం అదనపు వసూళ్లతో ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను నడుపుతుండగా, ప్రయాణికుల అవసరాలను ఆసరాగా చేసుకుని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాల వారు సాధారణ ఛార్జీలకు అదనంగా మూడు రెట్ల వరకూ పెంచి వసూలు చేయడం ఆరంభించారు. పండుగ వంటి కీలక రోజుల్లో బస్సుల ముందస్తు రిజర్వేషన్లను నిలిపివేయడం, ఈనెల 13 ఆదివారం కావడం, సోమవారం నుంచి సంక్రాంతి సెలవులు ఉండటం వల్ల రవాణా వ్యవస్థకు డిమాండ్ పెరిగింది. పండుగ వేళ ఇటు రైళ్లలో, అటు ఆర్‌టిసిలో నెలకొన్న రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయివేటు ట్రావెల్స్ యాజమాన్యాలు తమ దోపిడీని మొదలెట్టాయి. సాధారణ రోజుల్లో వసూలు చేసే దానికన్నా రెండు మూడు రెట్ల వరకూ అదనంగా వసూలు చేస్తున్నాయి. విశాఖపట్నం వెళ్లడానికి సాధా రణ రోజుల్లో నాన్ ఎసీ బస్సుకు రూ.500 వరకూ ఛార్జీ ఉండగా, ఇప్పుడు రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకూ ప్రైవేటు యాజమాన్యాల వారు వసూలు చేస్తున్నారు. అదే ఏసీ బస్సు సాధారణ రోజుల్లో రూ.700 నుంచి రూ.900 ఉండగా ఇప్పుడు, రూ.3 వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఇదేమని ఎవరైనా అడిగితే నచ్చితే రండీ, లేకపోతే వెళ్లిపోండీ అని సమాధానం చెబు తున్నారు. అంతేకాకుండా ప్రయాణికుల డిమాండ్ ఆధారంగా అనుమతి, ఫిట్‌నెస్ ధ్రువీకరణలు లేని బస్సులనూ రంగంలోకి దింపేందుకు అవకాశం ఉంది. దూరప్రాంత సర్వీసులకు ఇద్దరు డ్రైవర్లు తప్పనిసరిగా ఉండాల్సి ఉండగా బస్సుల సంఖ్య పెంచడంతో డ్రైవర్ల కొరత ఏర్పడింది. దీంతో సింగిల్ డ్రైవర్‌తోనే బస్సులను నడిపిస్తున్నారు. ప్రయివేటు బస్సులు (కాంట్రాక్ట్ క్యారేజీ)లకు ప్రతి స్టేజీలో నిలిపి ప్రయాణికులను ఎక్కించుకునే అనుమతిలేదు. కానీ ఈ నిబంధనను ఎవరూ పాటించడంలేదు. ప్రయాణీకులు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో రవాణాశాఖ ఈ విషయంలో చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది.

ఆర్‌టిసి అదనపు బస్సులు

కృష్ణా రీజియన్ పరిధిలో విజయవాడ, ఇబ్రహీంపట్నం, విద్యాధరపురం, గవర్నరుపేట, గన్నవరం డిపోలతోపాటుగా జిల్లావ్యాప్తంగా 1,200 బస్సులను ఆర్‌టిసి నడుపుతోంది. ఈ బస్సుల్లో నిత్యం దాదాపు 5 లక్షల మంది వరకూ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. పండుగ రోజుల్లో స్థానికంగా రాకపోకలతోపాటు దూర ప్రాంతాలకు ప్రయాణాలు పెరగడంతో ఈ సంఖ్య రెట్టింపవుతోంది. ప్రస్తుతం 9 లక్షల మంది ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సులు తిప్పేందుకు ఆర్‌టిసి ఏర్పాట్లు చేసింది. 120 బస్సులను ప్రత్యేకంగా నడుపుతోంది. అదేవిధంగా దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే బస్సుల సంఖ్య దాదాపు వంద వరకూ ఉంది. అయితే ఆర్‌టిసి ఊహించిన దానికంటే డిమాండ్ పెరిగింది. మరో వైపు రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నా ప్రయాణికుల అవసరాలు తీరని పరిస్థితి నెలకొంది. ఆర్‌టిసి అమరావతి, గరుడ, సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్, తెలుగు-వెలుగు, ఇతర ఆర్డినరీ బస్సులను నడుపుతుండగా ప్రయివేటు బస్సు సర్వీసులు వాల్వా, ఏసీ స్లీపర్, సెమీ స్లీపర్, నాన్ ఏసీ సీటర్ బస్సులు నడుపుతున్నాయి. వీటిలో టికెట్ల ధరలు విమాన సర్వీసులతో పోటీ పడుతుండటం గమనార్హం.

డొక్కు బస్సులే స్పెషల్స్

విజయవాడ నుంచి ప్రతిరోజూ విశాఖపట్నం, శ్రీకాకుళం, పలాస, విజయనగరం, హైదరాబాద్, తిరుపతి, బెంగళూరు, కాకినాడ, రాజమండ్రి, అమలాపురం వంటి దూర ప్రాంతాలతోపాటు ఇతర ప్రాంతాలకూ బస్సు సర్వీసులు నడుపుతున్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో వీటికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. వీటి సర్వీసును బట్టి టికెట్ ధరలను 50 శాతం మేర పెంపుదల చేశారు. సాధారణ రోజుల్లోనే విశాఖపట్నం, కాకినాడ, అమలాపురం, హైదరబాద్ సర్వీసులకు విపరీతంగా గిరాకీ ఉంటుంది. సంక్రాంతి నేపథ్యంలో ఇప్పుడు ఆ డిమాండ్ మరింత పెరిగింది. దీంతో కృష్ణా రీజియన్ పరిధిలో ఉన్న డొక్కు బస్సులను దూరప్రాంత సర్వీసులుగా నడుపు తున్నారు. విజయవాడలో సిటీ సర్వీసులుగా తిరిగే బస్సులను, మెట్రో బస్సు లను పండుగల సమయాల్లో దూర ప్రాంత సర్వీసులుగా తిప్పుతున్నారు. వాటికి సాధారణ ఛార్జీలకు అదనంగా 50 శాతం వసూలు చేస్తున్నారు. ఈ బస్సుల్లో ఇక్కడ నుంచి అమలాపురానికి వెళ్లడానికి దాదాపు 5 గంటల సమయం పడుతుంది. అదే హైదరాబాద్, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు వెళ్లడానికి 12 నుంచి 13 గంటల సమయం పడుతుంది. అంత సమయం ఆ బస్సుల్లో, కుదుపుల్లో కుర్చోలేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జగన్‌పై దాడి కేసు నిందితుడు శ్రీనివాస్‌కు ఏడు రోజుల ఎన్ఐఎ కస్టడీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



జగన్‌పై హత్యాయత్నం కేసులో నిందితుడు శ్రీనివాస్‌ను ఏడు రోజుల పాటు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) కస్టడీకి అప్పగిస్తూ శుక్రవారం విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టు న్యాయమూర్తి పార్థసారథి ఆదేశాలు జారీ చేశారు. నిందితుడిని ఎన్ఐఎ అధికారులు శనివారం ఉదయం విజయ వాడ జైలు నుంచి కస్టడీకి తీసుకోనున్నారు. పోలీస్ కస్టడీలో విచారణ సమయంలో తమ అడ్వకేట్ ఉండాలని నిందితుడు శ్రీనివాస్ కోర్టుకు విన్నవించుకున్నారు. ఈ కేసుకు సంబంధించి వైసిపి ఇప్పటికే కేవియట్ వేసింది. దీనిపై ప్రభుత్వం వ్యతిరేకంగా పిటీషన్ దాఖలు చేస్తే ఆ సమాచారాన్ని తమకు తెలియజేయాలంటూ కేవియట్ స్టేటస్ తెలుసుకునేందుకు మంగళగిరి ఎమ్మెల్యే హైకోర్టుకు వచ్చారు. ప్రభుత్వం ఎటువంటి పిటీషన్ దాఖలు చేయకపోవడంతో ఆయన కోర్టు నుంచి వెనుదిరిగారు. కేసు విచారణ సందర్భంగా నిందితుని తరపు న్యాయవాధి కోర్టుకు రాక పోవడంతో ఎన్ఐఎ అధికారులు వేసిన కస్టడీ పిటీషన్‌ను మధ్యాహ్నం వరకు పక్కనపెట్టారు.

22న భూ సమస్యలపై ఉన్నతాధికారుల సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చుక్కల భూములు, నిషేదిత భూముల సమస్యతో పాటు ఇతర భూసమస్యలన్నింటిపై ఈనెల 22న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సిసిఎల్ఎ కమిషనర్ నేతృత్వంలో ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియా కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించనున్నారు. భూసమస్యల్ని ఈనెల 24లోగా పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఇందుకు సంబంధించిన నివేదికలను ఈనెల 21 సాయంత్రానికల్లా ప్రభుత్వానికి అందించాలని ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో భూ సమస్యలు పరిష్కారం కావడం లేదనే విషయంపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి. ఇప్పటి వరకు జిల్లాల్లో భూముల సమస్యల్ని సకాలంలో ఎందుకు పరిష్కరించలేకపోతున్నారని, ఈ విషయంలో ఎదురయ్యే ఇబ్బందులను నిష్పక్షపాతంగా తెలియజేయాలని ఉన్నతాధికారులు దిగువ స్థాయి సిబ్బందిని కోరుతున్నారు. భూ సమస్యలు 15 రోజుల్లో పరిష్కరించకపోతే దీక్షకు దిగుతానని, ప్రభుత్వంలోని కొందరు ఉన్నతాధికారులు పరిష్కారానికి చొరవ చూపడం లేదని సినీ నటుడు శివాజీ ఇటీవల ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని రెవెన్యూ అధికారులు ప్రయత్నించాలని ఆ శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. లేని పక్షంలో భూ సమస్యలు రాజకీయంగా ప్రత్యర్థులకు పెద్ద అస్త్రంగా మారే అవకాశాలుంటాయని అధికార పార్టీ భావిస్తోంది.

భోగి రోజు పొగమంచు ఎందుకంటే..

ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రతి ఏటా దాదాపుగా భోగి రోజున పొగమంచు విపరీతంగా కురుస్తుంది. వేకువజాము నుంచి ఉదయం 9 గంటల వరకు కొనసాగుతుంది. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించనంత దట్టంగా పొగమంచు కమ్మేస్తుంది. అయితే ఏటేటా ఎందుకిలా జరుగుతుందంటే.. ఇన్‌వర్షన్ కారణంగానే పొగమంచు కురుస్తుందని విశాఖ వాతావరణ కేంద్రం విశ్రాంత శాస్త్రజ్ఞులు రాళ్లపల్లి మురళీకృష్ణ వివరించారు. భోగి రోజున వేకువ జామున 3 గంటల నుండే ఎక్కడికక్కడే చలి మంటలు వేస్తారు. దీని కారణంగా భూమి ఉపరితలం అంతా పొగ, దుమ్ము, దూళి కణాలతో నిండిపోతుంది. చలికాలంలో కిలోమీటరు ఎత్తులో ఇన్‌వర్షన్ పొర ఏర్పడుతుంటుంది. దీని వల్ల భూమి నుంచి కిలోమీటరు ఎత్తువరకు ఉష్ణోగ్రతలు 27 నుంచి 30 డిగ్రీల వరకు పెరుగుతాయి. దీనివల్ల కింద ఉన్న పొగ, తదితరాలు ఆ పొర వల్ల పైకి వెళ్లకుండా కిలోమీటరు ఎత్తులోనే స్తంభిస్తాయి. దానికి గాలిలో ఉన్న తేమ తోడై పొగమంచులా కురుస్తుంది. ఉదయం 9 లేదా 10 గంటలయ్యాక సూర్యుడి వేడి తగిలి ఇన్‌వర్షన్ పొర తొలగిపోవడంతో పొగ పైకి పోవడంతో సాధారణ స్థితికి చేరుకుంటుంది. భోగి మంటలు వేసినప్పుడు విపరీతమైన గాలులుంటే మాత్రం పొగమంచు కురిసే అవకాశం లేదని రాళ్లపల్లి చెబుతున్నారు.

కర్నాటక, విదర్భ ప్రాంతాల్లో ద్రోణి

కర్నాటక తీరం నుంచి మరట్వాడా, విదర్భ మీదుగా మధ్యప్రదేశ్ వరకు ద్రోణి ఏర్పడినట్లు భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది మరింత కిందకు దిగి ఆంధ్రప్రదేశ్ వైపునకు వస్తే రాష్ట్రంలో చలి పెరిగే అవకాశముందని రాళ్లపల్లి అంటున్నారు. దీనివల్ల ఉత్తరాది చలి గాలులు రాష్ట్రం వైపునకు లాగుతాయన్నారు. పండగ తర్వాత మళ్లీ చలి తీవ్రత తగ్గుతుందని, పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని పేర్కొన్నారు

భాగస్వామ్య పక్షాల విశ్వసనీయతను కోల్పోయిన మోడీ : యనమల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భాగస్వామ్యపక్షాల విశ్వసనీయతను ప్రధాని మోడీ కోల్పోయారని, పాత మిత్రులతో దోస్తీకి సిద్ధం అనడం ఆయన దివాలా కోరు తనానికి నిదర్శనమని ఆర్థిక శాఖా మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. సంకీర్ణానికి గేట్లు తెరిచామని మోడీ చెప్పడం హాస్యాస్పదమన్నారు. మోడీ వ్యాఖ్యలు బిజెపి దుస్థితిని తెలియజేస్తోందన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓడిపోతామనే భయంతో ఎన్నికలకు రెండు నెలల ముందు అగ్రవర్ణాల్లో వెనుకబడిన తరగతులకు పదిశాతం రిజర్వేషన్లు అంటూ మోడీ ప్రకటించడం తాజా జిమ్మిక్కుగా యనమల పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చే హామీలను ప్రజలు నమ్మరని, ఓడిపోతామనే భయమే తప్ప ఈబిసిలపై మోడీకి ప్రేమ లేదని అన్నారు. జులై నుంచే పది శాతం రిజర్వేషన్లు అమలవుతాయని చెప్పడం ఇందుకు తార్కాణమన్నారు. ఆర్థిక వెనుకబాటుతనంపై ఎస్సీ, ఎస్టీల్లో అనేక అనుమానాలున్నాయని పేర్కొన్నారు. ఆయా వర్గాలను కూడా ఈబిసిల్లోకి తీసుకొస్తారనే భయం వారిలో ఉందన్నారు. బిజెపి అంటేనే బలహీనవర్గాల్లో భయం పట్టుకుందన్నారు. మోడీ చేష్టలు అంబేద్కరిజానికి వ్యతిరేకమని, న్యాయపరంగా నిలబడదని తెలిసి కూడా ఈబిసి బిల్లును పెట్టడం వారికి ద్రోహం చేయడమేనని ఆయన పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లపై మోడీ ఎందుకు స్పందించరని యనమల ప్రశ్నించారు.

25 నుంచి మున్సిపల్ టీచర్ల బదిలీలు

అంతర్ జిల్లా బదిలీలకు సిఎం ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల బదిలీల రెండో దశ షెడ్యూల్‌ను రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. గతంలో బదిలీలకు ప్రభుత్వం అనుమతిచ్చిన సంగతి తెలిసిందే. దీంతో పాటు అంతర్‌జిల్లా బదిలీలకు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం ఆమోదం తెలిపారు. సాధారణ బదిలీలకు గతంలో విడుదల చేసిన జీవో 507, దీనికి సవరణలతో విడుదల చేసిన జీవో 1137 అనుసరించి షెడ్యూల్‌ను మున్సిపల్ శాఖ డైరెక్టర్ కన్నబాబు శుక్రవారం విడుదల చేశారు. బదిలీకి ఈ నెల 17 నుంచి 19 వరకు ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ల ద్వారా ఆర్‌డిలకు ఈ నెల 20, 21 తేదీల్లో పంపాలని తెలిపారు. తుది జాబితాను 24లోగా సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ నెల 25 నుంచి 29వరకు బదిలీ కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. బదిలీ ఉత్తర్వులు 30,31 తేదిల్లో విడుదల చేస్తారని తెలిపారు. 2017 రేషనలైజేషన్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయుల సర్వీస్‌ను రేషనలైజేషన్‌కు ముందు పనిచేసిన పాఠశాలలో చేరిన తేదీని ప్రాతిపదికగా తీసుకోవాలని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి బాబురెడ్డి డిమాండ్ చేశారు. అంతర్‌జిల్లా బదిలీలకు పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు జారీచేసి వెంటనే కౌన్సిలింగ్ చేపట్టాలని కోరారు. అంతర్ జిల్లా బదిలీల ప్రక్రియ ఎనిమిది నెలల నుంచి కొనసాగుతోందని, ఇప్పటికైనా ఆలస్యం చేకుండా సంక్రాంతి సెలవుల్లోనే కౌన్సిలింగ్ నిర్వహించి రిలీవ్ చేయాలని ఎపిటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె వెంకటేశ్వరరావు, జి హృదయరాజు ప్రకటనలో కోరారు. ఇచ్చిన హామీ మేరకు బదిలీ ఉత్తర్వులను మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ విడుదల చేశారని ఎపి మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ రామకృష్ణ, ఎం రవి సిద్ధార్థ ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులకు మంత్రి అంగీకరించారని, త్వరలోనే షెడ్యూల్ రానుందని పేర్కొన్నారు.

శాసన మండలి యాక్టింగ్ చైర్మన్‌గా రెడ్డి సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్య విద్య, ఎన్టీఆర్ వైద్యసేవ, మైనార్టీ శాఖల మంత్రిగా ఎన్ఎమ్‌డి ఫరూక్ బాధ్యతలు స్వీకరించినందున శాసన మండలి యాక్టింగ్ చైర్మన్‌గా డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం బాధ్యతల్ని చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో మండలి చైర్మన్‌కు పాటించే ప్రొటోకాల్‌ను డిప్యూటీ చైర్మన్‌కు తప్పనిసరిగా అమలుచేయాలని అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ నిర్ణయించింది. ఆదేశాల్ని అమలుచేయాలంటూ సాధారణ పరిపాలన శాఖ కూడా సర్క్యులర్ జారీ చేసింది. ఫరూక్‌ను మంత్రిగా కాకుండా పలుమార్లు మండలి చైర్మన్‌గానే సంబోధిస్తున్నందున ఆ విషయం కమిటీ దృష్టికొచ్చింది. ఇకపై ఆయనను మంత్రిగానే సంబోధించాలని, మండలి చైర్మన్‌గా ప్రభుత్వ శాఖలకు చెందిన ఏ లేఖల్లోనూ పేర్కొనరాదని అన్ని ప్రభుత్వ శాఖలకు సాధారణ పరిపాలన శాఖ ఆదేశాలు జారీ చేసింది.

పట్టణస్థానిక సంస్థల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పాతబకాయిలు విడుదల

మున్సిపల్‌శాఖ డైరెక్టర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అన్ని పట్టణస్థానిక సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికి 2017 జులై నుండి 2018 సెప్టెంబర్ వరకు ఉన్న బకాయిలను విడుదల చేస్తూ రాష్ట్ర మున్సిపల్‌శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఉన్న అన్ని పట్టణస్థానిక సంస్థల్లో ఉన్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాల్సిన పాత బకాయిలను చెల్లించాలంటూ మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అర్హతగల కార్మికులకు తక్షణమే 50శాతం బకాయిలను విడుదల చేయాలనీ, మిగతా 50శాతం బకాయిలను కార్మికుల పని, హాజరు, జీతభత్యాల ఆధారంగా విడుదల చేయాలనీ సూచించారు.



అమీన్‌పీర్ దర్గాను దర్శించుకున్న జగన్

ప్రజాశక్తి-తిరుమల/కడప

వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం కడప అమీన్‌పీర్ దర్గాను దర్శించుకున్నారు. ఆయనకు పార్టీ శ్రేణులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. దర్గాలో జగన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చాదర్ సమర్పించారు. రాత్రికి పులివెందులకు చేరుకుంటారు. శని, ఆదివారాలు ఆయన ఇడుపులపాయ, పులివెందులలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 'సంకల్ప'యాత్ర ముగించుకుని తిరుపతి చేరుకుని, తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. గురువారం రాత్రి శ్రీకృష్ణ అతిథిగృహంలో బస చేశారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఇడుపులపాయకు బయలు దేరారు. తిరుమల, తిరుపతిలోని తన పర్యటనలో జగన్ ఎక్కడా రాజకీయాలను ప్రస్తావించకపోవడం గమనార్హం.

కడప జిల్లాలో అడుగుపెట్టిన ఆయనకు రైల్వేకోడూరు, రాజంపేట, కడప నియోజకవర్గాల పరిధిలో అపూర్వ సాగతం లభించింది. రైల్వేకోడూరులో జగన్‌కు హార్టీకల్చర్ యూనివర్సిటీ విద్యార్థుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. వారి సమస్యలపై స్పందిస్తూ.. మరో మూడు నెలలు ఓపిక పడితే మన ప్రభుత్వం వస్తే మీరు కోరిన విధంగా ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. చంద్రబాబు హయాంలో ధర్నాలు చేసి చదువులు పాడుచేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. కడపకు చేరుకున్న జగన్ అమీన్‌పీర్ దర్గాను దర్శించుకున్నారు.

ప్రత్యేకం

లింకేజి నిధుల కోసం ఒత్తిడి

- సంక్షేమ పథకాలపై ప్రభుత్వ తీరు
- పదేపదే బ్యాంకర్లతో భేటీలు



రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో సిఎంచంద్రబాబు (ఫైల్)

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎన్నికల సీజన్ దగ్గరకు వచ్చేస్తోంది. ఖజానాలో కాసులు కరువవుతున్నాయి. ఉన్న నిధులు సాధారణ వ్యయానికే సరిపోయే పరిస్థితి నెలకొంది. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. అందుకే బ్యాంకులపై ఆధారపడాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఒకవైపు అప్పులు చేస్తూనే... మరోవైపు లింకేజి రూపంలో లబ్ధిదారులకు నిధులు బ్యాంకుల ద్వారానే అందించేందుకు చర్యలు వేగవంతం చేస్తోంది. సహకరించని బ్యాంకులపై ఒత్తిడి చేస్తోంది.

గత కొన్ని నెలలుగా ఖజానా ఇబ్బందుల్లో కొనసాగుతోంది. వేస్ అండ్ మీన్స్, ఓవర్‌డ్రాఫ్టలతో సాగుతోంది. ఈ పరిస్థితుల్లో సంక్షేమ పథకాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా ఇళ్ల నిర్మాణం, పింఛన్లు, ఎస్సీ, ఎస్టీ, బిసి లబ్ధిదారులకు ఇచ్చే ఇతర పథకాలను కూడా బ్యాంకు లింకేజి ద్వారానే అందించేందుకు సర్కారు చర్యలు తీసుకుంటోంది. దీనికోసం రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి ద్వారా అన్ని బ్యాంకులకు ఈ లక్ష్యాలను ఇస్తున్నారు. అయితే ఈ లక్ష్యాల సాధనలో బ్యాంకులు ఆశించిన స్థాయిలో ప్రగతి సాధించడం లేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇలాగే కొనసాగితే వచ్చే మార్చి నాటికి జనానికి సమాధానం చెప్పుకోవడం కష్టమని అధికారులు అంటున్నారు. అందుకే బ్యాంకులపై ఒత్తిడి పెంచాలని ఆర్థికశాఖ భావిస్తోంది. దఫదఫాలుగా బ్యాంకర్లతో భేటీలు నిర్వహించి లక్ష్య సాధనకు పరుగులు పెట్టించాలని భావిస్తోంది.

ఇటీవల రెండు దఫాలుగా పేదరికంపై గెలుపు పేరిట నిర్వహించిన ఆదరణ మెగా గ్రౌండింగ్ కార్యక్రమంలో దాదాపు రూ.1500 కోట్ల మేర పథకాలను అందించాలని నిర్ణయించారు. లాంఛనంగా కొంతమందికి అందించినప్పటికీ, మిగిలిన వారికి బ్యాంకుల నుంచి సహకారం లభించకపోవడంతో లబ్ధి సక్రమంగా అందించలేకపోయారు. ఇదే సమయంలో డ్వాక్రా రుణాలపైనా ఇదే పరిస్థితి నెలకొంది. ఇక ఇళ్ల నిర్మాణానికి కూడా నిధుల కొరత వేధిస్తోంది. 2019 మార్చిలోగా వీలయినన్ని ఎక్కువ ఇళ్లు నిర్మించాలని చంద్రబాబు నిర్ణయించారు. అయితే క్షేత్ర స్థాయిలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. వివిధ స్థాయి నిర్మాణాలకు బ్యాంకుల నుంచి నిధులు అందడంలేదన్న ఆరోపణలు లబ్ధిదారుల నుంచి వినిపిస్తున్నాయి.

పండగెట్లా చేయాలి?

పల్లెల్లో కనపడని సంక్రాంతి సందడి



వెలవెలబోతున్న కడప జిల్లా కాశినాయన మండలం గొంటువారిపల్లె

గడప గడపన రంగు రంగుల హరివిల్లులు.. వాటి మధ్యలో గొబ్బెమ్మలు, హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, యువత కోలాట ప్రదర్శనలు, బంధువులు, స్నేహితులతో సందళ్లు, పిండి వంటలతో రోళ్ల మోతలు, కొత్త బట్టలతో పిల్లల కేరింతలు.. ఇవీ పల్లెల్లో సంక్రాంతి పండుగ అనగానే టక్కున గుర్తొచ్చేవి. అయితే ఈ ఏడాది కరువు ప్రభావంతో ఆ సందళ్లు దూరమయ్యాయి. హరిదాసుల ఊసే లేదు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఈ ఏడాది ఇదే పరిస్థితి. సంక్రాంతి సందడి గ్రామాల్లో ఏ విధంగా నెలకొందో క్షేత్ర స్థాయి పరిశీలనకు ప్రజాశక్తి వెళ్లింది. ఇందులో సంక్రాంతి శోభ ఎక్కడా కనిపించలేదు.

ప్రజాశక్తి- యంత్రాంగం

ఈ ఏడాది వర్షాలు కురవక ఖరీఫ్, రబీ పంటలన్నీ ఎండిపోయాయి. వచ్చిన అరకొర దిగుబడులకు గిట్టుబాటు ధరా లభించలేదు. పొట్ట కూటి కోసం రైతులు, వ్యవసాయ కార్మికులు వలసలు వెళ్లారు. ఈ పండుగలో ప్రధాన ఆకర్షణగా ఉండే ఎద్దులు పశుగ్రాసం లేక బక్కచిక్కి పోయాయి. కుటుంబ సభ్యుల వలసలతో బోసి పోయిన గ్రామాల్లో బిక్కచూపులతో వృద్ధులు అర్థాకలితో అలమటిస్తున్నారు. కర్నూలు జిల్లా సగటు వర్షపాతం 605 మి.మీ. కానీ కేవలం 300 మి.మీ మాత్రమే కురిసింది. దీంతో వేసిన విత్తు, మొలకలు మట్టిలోనే కలిసిపోయాయి. వేరుశనగ, మొక్కజొన్న, జొన్న లాంటి పంటలు పశుగ్రాసానికి కూడా పనికిరాకుండా ఎండిపోయాయి. పత్తి ఎకరాకు క్వింటా, 2 క్వింటాళ్లు కూడా దిగుబడి రాలేదు. ఈ ఒక్క ఈ జిల్లాలోనే మొత్తం దాదాపు రూ. 4,200 కోట్ల పెట్టుబడి మట్టిపాలైంది. దాదాపు 8 లక్షల మంది వ్యవసాయ కార్మికులకు పనులు లేకుండాపోయాయి.ఉపాధి పనులు పక్కదారి పట్టడంతో గత ఐదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈసారి భారీ ఎత్తున వలసలు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇప్పటివరకూ కరువు ఉపశమన చర్యలూ చేపట్టలేదు. కడప జిల్లాలో 40 ఏళ్లుగా కనీవినీ ఎరుగని దుర్భిక్షం ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం, ఇన్స్యూరెన్స్ చెల్లింపుల కింద సుమారు రూ.850 కోట్లు చెల్లింపులపై మీనమేషాలు లెక్కిస్తోంది. ప్రకాశం జిల్లాలో సాగర్ నీరు లేక మొక్కజొన్న, మిర్చి, కంది, పత్తి ఎండిపోయాయి. పంగులూరులో 5000 జనాభా ఉంది. మూడు వేల ఎకరాలు సాగు చేస్తున్నారు.. కాలువ చివర భూములు కావడంతో నీరందక మాగాణి ఆగింది. ఈ ఏడాది 500 ఎకరాల్లో సుబాబులు, 300 ఎకరాల్లో పత్తి, 200 ఎకరాల్లో మిర్చి, 700 ఎకరాల్లో శనగ, 500 ఎకరాల్లో ఇతర పంటలు వేశారు. 800 ఎకరాలు ఖాళీ బీడు భూమిగా ఉంది. మిర్చికి బొబ్బరు తెగులు ఆశించడం, నీటితడి సరిగా అందకపోవడం వల్ల గరిష్టంగా 4 క్వింటాళ్ల దిగుబడే వస్తోంది. శనగ ఎకరాకు మూడు క్వింటాళ్లకు మించ లేదు. పత్తి మొక్కలు గిడసబారిపోయి ఎకరాకు క్వింటాకు పరిమితమైంది. వర్షాలు లేకపోవడంతో సుబాబులు కర్ర ఊరలేదు. నెల్లూరు జిల్లాలోనూ తీవ్ర వర్షాభావం ఏర్పడింది. పెన్నా, సోమశిల పూర్తిగా ఆదుకోలేకపోయాయి. తుపాను కారణంగా అయినా వచ్చే వర్షాలపై కూడా రైతులు ఆశ పెట్టుకున్నా...ఆ వర్షాలూ పడలేదు. దీంతో రైతులు తీవ్ర నిరాశ వ్యక్తపరుస్తూ పండగ ఎలా చేసుకోగలమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతంలోనూ పరిస్థితులు వీటికి భిన్నమేమీ కావు. ఇక్కడ 11 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. అయితే ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని చెప్పి ఇప్పటివరకూ ఇవ్వలేదు.ప్రధానంగా మాచర్ల, వినుకొండ, పెదకూరపాడు, గురజాల, బాపట్ల నియోజకవర్గాల్లో మిర్చి, పత్తి, వాణిజ్య పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులను అప్పుల ఊబిలోకి నెట్టేశాయి. కృష్ణాజిల్లాలో తుపాను కారణంగా లక్షా 25 వేల ఎకరాల్లో వరి నీట మునిగింది. ధాన్యం మొలకలొచ్చి రంగు మారి నాణ్యత కోల్పోయింది. ధాన్యం కొనుగోలుకు నిబంధనలు సడలిస్తామని చెప్పినా కొనుగోలు చేయకపోవడంతో రైతుల చేతిలో డబ్బు లేక పండగ అవసరాలను ఏ మేరకు కుదించుకోవచ్చు అనే ఆలోచనలో పడ్డారు.



ఆరు నెలలైంది...ఇంతవరకూ రాలేదు

ఈ చిత్రంలో ఉన్న తల్లీ కూతుళ్లు ఎర్రక్క, మల్లీశ్వరి. చిత్తూరు జిల్లా కెవిపల్లి మండలం నూతనకాలువ పంచాయతీ గుట్టలపై వడింపల్లి. మూడు ఎకరాల భూమిలో రెండు బోర్ల ఆధారంగా గత ఏడాది వరకు వేరుశనగ వేసేవారు. దాంతో పాటు రెండు ఆవులు పెట్టుకుని ఇంటిని నెట్టుకొచ్చేవారు. ఈ సారి వర్షాభావంతో బోర్లు వట్టిపోయాయి. పొలం బీడువారిపోయింది. ఇబ్బందిగా ఉండడంతో ఆవులను అమ్మేశారు. ఊళ్లో పనుల్లేక పోవడంతో అల్లుడు, మనవడు ఆరు నెలల క్రితం బెంగుళూరు వెళ్లారు. ఇప్పటి వరకూ ఇంటికి రాలేదు. పండగకు కూడా వస్తారని నమ్మకం లేదు. చేతుల్లో చిల్లిగవ్వ లేకపోయే సరికి పండగ ఊసే లేకుండా పోయింది. ములసమ్మకు వచ్చే పింఛను డబ్బులు, రేషన్ బియ్యం ఆధారంగా కాలం గడుపుతున్నారు. ఇది ఎర్రక్క, మల్లీశ్వరిల కుటుంబ పరిస్థితి మాత్రమే కాదు.. ఈ గ్రామంలో అన్ని ఇళ్లల్లోనూ ఇదే దుస్థితి.

సగమే సాగు...అదీ ఎండింది

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలోని సి.బెళగల్ మండలంలో మొత్తం దాదాపు 5,500 జనాభా ఉంది. బురాన్‌దొడ్డిలో 5 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో కేవలం 3 వేల ఎకరాల్లోనే పంటలు సాగు చేశారు. ఎక్కువగా వేరుశనగ, పత్తి, ఉల్లి, కంది పంటలను సాగు చేశారు. వర్షాభావంతో పంటలు ఎండిపోవడంతో గ్రామంలో పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. వర్షం వస్తేనే పంట చేతికొచ్చే పరిస్థితి. ఇక్కడ దాదాపు 700 కుటుంబాలుండగా ఇందులో 300 కుటుంబాలు వలస వెళ్లాయి.

పండగేం లేదు : సుంకన్న, బురాన్‌దొడ్డి

కరువుతో పండగకు దూరమయ్యాం. పత్తి వేస్తే మొత్తం ఎండిపోయింది. కుటుంబం గడిచేందుకు పిల్లల్ని మావద్ద ఉంచి కొడుకు, కోడలు బతికేందుకు హైదరాబాదుకు పోయారు. కొడుకు, కోడలు లేకపోవడంతో మాకు సంక్రాంతి కూడా లేదు.

సందడి లేని ఉద్దానం

తిత్లీ తుపాను ప్రభావంతో శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి సందడి కానరావడం లేదు. వరి, కొబ్బరికాయలను అమ్ముకుని, వచ్చిన డబ్బులతో ఉద్దానం ప్రాంత రైతులు ఏటా పండగను చేసుకునేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. నష్టపోయిన పంటకు డబ్బులు వచ్చినా, కనీసం పండగైనా గట్టెక్కేదని బాధితులు వాపోతున్నారు. పలాస మండలం బొడ్డపాడు పంచాయతీకి చెందిన బొడ్డు దుష్యంతరావుకు ఎకరా నాలుగు సెంట్ల పొలంలో కొబ్బరి తోట ఉంది. గత అక్టోబర్‌లో వచ్చిన తిత్లీ తుపానులో 25 చెట్లకుగాను 16 చెట్లు పడిపోయాయి. ఆరు చెట్లకు మాత్రమే పరిహారం డబ్బులు వచ్చాయి.ప్రభుత్వం చెట్టుకు రూ.1,500 చొప్పున రూ.10,500 ఇచ్చింది. కూలిపోయిన చెట్టును తొలగించేందుకు ఒక్కొక్క చెట్టుకూ రూ.200 చొప్పున మొత్తం రూ.3,200 ఖర్చయింది. 'ప్రతి ఏడాదీ పండగ చేస్తున్నాం. ఈ ఏడాది వస్త్రాల కొనుగోలు ఖర్చును తగ్గించుకున్నాం. పండగ చేసుకోవడానికి అప్పు కోసం ప్రయత్నిస్తున్నాం'. అని ఆవేదనతో చెప్పాడు.



గతంలో 12 క్వింటాళ్లు..నేడు క్వింటానే..

కడప జిల్లా కాశినాయన మండలానికి చెందిన పోచమ్మ అనే మహిళా రైతు ఆర్థిక స్థితిగతులను పరిశీలిస్తే గతేడాది నాలుగెకరాల్లో 12 క్వింటాళ్ల కంది పంట చేతికి వచ్చింది. ఫలితంగా క్వింటా ఐదు వేల చొప్పున రూ.60 వేలు చేతికి వచ్చింది. రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు పండుగకు ఖర్చు చేసి ఆడపిల్లలు, మనమలను ఇంటికి పిలుచుకుని కొత్తబట్టలు పెట్టి, పిండివంటలతో పండుగ చేసుకుంది అయితే ఈ ఏడాది నాలుగెకరాలకు కలిసి క్వింటా కందులూ చేతికి రాకపోవడంతో పండుగను ఎలా గడపాలో అర్థం కాని దుస్థితి. దీంతో కొత్త బట్టలు, పిండివంటలకు సరుకులు కొనుగోలు చేయలేదు.

బెల్లం రైతుకూ చేదే

బెల్లం మార్కెట్‌కు ప్రసిద్ధిగాంచిన విశాఖ జిల్లా తిమ్మరాజుపేట అప్పులపాలై తల్లడిల్లు తోంది. తెగుళ్లతో చెరకు దిగుబడి తగ్గిపోవడం, బెల్లం ధర గిట్టు బాటుకాకపోవడంతో అప్పులుజేసి పెట్టిన మదుపులకు పంటచేతికి రాకపోవడంతో చెరకు సాగును వదులుకోవాల్సి వచ్చింది. 35 బెల్లం తయారీ క్రషర్లకుగాను ఇప్పుడు ఐదు క్రషర్లు మాత్రమే పనిచేస్తున్నాయి. బతకడానికి రైతు ఎంచుకున్న మార్గాలన్నీ మూసుకుపోవడంతో ఊరంతా ఒట్టిబోయింది. తిమ్మరాజుపేటకు చెందిన మల్ల జగన్నాథరావుకు రెండెకరాల పల్లపు భూమివుంది. వరి పంట మదుపునకు రాకపోవడం తో పండగ ఖర్చులకు పదివేల అప్పుకోసం తిరుగుతున్నాడు.

లక్షలాది మంది వలసలు

ఈ జిల్లా ఆ జిల్లా అని లేదు. రాష్ట్రంలోని దాదపు అన్ని జిల్లాల్లోనూ పనులు దొరకక బెంగుళూరు, హైదరాబాద్, చెన్నయ్, తిరుపతి, విజయవాడ, విశాఖ పట్నం వంటి నగరాలకు వలస వెళ్లి ఏ పని దొరికితే ఆ పని చేస్తున్నారు. ఒక్క విజయనరం జిల్లా నుండే దాదాపు 2 లక్షల మంది ఇలా వెళ్లి ఉంటారని ఓ అంచనా. దత్తిరాజేరు మండలం తాడెందొరవలస, మెంటాడ మండలం జక్కువ, బడేవలస, కుటుభక్తువలస గ్రామాలను ప్రజాశక్తి సందర్శించినప్పుడు గ్రామాలు బోసిపోయాయి.

సంపాదకీయం

జగన్ పాదయాత్ర

ఒక సంవత్సరం పాటు సాగిన ప్రజాసంకల్ప యాత్ర ముగిసింది. ప్రతిపక్ష నేత, వైఎస్ఆర్‌సిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ పాదయాత్రలో ప్రజలను నేరుగా కలిసి సమయం వెచ్చించడం మంచిదే. ప్రజలతో మమేకం అవుతూ వారి సాదకబాధలను, కష్టసుఖాలను తెలుసుకునేందుకు పాదయాత్ర లాంటి కార్యక్రమాలు రాజకీయ నాయకులకు ఎంతగానో ఉపయోగపడతాయి. క్షేత్రస్థాయిలో ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలను అవగతం చేసుకోవడానికీ, ఆ సమస్యల పరిష్కారం కోసం విధాన రూపకల్పనకూ, ఆ దిశగా వారిని చైతన్యపర్చేందుకూ ఇలాంటి యాత్రలు తోడ్పడుతాయి. ఐతే పాదయాత్రల్లో రెండు తరహాలున్నాయి. ప్రజా ఉద్యమాలలో భాగంగా జరిగేవి మొదటి తరహా యాత్రలు. జాతిపిత మహాత్మగాంధీ నిర్వహించిన దండి ఉప్పు సత్యాగ్రహ యాత్ర ఇలాంటిదే. మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో అఖిల భారత కిసాన సభ నేతృత్వాన లక్షలాది మంది అన్నదాతలు, గిరిజనులు చేపట్టిన పాదయాత్రలు అక్కడి అధికార పీఠాలనే కుదిపేశాయంటే ఉద్యమ పాదయాత్రలకుండే రాజకీయ ప్రాధాన్యత అర్థం చేసుకోవచ్చు. ఇక రెండో కోవలోకి వచ్చేవి..మన రాష్ట్రంలో పూర్వ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తర్వాత ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబునాయుడు సాగించిన పాదయాత్రలు. ఇవి వారికి అధికార ఫలాలనిచ్చాయి. అందువల్ల అన్ని పాదయాత్రలను ఒకే గాటన కట్టలేము.

2017 నవంబర్ 6న ఇడుపులపాయలోని రాజశేఖరరెడ్డి స్మారకం నుంచి ప్రారంభించిన 'ప్రజా సంకల్పయాత్ర' ఈ నెల 9న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో విజయవంతంగా ముగిసింది. ఆదాయానికి మించిన ఆస్తులు, క్విడ్ ప్రోకో కేసుల్లో నిందితుడిగా ఉన్న జగన్ కోర్టు హాజరు మూలాన వారం రోజుల్లో ఒక్క శుక్రవారం మినహా ప్రతి రోజూ సగటున పదిన్నర కిలోమీటర్ల దూరం నడుస్తూ యాత్ర సాగించారు. 341 రోజుల పాటు సాగిన ఈ యాత్రలో ఆయన ఏకంగా 3,648 కిలోమీటర్ల దూరం నడిచి పాదయాత్రల చరిత్రలో కొత్త రికార్డు నమోదు చేశారు. 13 జిల్లాలోని నగరాలను, జిల్లా కేంద్రాలను, పట్టణాలను కలుపుతూ ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు సాగిన ఈ పాదయాత్రకు, బహిరంగ సభలకు జన సమీకరణ బాగానే జరిగింది. రాజశేఖరరెడ్డి అభిమానులు, ఆయన ప్రభుత్వ హాయంలో సంక్షేమ పథకాల నుంచి లబ్ధి పొందిన ప్రజలు జగన్ యాత్రను స్వాగతించారనడంలో సందేహం లేదు. జగన్ కూడా వారితో సెల్ఫీలు, దిగుతూ తలలు నిమురుతూ సినీ కథానాయకుడి తరహా పాపులారిటీ కోసం ప్రయత్నించారు. పాదయాత్రలో దారిపొడువునా ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌పై వ్యక్తిగత ఆరోపణలు గుప్పిస్తూ ముందుకు సాగారు.

'అన్నా ఇది మా గోడు..మీరైనా కాస్త పట్టించుకోండి' అంటూ ఆర్తనాదాలతో అర్తించిన ప్రజానీకానికి ఒట్టి ఓదార్పులు మినహా వారి సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు జగన్ చేసిన కృషి ఏదీ కానరాదు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా రాష్ట్రాన్ని వంచించిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని కానీ, ప్రధాని నరేంద్ర మోడీని కాని జగన్ పల్లెత్తు మాట కూడా అనకపోవడం రాష్ట్ర ప్రజానీకం జీర్ణించుకునే వ్యవహారమేమీ కాదు. ఎంతసేపూ మన ప్రభుత్వం వస్తుంది..నేను ముఖ్యమంత్రిని అవుతా..30 ఏళ్లు మన ప్రభుత్వమే ఉంటుందంటూ 'నవరత్నాల' పలుకులు పలికారే తప్ప ప్రజాసమస్యల పరిష్కారం పట్ల ఆయన చిత్తశుద్ధి చూపలేకపోయారు. వైఎస్ఆర్‌సిపి తీసుకొస్తామంటున్న ఈ నవరత్నాలు కూడా గతంలో వైఎస్ఆర్, ఇప్పుడు చంద్రబాబు అమల్జేస్తున్న సంక్షేమ పథకాలకు మారు పేర్లు మినహా రాజకీయంగా ప్రత్యామ్నాయ విధానాలేమీ కాదు. వ్యక్తి కేంద్రంగా నడిచే ఇలాంటి కార్పొరేటు అనుకూల రాజకీయ పక్షాల నుంచీ ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలను ఆశించడమూ అత్యాశే అవుతుందనేందుకు ఇదే ఉదాహరణ. పాదయాత్రలో కొన్ని నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. విశాఖ విమానాశ్రయంలో జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి జరగడం, ఈ దాడి వెనుక నిజానిజాలేంటనేది చూడకుండా అటు అధికార టిడిపి, ఇటు వైఎస్ఆర్‌సిపి వ్యవహరించిన తీరు ఆ పార్టీల రాజకీయ ప్రయోజనానికే పెద్దపీట వేసింది. ఒక సంవత్సరం పాటు ప్రతిపక్ష నేత శాసనసభకు పోకుండా ఒక్క ప్రజా సమస్యనూ లేవనెత్తకుండా వుండడం వైఫల్యానికి సంకేతమే తప్ప సామర్థ్యానికి మాత్రం కాదు. అంతిమంగా ప్రతిపక్ష నేత చేపట్టిన ఈ పాదయాత్ర అధికారం లక్ష్యంగా చేసుకొని సాగించిన యాత్రగానే నిలుస్తుంది.

ఇదీ విషయం



పెద్దగా నేర్పిందేమీ లేదు
పలక మీద దయ అనే రెండక్షరాలు రాసి
దిద్దించాను
కాసిని ముళ్లూ రాళ్లూ ఉండే దారి చూపించి
నిబ్బరంగా నడిపించాను
అక్కర పడినప్పుడు కొత్తదారులు
కనుక్కోమ్మన్నాను

- డాక్టర్ పాపినేని శివశంకర్

విశ్లేషణ

మానవ హితమా? దురాచారాలా? ఏది మతం?



డి రమాదేవి

శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో మహిళల ప్రవేశానికి మేం వ్యతిరేకం కాదంటారు. పది సంవత్సరాలలోపు 50 సంవత్సరాల పైన వాళ్లను అనుమతించటమే నిదర్శనమంటారు. 10 నుండి 50 ఏళ్ల మధ్య వయస్సు మహిళలకు అనుమతి ఎందుకు లేదు అంటే ఆయన నైస్థిక బ్రహ్మచారి అంటారు. అయ్యప్పకు కూడా హక్కులున్నాయి. ఆ హక్కులను గుర్తించాలి అంటారు.

రాగ ద్వేషాలకి అతీతుడు దేవుడు అని చెప్పిందీ వీళ్లే. వయస్సులో ఉన్న ఆడవాళ్లు సందర్శిస్తే ఆయన నిష్ట చెడిపోతుందని వాదిస్తున్నదీ వీళ్లే. ఇందులో ఏది సరైనది అనడిగితే సమాధానం చెప్పలేని వారు అది మా విశ్వాసం అంటారు. అందులో కోర్టులకేం పని అంటారు. అయితే సుప్రీం కోర్టుకు మొదట వెళ్లింది యంగ్ రాయల్స్ అసోసియేషన్. అందులో ఇరువురు మహిళలు ఆరెస్సెస్‌తో సంబంధం వున్నవారు. ఈ కోర్టు తీర్పును స్వాగతించింది బిజెపి. కానీ నాలుక మడత వేసి మత సెంటిమెంట్లను రెచ్చగొట్టి కేరళలో ఘర్షణలకు పూనుకున్నదీ బిజెపియే. దానికి వంత పాడుతున్నది కాంగ్రెస్.

'హిందూ మతం జోలికే ఎందుకొస్తున్నారు? ముస్లిం విశ్వాసాల్లో కూడా మీరిలాగే జోక్యం చేసుకుంటారా' అని దాడి చేస్తారు. వీరిది హిందూ మతం మీద ప్రేమా? లేక తక్కిన మతాలపై ద్వేషమా? హిందూ మతం మీద ప్రేమే నిజమైతే ఈ మతంలో జరిగే సంస్కరణోద్య మాలకు చేయూతనివ్వాలి. అటువంటి కృషి చేసి హిందూమత ఔన్నత్యాన్ని ప్రపంచ మత సమ్మేళనంలో చాటి చెప్పిన వివేకానందుడు, హిందూ మత ఖ్యాతిని పెంచాడు. వీళ్లు ఆయన బాటలో నడవడానికి సిద్ధమేనా? వివేకానందుడు అంటరానితనం హిందూమతానికి పెద్ద మచ్చ అన్నారు. కాని మన సమాజంలో ఈనాటికీ మనువాదాన్ని తూచా తప్పకుండా నమ్మేవారు వున్నారు. దళితులను ఆమడ దూరాన ఉంచుతున్నారు. దళితులను వివాహం చేసుకుంటే కన్న కూతుళ్లనే మమకారాన్ని కూడా వదిలి చంపుతున్నారు. మన దేశ ప్రథమ పౌరుడు రామ్‌నాథ్ కోవింద్‌కు పూరీ దేవాలయ ప్రవేశాన్ని నిరాకరించారు. మన మాజీ ప్రధాని ఇందిరాగాంధీని ఆలయం బయటే నిలబెట్టారు. ఇప్పటికీ దేవదాసీ పద్ధతిని అమలు చేస్తున్నారు. ఈ లోపాలను, దురాచారాలను సంస్కరించే పని ఎందుకు చేయరు? చేయకపోగా వెనకబాటు సెంటిమెంట్లను రెచ్చగొడ్తారు. ఘర్షణలు సృష్టిస్తారు. హింసకు తెగబడ్తారు. హేతుబద్ధమైన చర్చను తిరస్కరిస్తారు. ఇదేనా వీరి మత నిష్ఠ?



హిందూ మతం మీద ప్రేమే నిజమైతే ఈ మతంలో జరిగే సంస్కరణోద్య మాలకు చేయూతనివ్వాలి. అటువంటి కృషి చేసి హిందూమత ఔన్నత్యాన్ని ప్రపంచ మత సమ్మేళనంలో చాటి చెప్పిన వివేకానందుడు, హిందూ మత ఖ్యాతిని పెంచాడు. వీళ్లు ఆయన బాటలో నడవడానికి సిద్ధమేనా? వివేకానందుడు అంటరానితనం హిందూమతానికి పెద్ద మచ్చ అన్నారు. కాని మన సమాజంలో ఈనాటికీ మనువాదాన్ని తూచా తప్పకుండా నమ్మేవారు వున్నారు. దళితులను ఆమడ దూరాన ఉంచుతున్నారు. దళితులను వివాహం చేసుకుంటే కన్న కూతుళ్లనే మమకారాన్ని కూడా వదిలి చంపుతున్నారు.

ఇతర మతాలలో కూడా విద్యావంతులు పెరిగే కొద్దీ ఆ మత విశ్వాసాలను ప్రశ్నించడం చరిత్రలో కన్పిస్తుంది. క్రిస్టియన్ మతంలో వచ్చిన ఓ పెద్ద తిరుగుబాటు ఫలితమే ప్రొటెస్టంటు శాఖ. స్త్రీలకు ఆస్తి హక్కు సమానంగా ఉండాలని మేరీ రాయ్ (అరుంధతీరాయ్ తల్లి) సుప్రీంకోర్టు తలుపు తట్టి విజయం సాధించింది. ముంబాయిలోని అలీ దర్గాలో మహిళలకు కూడా ప్రవేశం ఉండాలని పోరాడి సాధించింది ముస్లిం మహిళలు. ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్ (ఒకేసారి మూడు తలాక్‌లు చెప్పటం) చెల్లుబాటు కాదని కోర్టుకెళ్లింది ముస్లిం మహిళలు. 1980 నుంచే త్రిపుల్ తలాక్ చెల్లదని కోర్టులు తీర్పులు చెబుతూ వచ్చాయి.

షాబానో ఒక న్యాయవాది భార్య గనుక కోర్టుకు వెళ్లగలిగింది. కానీ మత ఛాందసవాదం, రాజకీయ అవకాశవాదం కలిసి షాబానో కేసులో తీర్పును, రాజ్యాంగ పరమైన హక్కును, సుప్రీం కోర్టు తీర్పును వమ్ము చేశాయి.

ఒకరు కాదు ఐదుగురు మహిళలు ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్ మీద అభ్యంతరం చెప్పారు. వారెవ్వరూ మతానికి వ్యతిరేకం కాదు. దేవుడి మీద నమ్మకం లేని వారు కాదు. మత పెద్దల దగ్గర న్యాయం జరగలేదు కనుకనే సుప్రీంకోర్టు తలుపు తట్టారు.

మతాలు ఏమేరకు కాలానుగుణంగా మార్పు చెందుతాయో ఆ మేరకు అవి ప్రాచుర్యం పొందుతాయి. మారకుంటే అనివార్యంగా తిరుగుబాట్లు తలెత్తుతాయి. డార్విన్ సిద్ధాంత బోధనను నిరోధించిన క్రిస్టియన్ మతం వెనక్కు తగ్గాల్సి వచ్చింది. అబార్షన్లను చట్టబద్ధం చేయడానికి నిరాకరిస్తున్న క్రిస్టియన్ ప్రభావిత ప్రభుత్వాలు ఓడిపోయాయి. ఈ చరిత్రను చూడ నిరాకరించేవారు దౌర్జన్యంతో, అధికారంతో పై చేయి సాధించటానికి చేసే ప్రయత్నాలు అంతిమంగా విఫలంగాక తప్పదు. ప్రతి మతంలోనూ కాలానుగుణంగా మార్పులు తెచ్చి ముందుకు పోవాలనుకునే శక్తులకు, మార్పును ప్రతిఘటించి అనాగరిక, ఛాందసవాదంలోకి నెట్టాలనుకునే శక్తులకు మధ్య సంఘర్షణ జరుగుతూనే వుంటుంది. ఆ ఘర్షణల్లో మనం ఎటువైపు ఉన్నాం అన్నది ప్రశ్న.

ఐద్వా లాంటి సంఘాలు నిరంతరం మార్పు కోరే శక్తులతో పాటు ముందడుగు వేస్తూ వచ్చాయి. కొన్నిసార్లు వారి కంటే ఒక అడుగు ముందు పీఠిన నిలబడ్డాయి. బాల్య వివాహాల నిరోధంలో, వితంతు పునర్వివాహాల కోసం, 'సతీ' నిరోధంలో, ఆస్తి హక్కుల కల్పనలో అన్నింటా మార్పు కోసం ప్రజలను చైతన్యవంతులను చేస్తూ వచ్చింది ఐద్వా. భర్త కొట్టడం, తిట్టడం సహజమైన హక్కు అన్న స్థితి నుండి గృహ హింసను గుర్తించి చట్టం చేసే వరకు పోరాడి సాధించింది. ముస్లింలలో ఉన్న (నిఖా హలాల) విడాకులు తీసుకున్న ముస్లిం స్త్రీ, మరో పురుషుడిని చేసుకుని ఆ తరువాతనే విడాకులు తీసుకున్న మొదటి భర్తను పెళ్లి చేసుకునే పద్ధతిని ముస్లిం మతంలో కొన్నిసార్లు అమలుకు పూనుకున్నారు. అటువంటి ప్రతి సందర్భంలో ముస్లిం మహిళలకు మద్దతుగా నిలిచింది ఐద్వా. ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్ చెల్లదని మొదటి నుంచి పోరాడింది. 'హదియా' హక్కులు కాపాడడంలో ఐద్వా ముందు నిలిచింది. ఉత్తరప్రదేశ్‌లో ప్రేమించిన యువకుడిపైనే రేప్ కేసు పెట్టించిన వారిని ప్రశ్నించే ధైర్యాన్ని ఇచ్చింది ఐద్వా. తిరిగి ఆ యువకుడిని పెళ్లి చేసుకునేందుకు సహకరించింది. 1987లో రూప్‌కన్వర్ దారుణ ఘటన తర్వాత సతీసహగమన హక్కును కాపాడాలని లక్షల మంది మహిళలను సంఘపరివార్ పోగేసింది. ఆ తప్పుడు ధోరణులను ఎదిరించి, అది హంతక చర్య అని అభ్యుదయ శక్తులతో కలిసి నిలబడింది ఐద్వా! అన్ని మతాలలోని మహిళల హక్కుల కోసం పోరాడింది ఐద్వా! రికార్డు స్థాయిలో కనీవినీ ఎరుగని రీతిలో కేరళలో 620 కి.మీ మహిళల గోడను నిర్మించడంలో ఐద్వా భాగస్వామి. ముస్లిం మహిళల సమస్యలలో మీరెక్కడ అని ప్రశ్నించే మరుగుజ్జులకు చరిత్ర తెలుసుకునే సంస్కారం ఉంటుందని ఆశించడం అత్యాశే! ఆయా మతాలలో మహిళల హక్కులను కాలరాసి స్త్రీల బానిసత్వాన్ని, అణచివేతను కొనసాగించే మత దురాచారాలన్నీ కాల పరీక్షలో, ఉద్యమ ప్రవాహంలో కొట్టుకుపోవాల్సినవే! అపజయం పాలయ్యేవే!

(రచయిత ఐద్వా రాష్ట్ర కార్యదర్శి)

సందర్భం

ఆరెస్సెస్ నయవంచన



నేడు స్వామి వివేకానంద 158వ జయంతి

హిందూ మత ఔన్నత్యాన్ని ప్రపంచం మొత్తానికి చాటి చెప్పిన వాడిగా వివేకానందుడి గురించి గొప్పగా చెప్తారు. చికాగో నగరంలో సర్వమత సమ్మేళనంలో ఆయన చేసిన ప్రసంగం గురించి ప్రస్తావిస్తుంటారు. భారత దేశం బలమైన దేశంగా ఎదగాలంటే యువత కీలకమైన పాత్ర పోషించాలని వివేకానందుడు ప్రబోధించిన విషయాన్ని కూడా స్పృశిస్తారు.

అయితే ఆరెస్సెస్, సంఘపరివారం అక్కడితో ఆగకుండా వివేకానందుడి ఆశయాలను సాధించేది తాము మాత్రమేనని, ఆయన వారసులం తామేనని చెప్పుకుంటూ వుంటారు. స్వామి వివేకానందుడు చేసిన బోధనలకు, ఆయన ఆలోచనా సరళికి, ఆరెస్సెస్ సిద్ధాంతాలకి ఏమాత్రమూ సంబంధం లేదు సరికదా పూర్తి విరుద్ధంగా ఉన్నాయన్నది మరుగుపరుస్తున్నారు.

మనువాదాన్ని ఆరెస్సెస్ సమర్థిస్తుంది. దానిని రాజ్యాంగంగా పరిగణించాలని కూడా వాదిస్తుంది. వివేకానందుడు మనువాదాన్ని పూర్తిగా వ్యతిరేకించాడు. భారతీయ సమాజం రెండు వర్గాలుగా చీలి వుందని, పై వర్గంగా సంపన్నులు ఉన్నారని, మెజారిటీ ప్రజలు దిగువ స్థాయి వర్గంగా ఉన్నారని వివేకానందుడు అన్నాడు. అలా దిగువ వర్గంగా ఉన్న వారే 'శూద్రులు' అన్నాడు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఈ అణగారిన వర్గం–శూద్రులు–తిరగబడి పెత్తందారీ వర్గాల నుండి అధికారాన్ని కైవసం చేసుకునే రోజు వచ్చి తీరుతుందని చెప్పాడు.

పెట్టుబడిదారీ దోపిడీని, దాని లాభాపేక్షను, అమానవీయతను వివేకానందుడు తీవ్రంగా విమర్శించాడు. వ్యతిరేకించాడు. సోషలిజం వచ్చి తీరుతుందని కూడా చెప్పాడు.

వివేకానందుడు రామకృష్ణ పరమహంసను తన గురువుగా స్వీకరించాడు. 'మతాలు వేర్వేరుగా ఉన్నా, అవన్నీ దైవాన్ని చేరుకునేందుకు మార్గాలే. రాముడు, ఏసు, అల్లా అంటూ వేరువేరు పేర్లతో పిలిచినా దైవం ఒక్కరే' అన్న రామకృష్ణ పరమహంస బోధనలనే చికాగోలోని సర్వమత సమ్మేళనంలో ప్రకటించాడు. 'ఆకలిగొన్న కడుపుతో ఉన్న వాడికి మతం గురించి బోధించడం వృథా. ముందు అతడి ఆకలి తీర్చే మార్గం చూడాలి' అని రామకృష్ణ పరమహంస చెప్పిన సూత్రాన్ని పాటించాడు.

ఇతర మతాలను గౌరవించడం, సాటి మానవుడిని ప్రేమించడం, భారతీయులందరి ఐక్యత 'భిన్నత్వంలో ఏకత్వం' సూత్రాన్ని పాటించడం ద్వారా మాత్రమే సాధ్యపడుతుందని గ్రహించడం వివేకానందుడి బోధనల్లో అంతర్భాగం.

ఆధునిక విజ్ఞానాన్ని, శాస్త్రీయ అవగాహనను ప్రజలలో పెద్ద ఎత్తున వ్యాప్తి చేయాలని వివేకానందుడు పిలుపు ఇచ్చాడు. సన్యాసి అంటే తన స్వార్థం కోసం కాకుండా సమాజ హితం కోసం పాటుపడే వాడని భాష్యం చెప్పాడు. మోక్షం గురించో, ముక్తి గురించో చెప్పడం కన్నా, ప్రతి సన్యాసీ గ్రామగ్రామానా తిరిగి ప్రజలకు ప్రపంచ జ్ఞానం కలిగించాలన్నాడు. ప్రతి సన్యాసీ తన వెంట ప్రపంచ పటాన్నీ, దిక్సూచినీ, కెమెరాను తీసుకెళ్లాలని, భూగోళ శాస్త్రాన్ని, ఖగోళ శాస్త్రాన్ని, గ్రామీణ ప్రజలకు నేర్పాలని చెప్పాడు.

వేడుకుంటే, ప్రాధేయపడితే హక్కులు రావని, స్వాతంత్ర్యం రావాలంటే భారతీయులంతా బలమైన శక్తిగా ఏకమై బ్రిటిషు పాలనను, సామ్రాజ్యవాద దోపిడీని ఎదిరించి పోరాడి తరిమివేయాలని వివేకానందుడు పిలుపు ఇచ్చాడు. బ్రిటిషు వ్యతిరేక ఉద్యమాలకు మద్దతు తెలపడమేగాక స్వయంగా భాగస్వామిగా వున్నాడు.

గో రక్షకుల కార్యకలాపాలను వివేకానందుడు నిరసించాడు. సాటి మనిషి మీద ప్రేమ, సానుభూతి చూపకుండా పశువులపై ఎనలేని ప్రేమను ఒలకబోసే గో రక్షకుల కపటత్వాన్ని విమర్శిస్తూ వ్యంగ్యంగా 'అవును! మీరు గోమాత బిడ్డలే!' అని హేళన చేశాడు. కరువుకాటకాల్లో నలిగిపోయి అన్నం కోసం ఆక్రోశిస్తున్న ప్రజలను పట్టించుకోకుండా పశువుల గురించి మాట్లాడడం తప్పు అని ఆయన అన్నాడు.

ఇంకా చాలా విషయాలున్నప్పటికీ పైన ప్రస్తావించిన ఆరు అంశాలలోనూ వివేకానందుడి దృక్పథానికీ, ఆరెస్సెస్‌కూ ఎక్కడా పొంతన లేదని స్పష్టం అవుతోంది. మనువాద సమర్థకులు, పెట్టుబడిదారీ వర్గం కొమ్ము కాసేవాళ్లు, ఇతర మతాల ప్రజల పట్ల విద్వేషాన్ని రగిల్చే వాళ్లు, మూఢ విశ్వాసాలను ప్రచారంలో పెట్టి ప్రజలను అజ్ఞానంలో ముంచేవాళ్లు, జాతీయోద్యమంలో ఏనాడూ పాల్గొనకుండా దూరంగా ఉంటూ బ్రిటిషు పాలకులకు విధేయులుగా వ్యవహరించిన వాళ్లు, సాటి మానవుల ప్రాణాలు తీస్తూ దానికి గోరక్షణ ముసుగు తొడిగేవాళ్లు వివేకానందుడికి తామే వారసులమని చెప్పుకోవడం కన్న వంచన ఇంకోటి లేదు!

- ఎమ్వీయస్

జనవాక్యం

ఓటర్లూ ఓడిపోవద్దు!

తెల్లారి లేచింది మొదలు రాజకీయాలు భ్రష్టుపట్టిపోయాయని, అవినీతి, కులతత్వం పెరిగిపోయిందని విమర్శించేస్తుంటాం. ఎవరికి వారు తమని పట్టించుకోవడం లేదని, సమస్యలు పరిష్కరించడం లేదని, ఎన్నికలప్పుడే తాము గుర్తుకు వస్తుంటామని అనుకుంటాం. కుక్కకు బిస్కెట్లు వేసినట్లు చిన్నా చితక పథకాలతో తమని మోసం చేస్తుంటారని గగ్గోలు పెడుతుంటాం. అయితే ఇలా విమర్శించే వారిలో అత్యధిక మందికి ఓటు వేయడానికి బద్ధకించే వారే. పోనీ ఓటు వేసే వారైనా నిజాయితీగా ఓటు వేస్తారా అంటే అలా వేయరు. అత్యధిక మంది కులం చూసి ఓటు వేస్తారు. కులం వాడైతే చాలు రౌడీ షీటర్ అయినా, ఆడపిల్లలను వేధించే వాడైనా, అవినీతిపరుడు, దోపిడీదారుడైనా ఓటు వేసేస్తారు. గెలిపిస్తారు. కొందరు పోటీ చేసే వారు ఎవరైనా, ఎటువంటి వారైనా డబ్బు ఇచ్చి, మందు పోయిస్తే చాలు ఓటు వేసేస్తారు. ఇంకొందరు చిన్న చిన్న బహుమానాలకే అమ్ముడుపోతారు. ఈ విధంగా ఓటు వేస్తే ఉత్తమ నేతలు ఎలా ఎన్నికవుతారు? మంచి పాలన కావాలంటే ఎలా సాధ్యమవుతుంది? ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయాల్లో మార్పులు రావాలంటే ముఖ్యంగా ఓటర్లు తమ ఓటుకు గల ప్రాధాన్యతను తెలుసుకోవాలి. మనకున్న ఏకైక ఆయుధం ఓటు ఒక్కటే. అందుకే ఓటు హక్కును దుర్వినియోగ పర్చకుండా విలువైనదిగా భావించి సమర్థ నాయకుణ్ణి ఎన్నుకోవాలి.

- యువకెరటం.

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

విశ్లేషణ


రిజర్వు బ్యాంకు నిల్వలపై మోడీ కన్ను

ఎంవిఎస్ శర్మ

ఇప్పుడు ఆర్థిక రంగంలో రిజర్వు బ్యాంకు స్వయం ప్రతిపత్తి గురించి చర్చ నడుస్తోంది. రిజర్వు బ్యాంకుకు అసలు యజమాని ప్రభుత్వమే గనుక దానిపై ప్రభుత్వానికి పూర్తి పెత్తనం ఉండడంలో తప్పు లేదని, కేంద్ర ప్రభుత్వానికి అవసరమైనప్పుడు రిజర్వుబ్యాంకు దగ్గరున్న నిల్వలను వాడుకోవచ్చునని వాదించే వారంతా ఒకవైపు ఉన్నారు. మరో వైపు రిజర్వు బ్యాంకుకు స్వయం ప్రతిపత్తి ఉండాలని, అధికారంలో ఉన్న పార్టీ సంకుచిత ప్రయోజనాలకు దాన్ని బలి చేయకూడదని వాదించే వారున్నారు. మనం ఇక్కడ చూడాల్సిన అంశం ఈ రెండు వాదనలలో ఏది సరైనది అన్నది కాదు. నిజానికి రెండు వైపులా వాదించే వారంతా నయా ఉదారవాద విధానాలను బలపరిచే వారే. ఏ రాయైతేనేం పళ్లూడగొట్టుకోడానికి? అన్న సామెత చందాన ఉంది.

ప్రభుత్వానికి ఆర్థిక వనరులు చాలకపోతే పన్నుల రూపంలోనో, రుణాల రూపంలోనో సమీకరించుకునే అధికారం దానికుంది. అలా చెయ్యకుండా రిజర్వు బ్యాంకు నిల్వల నుంచి తీసుకోవలసిన అగత్యం ఏమొచ్చింది? ఇదీ అడగవలసిన అసలు ప్రశ్న.

నయా ఉదారవాద రాజ్యంలో పన్నులు పెంచితే ద్రవ్య పెట్టుబడి దానిని అంగీకరించదు. కార్పొరేట్లపై ప్రస్తుతం ఉన్న పన్నులనే ఇంకా ఇంకా తగ్గించాలని వత్తిడి తెచ్చి అదనంగా పన్నులు విధిస్తానంటే ద్రవ్య పెట్టుబడి ఎలా ఒప్పుకుంటుంది? అటువంటప్పుడు అదనపు రాబడి లేకుండా అదనపు ఖర్చు చెయ్యాలంటే మిగిలిన మార్గం రుణాలు తీసుకోవడం, లేదా బడ్జెట్‌లో లోటు చూపడం. దీనిని కూడా ద్రవ్య పెట్టుబడి అంగీకరించదు. అసలే ఇది ఎన్నికల సంవత్సరం. ప్రజలను మరోసారి మభ్యపెట్టడానికైనా కొంత సంక్షేమం కోసం ఖర్చు చేయాలి. దానికి నయా ఉదారవాద విధానాలు అంగీకరించడం లేదు. ఇదీ అసలు సమస్య.



పెట్టుబడిదారీ వర్గంపై అదనపు పన్నుల విధింపును నయా ఉదారవాదం ఎందుకు అంగీకరించదో తేలికగానే అర్థం అవుతోంది. కాని బడ్జెట్ లోటు పెంచడానికి వీలు లేదంటూ అభ్యంతరం పెట్టడం దేనికి? ప్రభుత్వ ప్రత్యక్ష జోక్యం అన్ని ప్రజా సంక్షేమ రంగాలలోనూ క్రమంగా కుదించుకుపోవాలని నయా ఉదారవాదం కోరుకుంటుంది. కార్పొరేట్ల అంతులేని ధన దాహాన్ని తీర్చడానికి అవసరమైన అన్ని చర్యలనూ చేపట్టడమే ప్రభుత్వ బాధ్యత తప్ప ప్రజా సంక్షేమం కాదన్నది నయా ఉదారవాదం సారాంశం.

పెట్టుబడిదారీ వర్గంపై అదనపు పన్నుల విధింపును నయా ఉదారవాదం ఎందుకు అంగీకరించదో తేలికగానే అర్థం అవుతోంది. కాని బడ్జెట్ లోటు పెంచడానికి వీలు లేదంటూ అభ్యంతరం పెట్టడం దేనికి? ప్రభుత్వ ప్రత్యక్ష జోక్యం అన్ని ప్రజా సంక్షేమ రంగాలలోనూ క్రమంగా కుదించుకుపోవాలని నయా ఉదారవాదం కోరుకుంటుంది. కార్పొరేట్ల అంతులేని ధన దాహాన్ని తీర్చడానికి అవసరమైన అన్ని చర్యలనూ చేపట్టడమే ప్రభుత్వ బాధ్యత తప్ప ప్రజా సంక్షేమం కాదన్నది నయా ఉదారవాదం సారాంశం.

దీనిని కాదని ప్రజా సంక్షేమం కోసం అవసరమైతే బడ్జెట్ లోటును పెంచడానికైనా ప్రభుత్వాలు సిద్ధపడే అవకాశం ఉంది గనుకనే ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వంటి నయా ఉదారవాద సంస్థలు రుణాలిచ్చేటప్పుడు బడ్జెట్‌లో లోటు 4 శాతానికి మించకూడదని షరతు విధించడమే గాక ఈ షరతునే (ఫిస్కల్ రెస్పాన్సిబులిటీ అండ్ బడ్జెటరీ మేనేజ్‌మెంట్ యాక్ట్) ఎఫ్‌ఆర్‌బిఎం చట్టంగా కూడా చేసేలా ఒత్తిడి చేశాయి.

అయితే ఈ వాస్తవాన్ని ఇలాగే బహిరంగంగా ప్రకటించలేవు కదా. అందుకని నయా ఉదారవాదాన్ని సమర్థించే ఆర్థిక నిపుణులు ద్వారా కొన్ని సిద్ధాంతాలను ప్రచారంలోకి తెచ్చారు. అటువంటి వాదనలలో ముఖ్యమైనది ఇది. బడ్జెట్ లోటు పెరిగితే అది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. రూపాయి విలువ పడిపోతుంది. ధరలు పెరుగుతాయి. దీనిని సర్వకాల సర్వావ్యవస్థలలోనూ వర్తించే అనుల్లంఘనీయమైన సత్యం లాగా ఈ ఆర్థికవేత్తలనబడే వాళ్లు చెబుతుంటారు. ఇది వాస్తవం కాదు.

లోటు బడ్జెట్ వలన మొత్తం సరుకుల ఉత్పత్తి పెరగకపోయినా మొత్తం సరుకుల డిమాండ్ పెరిగిపోతుందని, దీని పర్యవసానంగా సరుకుల ధరలు పెరిగిపోతాయని, అది ద్రవ్యోల్బణానికి దారితీస్తుందని పై తరహా ఆర్థికవేత్తలు మనకి వివరిస్తారు. ఇలా జరగాలంటే ఆ ఆర్థిక వ్యవస్థలో ఎల్లప్పుడూ పూర్తి స్థాయిలో అందరికీ ఉద్యోగాలు లేదా ఉపాధి కల్పించబడి వుండాలి.

కాని పెట్టుబడిదారీ సమాజంలో అటువంటి 'పూర్తి స్థాయిలో ఉపాధికల్పన' అసాధ్యం. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో ఎప్పుడూ సరుకుల ఉత్పత్తి ఎక్కువగా ఉండి ప్రజల కొనుగోలు శక్తి తక్కువగా ఉండే పరిస్థితే ఉంటుంది. అటువంటప్పుడు బడ్జెట్‌లో లోటు పెంచి, ఆ సొమ్మును ఉపాధికల్పనకు దారితీసేలా (ఉదా: ఉపాధి హామీ పథకం వంటి పద్ధతుల ద్వారా, రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా) వినియోగించగలిగితే ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. అదే సమయంలో ద్రవ్యోల్బణమూ లేకుండా చూడడం సాధ్యపడుతుంది. నిజానికి బడ్జెటరీ లోటును నియంత్రించిన తర్వాత కాలంలో మన దేశంలో పారిశ్రామిక రంగంలో పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి జరగడం లేదు. (ప్రజలు సరుకులు కొనలేకపోతున్నందున) అటు పోషకాహార లోపం ఉన్నా, ఆహారధాన్యాల నిల్వలు పేరుకుపోతున్నాయి.

బడ్జెట్ లోటు పెరిగితే దిగుమతుల బిల్లు పెరిగిపోయి విదేశీ మారక ద్రవ్యం చెల్లింపు ఖాతాలో లోటు పెరిగిపోతుందని నయా ఉదారవాద సమర్థకులు వాదిస్తారు. ప్రభుత్వం దిగుమతులపై తగిన రీతిలో అదుపు ఉంచగలిగితే అలా లోటు పెరిగిపోకుండా చూడగలుగుతుంది.

కనుక నయా ఉదారవాద చట్రాన్ని బద్దలు కొట్టుకుని బైటపడగలిగితేనే ప్రజా సంక్షేమం, ఉపాధి కల్పన, పేదరిక నిర్మూలన వంటి లక్ష్యాల వైపు ఆర్థిక వ్యవస్థను నడిపించడం సాధ్యపడుతుంది.

ఇప్పుడు మోడీ ప్రభుత్వం నయా ఉదారవాద విధానాలను బహు శ్రద్ధతో అమలు చేస్తోంది. అందుకే గడిచిన నాలుగేళ్లూ, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసింది. అడ్డగోలుగా కార్పొరేట్ల సేవలో మునిగి తేల్తోంది. అయితే ఎన్నికలొస్తున్నాయి. ప్రజలకు తాయిలాలు పంచాలి. అందుకే రిజర్వు బ్యాంకు నుండి నిల్వలను కేటాయించమని ఒత్తిడి చేస్తోంది.

రిజర్వు బ్యాంకు నిల్వల నుండి ఖర్చు చేసినా, లేక బడ్జెట్‌లో లోటును పెంచి ఖర్చు చేసినా పర్యవసానం ఒక్కటే. దేశ ఆర్థిక వ్యవస్థలో రిజర్వుబ్యాంకు, దాని లావాదేవీలు కూడా భాగమే కదా. అయితే ప్రభుత్వం ఎఫ్‌ఆర్‌బిఎం చట్టానికి లోబడి వ్యవహరిస్తున్నట్లు, నయా ఉదారవాద షరతులను గౌరవిస్తున్నట్లు చెప్పుకుంటూనే డొంక తిరుగుడుగా లోటును పెంచే ప్రయత్నం చేస్తున్నది. ఇదీ అసలు విషయం. మోడీ ప్రభుత్వం తన వరకు వచ్చే సరికి ఈ రకంగా దొడ్డిదారి పద్ధతులను అనుసరిస్తూనే రాష్ట్రాలు అదే ఎత్తుగడలను అనుసరించడానికి మాత్రం అనుమతించకుండా ద్వంద్వ నీతిని పాటిస్తుంది.

నయా ఉదారవాద విధానాల చట్రానికి లోబడి వున్నంత కాలమూ రిజర్వు బ్యాంకు స్వయం ప్రతిపత్తి ఉండాలా? లేక కేంద్రందే పై చేయిగా ఉండాలా? అన్న చర్చకు అర్థం లేదు. ఇది అసలు మూలం నుండి మన దృష్టిని పక్కకు మళ్లించే చర్చ.

నయా ఉదారవాద విధానాలు కొనసాగాలా? లేక వాటిని వదుల్చుకోవాలా అన్నదే అసలు ప్రశ్న. చర్చ దీనివైపు మళ్లకుండా చూడటమే ఉదారవాద సమర్థకుల లక్ష్యంగా ఉన్నట్లు కనపడుతోంది.

(ప్రభాత్ పట్నాయక్ వ్యాసం ఆధారంగా)

ఆలివ్ నూనెతో చర్మం నిగారింపు

•ఆలివ్ ఆయిల్‌ను స్నానం చేసే ముందు శరీరానికి పట్టిస్తే, చర్మానికి చాలా మంచిది. చలికాలంలో చర్మం పగిలిపోతూ ఉంటుంది. అలాంటి సమయంలో ఆలివ్ ఆయిల్ రాసుకుంటే పగుళ్లు ఏర్పడవు.

•రోజూ స్నానానికి ముందు ఆలివ్ ఆయిల్‌తో బాడీ మొత్తాన్ని మసాజ్ చేసుకోవాలి. అరగంటకు తర్వాత కాస్త గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. ఇలా నిత్యం చేస్తే చర్మం పగలదు.

•కొందరికి చర్మం గరుకుగా ఉంటుంది. అలాంటివారు ఆలివ్ ఆయిల్‌లో కాస్త చక్కెర కలిపి, అది కరిగిపోయిన తర్వాత ఆ ఆయిల్‌తో బాడీ మొత్తం మసాజ్ చేసుకుంటే, చర్మం మృదువుగా మారిపోతుంది.

•ఆలివ్ ఆయిల్‌లో కాస్త తేనె కలుపుకుని, ఫేస్‌కు రాసుకుంటే చాలా మంచిది. ఇలా రెగ్యులర్‌గా చేస్తే కాంతివంతంగా తయారవుతుంది.

•ఆలివ్ నూనెను రోజూ పెదాలకు రాసుకుంటే చాలా మంచిది. దీంతో పెదాలు కూడా గులాబీ రంగులోకి మారతాయి.



•కొందరికి కాళ్ల వేలి మధ్యలో పగుళ్లు ఏర్పడుతుంటాయి. ఆలివ్ నూనెలో పసుపును కలుపుకుని, దాన్ని రాసుకుంటూ ఉంటే అక్కడ పగుళ్లు తగ్గిపోతాయి. ★

ఆల్‌బుకరాతో ఆరోగ్యం

సాధారణంగా మనం రకరకాల పండ్లను తింటూ ఉంటాం. అయితే ఆల్‌బుకరా (ప్లమ్) పండ్లు అన్ని కాలాల్లో దొరకవు. పైగా సీజనల్‌గా వచ్చినప్పుడు చాలామంది ఈ పండ్లను పెద్దగా పట్టించుకోరు. కానీ అవి ఆరోగ్యానికి చాలా మంచిది. వాటి వల్ల చాలా ప్రయోజనాలున్నాయి. కాలేయం, రొమ్ము, పేగు క్యాన్సర్‌లను నివారిస్తాయి. అంటే రోగులలో క్యాన్సర్ కణాలు పెరగకుండా చేస్తాయి. అంతేకాకుండా ఈ పండ్లు కీమోథెరఫీ కారణంగా తలెత్తే దుష్ఫలితాలను తగ్గిస్తాయి. ఎముక సాంద్రత తక్కువగా ఉండి, ఆస్టియో పొరోసిస్‌తో బాధపడుతున్న వారు ఎండిన పండ్లను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ముఖ్యంగా వృద్ధులు ప్రతిరోజూ వీటిని తినడం వల్ల ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. ప్లమ్ పండ్లు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. వీటిలో కె విటమిన్ శాతం ఎక్కువుగా ఉండటంతో గుండె జబ్బులు రాకుండా ఉంటాయి.



బాగా అలసిపోయి నీరసపడినప్పుడు రోజూ 5 ప్లమ్ పండ్లను తీసుకోవడం వల్ల వెంటనే శక్తి వస్తుంది. ఎందుకంటే వీటివల్ల బిగతీసుకున్న కండరాలు తిరిగి యథాస్థితికి రావడంతో అప్పటివరకూ కణాల మధ్య పేరుకున్న ఒత్తిడి తగ్గుతుంది. ఇవి జీర్ణవ్యవస్థకి ఎంతో మంచిది. మలబద్ధకాన్ని తగ్గించడంతో పాటు వీటిలో ఉండే ఇసాటిన్, సార్బిటాల్ ... వంటి పదార్థాలు టాక్సిన్లను బైటకు పంపేందుకు దోహదపడతాయి. అంతేకాదు ఈ పండ్లు జీవక్రియ వేగాన్ని పెంచుతాయి. ★

మీకోసం



కొద్దిగా పంచదార, పసుపు, తేనె కలిపి పెదాలకు రాస్తే నునుపుగా, నిగారిస్తాయి.

జీవన సౌరభం

శ్రమ మన ఆయుధమైతే.. ఫలితం మన చేతుల్లోనే.







అనగనగా.. రంగుల చందమామ

సంక్రాంతి పండగంటేనే ముగ్గులు. నెలరోజుల ముందు నుంచి పోటీలు పడి మరీ ముగ్గులు వేస్తాం. ఇంటి ముందు ఎంత పెద్ద ముగ్గువేసినా.. ఆ ముగ్గును చూసి ఎవరైనా 'వావ్!' అని కితాబు ఇవ్వాలంటే మాత్రం కచ్చితంగా దానికి రంగులు అద్దాల్సిందే! 'అమ్మా! నీవు పెద్ద ముగ్గు వేయి.. నేను అందమైన రంగులు అద్దుతా..' అంటూ అల్లరి చేసే పిల్లలు ఒకవైపు. 'పక్కింటి ఆంటీ. వేసిన ముగ్గుకంటే మన ముగ్గే బావుందమ్మా' అని గెలుపు గుర్రాల్లా సంతోషపడే పిల్లలు మరోవైపు. ఇలా.. మన ఇంటి ముందు ముగ్గులు హరివిల్లులా మెరవాలంటే.. బజారులో రంగులు కొని తెచ్చుకోవాలి. అలా.. అవసరమయ్యేవారికి రంగులు అమ్మే చిరువ్యాపారే ఈ అవ్వ. 70 ఏళ్ల పైవయస్సులోనూ.. తన బతుకు పండించుకోవడానికి నిత్యం రంగులతో సావాసం చేస్తోంది. సావాసం అనేకంటే.. బతుకుపోరాటమే అనాలి. ఇంద్రధనస్సు మాటున వెన్నెల పంచే చందమామలాగానే.. తన జీవితంలోనూ అనేక కష్టాలున్నాయి. తనలోపల చందమామలా వెన్నెల పంచినట్టుగా తన గుండెల్లోని బాధ మచ్చలా కనిపించకుండా.. నలుగురి సంతోషం కోసం, నలుగురిళ్ళల్లో పండగ కోసం పంచరంగుల్ని పంచుతుంది. పదండి.. అనగనగా ఆ చందమామను అడిగి నాలుగు రంగులు అద్దుకుందాం!

విజయవాడలోని బీసెంట్ రోడ్డులో అలా అలా నడుచుకుంటూ మధ్యకు వెళ్లేటప్పటికీ మన కళ్లు అప్రయత్నంగానే ఒకామె మీదకు వెళతాయి. ఆమె పేరు అప్పలమ్మ. స్థానిక మారుతీనగర్‌లో నివాసముంటుంది. ఈ రోడ్డులోనే గత నలభై ఏళ్ళుగా సీజనల్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తోంది. అదేముంది ఇలాంటి వాళ్లు కోకొల్లలుగా ఉంటారు కదా! ఆమె స్పెషలేంటి? అనే సందేహం రాక తప్పదు. నిజమే అలాంటి వాళ్లు ఉండొచ్చు. కానీ ఆమె వయసు డెభైయ్యేళ్ల పైమాటే. ఇప్పటికీ జీవన పోరాటం చేస్తూనే ఉంది. ప్రతిరోజూ ఉదయాన్నే 5.30 గంటలకు నిద్రలేచి, ఇంటి పనులు చకాచకా ముగించుకుని పది గంటలకల్లా బీసెంట్‌రోడ్డుకు చేరుతుంది. అప్పటి నుంచి రాత్రి 11 గంటల వరకు వ్యాపారం చేసుకుని 12 గంటలకు ఇంటికి చేరుతుంది. ఇన్నేళ్లుగా ఇదే ఆమె దినచర్య.

కష్టాలతో.. సావాసం

ఒక్కసారి అవ్వతో మాట కలిపితే చాలు తెలియకుండానే కళ్లల్లో నీళ్లు తిరుగుతాయి. 'పుట్టినప్పటి నుంచి కష్టాలే తప్ప చిరునవ్వు ఎరుగను. పసిబిడ్డగా ఉన్నప్పుడే నాన్న దూరమయ్యాడు. అమ్మే కష్టపడి సాకింది. ఆమె మమ్మల్ని సాకడానికి ఎన్ని అవస్థలు పడ్డదో కళ్లారా చూశా. ఇక పెళ్ళి చేసే స్థోమత ఎక్కడిది? అందుకే తన అన్న కొడుక్కే ఇచ్చి పెళ్లి చేసింది. పెళ్లైన తర్వాత మేం కొన్నేళ్లు బాగానే ఉన్నాం. ఆయన కూలికి వెళ్లి నన్నూ, పిల్లలను చక్కగా చూసుకున్నారు. ఇలా ఉండగా అనుకోకుండా ఆయన క్యాన్సర్ బారిన పడ్డారని తెలిసింది. ఆ సమయంలో మా బాధ వర్ణణాతీతం. ఒక్కసారిగా చీకటి మమ్మల్ని చుట్టుముట్టినట్లు అనిపించింది' అంటోంది అవ్వ. ఆ సమయంలో ఆర్థికంగా సాయం చేయడానికి ఒక్కరూ ముందుకు రాలేదట. దానికి కారణం లేకపోలేదు. వాళ్ల బంధువుల్లో అందరూ అంతంత మాత్రమే. రోజురోజుకూ కళ్ల ముందే ఆమె భర్త క్షీణించిపోతున్నా.. ఏమీ చేయలేక నిస్సహాయంగా ఉండిపోయింది. రోజుల్లోనే తాత అవ్వకు శాశ్వతంగా దూరమయ్యాడు. తర్వాత కొన్ని నెలలు కన్నీళ్లతోనే కాపురం చేసిందామె. అప్పటికే ఆమెకు నలుగురు చిన్నపిల్లలు. వారినెలా సాకాలో అర్థంకాక అంత దుఃఖంలోనూ కూలీకి వెళ్లడం మొదలెట్టింది. కానీ రోజూ పని దొరికేది కాదట! అప్పుడే తెలిసిన వాళ్ల ద్వారా బీసెంట్ రోడ్డులో ఏదైనా వ్యాపారం చేసుకోవచ్చని తెలుసుకుంది. నిజానికి అవ్వకు చదువులేకపోయినా మొండి ధైర్యంతో పండ్ల వ్యాపారం మొదలెట్టింది. ఒక్కోరోజు వ్యాపారంలో లాభాలు, మరోరోజు నష్టాలను చవిచూసింది. సరుకు రెండు, మూడు రోజులుంటే పాడైపోయేవి. అలా చాలాకాలం ఆ వ్యాపారాన్ని నెట్టుకొచ్చింది. కొన్నేళ్ల తర్వాత డోర్‌మ్యాట్‌లను అమ్మడం ప్రారంభించింది. అవైతే వస్తువు చెడిపోదు అనేది అవ్వ ఉద్దేశం. మొదట్లో ఆమె తోటి వ్యాపారుల నుంచి కూడా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నది. కస్టమర్ బేరమాడి వస్తువు కొనడానికి సిద్ధమయ్యేలోపు మరో వ్యాపారి అంతకన్నా తక్కువ రేటుకి ఇస్తామని కేకలేసి, మరీ పిలిచేవారు. అయినా నోరు మెదిపేది కాదట! ఎందుకంటే అసలే ఒంటరి మహిళ. వారితో గొడవేసుకుంటే మరలా అక్కడే వ్యాపారం చేయాలి కదా! అంటోందామె. ఆ బలహీనతనే తోటి వ్యాపారులు బలంగా మార్చుకునేవారు. అలా అనేక కష్టాలు పడి, పిల్లలను సాకింది. ప్రతి సంవత్సరం డిసెంబరు, జనవరి నెలంతా రంగులు అమ్ముతూ జీవనాన్ని సాగిస్తూ వస్తోంది.

గెలిచానో? ఓడానో?

పొట్టకూటి కోసమే ఇన్నేళ్లుగా రకరకాల వ్యాపారాలు చేస్తూ వచ్చిందామె. ఆమె భర్త చనిపోయేనాటికి చిన్నపిల్ల నెలల బిడ్డట. అంత పసిబిడ్డను వదిలి, రోజంతా బయటకు వెళ్లడమంటే ఆషామాషీ విషయం కాదు. మనసును ఎంత రాయి చేసుకోవాలో మనసున్న ప్రతి ఒక్కరికీ ఇట్టే తెలిసిపోతుంది. డబ్బాకు పాలుపట్టి, పెద్ద అమ్మాయి చేతికిచ్చి ఈ రోజు నుంచి నీవే చెల్లెళ్లకు, తమ్ముడికి అమ్మవని చెప్పిందట! అప్పటి నుంచి ఆమె పెద్ద కూతురే అందరికీ అమ్మ అయ్యింది. పిల్లల బాధ్యత అయితే తీసుకుందిగానీ, తల్లిలా వారినెప్పుడూ ముద్దు చేయలేకపోయానని ఆమె బాధపడని రోజంటూ లేదట! తల్లిగా నేను గెలిచానో? ఓడానో? తెలియదు అంటూ అమాయకంగా చెప్పుకొస్తుంది అవ్వ. 'అప్పట్లో వారికి తిండి పెట్టడమే కష్టమైంది. పిల్లల ఆలనాపాలనా చూసేవారు లేక బడికి కూడా పంపలేదు. దానికితోడు పిల్లోడు అందరిలా తెలివైనోడు కాదు. ఆడపిల్లలకన్నా వాడిదే నాకు ఎక్కువ దిగులు. అప్పట్లో లేని ధైర్యాన్ని తెచ్చుకుని, పిల్లలను ఎలా మొండిగా పెంచానో? నాకు ఇప్పటికీ అర్థం కాదు. ఆడపిల్లలకు చిన్నవయస్సులోనే పెళ్లిళ్లు చేశా. వాళ్లు ఇప్పటికీ అడుగుతుంటారు. మేము ఆడుకునే వయస్సులోనే పెళ్లిళ్లు చేసి, మమ్మల్ని వదిలించుకున్నావని. ఆ రోజు పరిస్థితులు అలాంటివి మరీ. అడిగిన వారిని కాదంటే నేను సంబంధాలు వెతికి చేయలేను కదా!' అంటూ తన గతాన్ని తలచుకుని తల్లడిల్లింది ఆమె.







ఒకరిపై ఆధారపడటం ఇష్టంలేదు

రోజంతా వ్యాపారం చేస్తే వంద రూపాయలు ఆదాయం వస్తే ఎక్కువనే చెప్పాలి. వన్‌టౌన్‌కెళ్లి కేజీల లెక్కన రంగులు తెచ్చుకుంటుంది. వాటిని ఒక్కొక్క ప్యాకెట్‌లో 50గ్రాములు చొప్పున రంగువేసి, ఐదు రూపాయలకు అమ్ముతుంది. కొందరు పెద్దావిడనే కనికరమూ లేకుండా బేరమాడతారట! నాకు గిట్టదమ్మా! అంటే వెటకారంగా మాట్లాడతారంటూ.. బాధపడిందామె. నేలమీద కూర్చుంటే అవ్వ లేచి నిల్చోటానికి.. నిముషాల సమయం పడుతుంది. వయస్సురీత్యా ఆరోగ్యసమస్యలూ తలెత్తుతంటాయి. ఇలా జీవితమంతా కష్టపడ్డాగానీ ఒక్కరూపాయీ దాచుకోలేకపోయింది అవ్వ. 'జబ్బుచేస్తే మొదట్లో గవర్నమెంట్ ఆసుపత్రికి వెళ్లేదాన్ని. జబ్బేదో చెప్పకుండా రోజులు తరబడి తిప్పేవారు. ఈ బాధలన్నీ భరించలేకే పది రూపాయల వడ్డీకి అప్పు తీసుకొని మరీ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకునేదాన్ని. ఇంత ముసలిదానికి ఎవరైనా అప్పు ఇవ్వాలంటే ఆలోచిస్తారు. కానీ నా మంచితనం, ఇన్నేళ్లు పెంచుకున్న నమ్మకం వల్లే అప్పు పుడుతుంది. ఒక్కోసారి పది, పదిహేను రోజులు జబ్బుచేస్తే ఇక్కడకు రాలేను. ఆ సమయంలో నా కడుపు నిండటమే చాలా కష్టం' అంటూ ఆవేదనగా చెప్పింది అవ్వ.

అబ్బాయికి పెళ్లి చేసింది. ఆయన కుటుంబ బాధలు ఆయనవి. ఆడపిల్లలేమో తమ దగ్గర ఉండమని పిలుస్తారట. కానీ అవ్వ వెళ్లదు. ఎందుకంటే ఆమె ఒంట్లో సత్తువ ఉన్నంత కాలం ఒకరి మీద ఆధారపడటం ఆమెకిష్టం లేదు. ఒక్కోసారి ఈ వయస్సులో కూడా కష్టపడటం ఎందుకు? విశ్రాంతి తీసుకుంటే బాగుండు అనిపిస్తుందట. 'కానీ అందరికీ అంత మంచి రోజులు ఉండవు కదా! ఒక్కోసారి నేను పుట్టిందే కష్టపడటానికా?' అని అనుకుని తనకు తను సర్దిచెప్పుకుంటుందట.

రోజు రోజుకూ వయోభారమవుతున్నా.. తనను, తన కుటుంబాన్ని పోషించుకోవడం కోసం అవ్వపడే తపన, జీవన పోరాటం.. మరికొందరికి స్ఫూర్తిని నింపుతుందనే చెప్పాలి. కానీ, ఇలాంటి అవ్వల కష్టాన్ని సమాజం, ప్రభుత్వం, పాలకులు దృష్టి సారించాలి. తమ పరిధిలో సాయం అందించాలి. చందమామలాంటి అవ్వ జీవితంలోనూ వెన్నెల్ని పంచాలి!!

- స్వర్ణలత నూకరాజు

మా పిల్లలు హైస్కూల్లో చదువుతున్నారు. చాలా తెలివైనవారు. కానీ పరీక్షలు ముందురోజు రాత్రి కూడా టీవి చూస్తూనే ఉంటారు. ఎంత చెప్పినా వినరు. టీచరుకి చెబుతాం అంటే వెక్కిళ్లు పెట్టి మరీ ఏడుస్తారు. టీచరుకి చెబితే వాళ్లు ఎక్కడ పిల్లలను కొడతారోనని భయంగా ఉంది. టీవి చూడటం ఎలా మాన్పించాలి?

టీవీ చూడటం మాన్పించడమెలా?

మీ సమస్యలోనే పరిష్కారం ఉంది. ఎదిగే వయస్సులో ఉన్న పిల్లలకూ కొన్ని బలహీనతలు, ఆకర్షణలు ఉండొచ్చు. అలాంటి వాటిలో టీవి ఒకటి. మిగతా కుటుంబ సభ్యులంతా టీవి చూస్తుంటే పిల్లలకు చూడాలనిపించడం సహజమే. వీలైనంత వరకు మీరు టీవి చూడటం తగ్గించండి. అయితే వాళ్ల కోసం మీరేదో త్యాగం చేస్తున్నారని చెప్పకుండా.. సరదాగా వారితో నాణ్యమైన సమయం గడపండి. అలాగే టీవికన్నా వాళ్లే ముఖ్యమనే మెసేజ్‌ను అందేలా చేయండి.




ఇలాగనుక చేయగలిగితే పిల్లలు మీకు మరింత దగ్గరవడంతోపాటు టీవి మీదకు మనసును మరల్చగలరు. వాళ్లను టీచర్లు ఏమంటారోనని మీ బలహీనతను మీరే బయటపెట్టుకున్న వారవుతున్నారు. టీచర్లంటే పిల్లలకు గౌరవం ఉండాలికానీ, భయం కాదు. టీచర్లకు చెబుతామని మీరు బెదిరింపు ధోరణిని చూపుతున్నప్పుడు, అది వారికి భయాన్నే కలగజేస్తుంది. విషయాన్ని అనవసరమైన భయాలవైపు మళ్లించిన వారవుతారు. పిల్లలతో మీరు మాట్లాడి, చిన్నచిన్న లక్ష్యాలను ఏర్పరచుకునేలా చేయండి. అలాగనుక చేయకపోతే టీవి చూసే అవకాశం లేదని సున్నితంగా చెప్పండి. చదువుకోకపోతే భవిష్యత్తులో ఎదుర్కొనే నష్టాలను వారికి అర్థమయ్యేలా చెప్పండి. టీచర్లు పిల్లలకు అండగా నిలబడేవారే తప్ప భయపెట్టేవారు కాదనేది మీరూ అర్థం చేసుకోండి. ఏ సబ్జెక్టులో పిల్లలు బలహీనంగా ఉన్నారో దానిలో టీచర్ల సహాయంతోటి బలోపేతం అయ్యేలా చూడండి. అలా ఒక కూటమిగా మీరు సహాయపడితే పిల్లలు ఏదైనా సాధించగలం అనే విషయం వారికి సులువుగా అర్థమవుతుంది. శ్రమపడటం కూడా తమ బాగుకోసమేనని పిల్లలు అర్థం చేసుకుంటారు.



డాక్టర్ పద్మజ, సైకాలజిస్టు



కె. సలోమి, 9వ తరగతి, విజయవాడ.



19 చుక్కలు 1 వచ్చే వరకు సరిచుక్క

బహుమతి పొందిన ముగ్గు



సిహెచ్. చిన్నమ్మలు బాలాజీపేట, విజయనగరం.



24 చుక్కలు 11 వరుసలు, 11 వచ్చేవరకు.

మా చిరునామా: 'రమణుల రంగవల్లి', జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక, హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2. ఇమెయిల్: jeevanapageps@gmail.com ఆదివారం మినహా ఉ.12 గం. సా.6 గం. మధ్య ఫోన్ నెం. 9490099006కు సంప్రదించండి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం ప్రత్యేకం

స్వయం సహాయక బృందాలు - లక్ష్యాలు





టి.ఎం.దాస్
ఎపి మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాల
మహానంది,
సెల్ : 9000250127

★ **సామాజిక సమీకరణ, సంస్థాగత అభివృద్ధి (సోషల్ మొబిలైజేషన్ అండ్ ఇనిస్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ -ఎస్‌ఎం అండ్ ఐడి) :** పది, పన్నెండు మంది పట్టణ మహిళలు ఒక బృందంగా ఏర్పడతారు. 20 స్వయం సహాయక బృందాలు కలిసి ఒక మురికివాడ స్థాయి సమాఖ్యగా (స్లమ్ లెవల్ ఫెడరేషన్) 6,619 సమాఖ్యలు ఏర్పడతాయి. 15 నుంచి 35 వరకూ మురికివాడ స్థాయి సమాఖ్యలు కలిసి ఒక పట్టణస్థాయి సమాఖ్య (టైన్ లెవల్ ఫెడరేషన్)గా ఏర్పడతాయి. పురపాలక ప్రాంతాల పేదరిక నిర్మూలన మిషన్ (మెప్మా) ఈ స్వయం సహాయక బృందాలు అంతర్గతంగా పొదుపు పెంచుకోవడాన్ని, రుణాలు ఇచ్చుకోవడాన్ని ప్రోత్సహిస్తుంది.

రాష్ట్రంలో 18.4 లక్షల మంది పట్టణ మహిళలు, 1.83 లక్షల స్వయం సహాయక బృందాలుగా ఏర్పడ్డారు. 61,960 మంది అంగవైకల్యం గల వ్యక్తులు 6,196 ప్రత్యేక స్వయం సహాయక బృందాలుగా ఏర్పడ్డారు. 79 నుంచి పట్టణ వికలాంగుల సమాఖ్యలుగా ఏర్పడ్డారు. మానసిక పునరావాసం పొందే తల్లిదండ్రుల సంఘాలు 111 ఏర్పడ్డాయి.

★ **నైపుణ్య శిక్షణ నియామకాల ద్వారా ఉద్యోగిత (సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం -ఎస్ఇపి) :** 2015-16లో 32 పట్టణాలకు 40,000 ముందికి నియామకాలతో బంధం కలిగిన నైపుణ్య శిక్షణ అందించాలని ప్రతిపాదించారు. అందులో 50 శాతం మందికి నియామకాలు సంపాదించడం లక్ష్యం. 29 పట్టణాలలో శిక్షణ మొదలయ్యింది. 2014-15లో 6,614 మందికి శిక్షణ ఇచ్చారు. 2015-16లో 2,980 మందికి ఉద్యోగాలు లభించాయి. ఇవి స్టెప్-అప్ కార్యక్రమం కింద అమలయ్యాయి.

★ **స్వయం ఉపాధి కార్యక్రమం (సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం) :** పట్టణ పేదలకు వ్యక్తిగతంగా ప్రయోజనకరమైన ఉద్యోగిత కలుగజేసే వెంచర్లు, సూక్ష్మ సంస్థల ఏర్పాటుకు వడ్డీ రాయితీతో రూ.2 లక్షల పరిమితికి మించని రుణాలు ఇవ్వడం ఈ కార్యక్రమం ప్రధాన విధి. 2015-16లో 9000 లక్ష్యం కాగా, 2232 స్వయం ఉపాధి యూనిట్లకు రుణ సౌకర్యం కల్పించారు.

★ **పట్టణాలలో గృహాలు లేని వారికి షెల్టర్లు (షెల్టర్ ఫర్ అర్బన్ హోమ్‌లెస్ - ఎస్‌యుహెచ్) :** పట్టణాలలో గృహ వసతిలేని పేద కుటుంబాలకు అన్ని వసతులూ గల షెల్టర్లను ఏర్పాటు చేయడం ఈ పథకం లక్ష్యం. 2015-16లో 12 పట్టణాలలో 12 షెల్టర్లు మంజూరు చేశారు.

★ **పట్టణ వీధి వ్యాపారులకు సహాయ పథకం (స్కీం ఆఫ్ సపోర్ట్ టు అర్బన్ స్ట్రీట్ వెండర్స్ - ఎస్‌యుఎస్‌వి) :** రాష్ట్రంలోని అన్ని పట్టణాలలో వీధి వ్యాపారుల బతుకుదెరువు నిలకడగా కొనసాగడానికి ఈ పథకం ప్రారంభించారు. ఇది జాతీయ విధానంలో ఒక భాగం. 54,649 వీధి వ్యాపారుల ప్రొఫైల్స్ తయారుచేశారు. 110 పట్టణాలలో పట్టణ వెండింగ్ కమిటీలు ఏర్పాటు చేశారు. 13,045 మంది వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇచ్చారు.

★ **స్వయం సహాయక బృందాలు, బ్యాంకుల అనుసంధానం :** 2015-16లో మెప్మా సంస్థ 26,030 స్వయం సహాయక బృందాలకు రూ.878.0 కోట్ల రుణాన్ని ఈ పథకం ద్వారా సమకూర్చింది. ఈ పథకం ద్వారా సూక్ష్మ విత్తరంగంలో ఒక కీలక పాత్రధారిగా పనిచేస్తుంది.

★ **వడ్డీలేని రుణాలు :** పావలా వడ్డీ పథకం స్థానంలో 2012 జనవరి ఒకటో తేదీ నుంచి ఈ పథకం ప్రారంభించారు. స్వయం సహాయ బృందాల ద్వారా బ్యాంకు రుణాలు తీసుకున్న పట్టణ పేదలపై వడ్డీ భారాన్ని తగ్గించడం దీని లక్ష్యం. అదే విధంగా ఈ బృందాల వ్యాపార సంస్థల లాభదాయకత పెంచడానికి ఈ పథకం ఉపయోగపడుతుంది. రుణాల చెల్లింపు మెరుగుపడుతుంది. 2015-16 ఈ పథకం కింద అర్హతగల బృందాలకు రూ.97.92 కోట్ల సహాయం అందించింది.

★ **స్త్రీ నిధి :** పరపతి లోటును పూరించడం కోసం ప్రారంభించిన అదనపు కార్యక్రమం. ఇది 2015-16లో 4,490 స్వయం సహాయక బృందాలకు రూ.41.48 కోట్ల సాఫ్ట్ రుణం సమకూర్చింది.

★ **క్యాపిటల్ ఇన్ఫ్యూషన్ :** ఈ పథకం కింద ప్రతి స్వయం సహాయ బృంద సభ్యుడికీ రూ.10,000 మంజూరు చేసింది. మొదటి విడతగా రూ.3,000 మంజూరైంది. 2015-16లో 15,36,837 మంది సభ్యులకు రూ.460.75 కోట్లు విడుదల చేసింది.

★ **ఆమ్ ఆద్మీ బీమా యోజన (జనశ్రీ బీమా యోజన) :** జనశ్రీ బీమా యోజన పథకం 2010 అక్టోబరులో ప్రవేశపెట్టారు. అభయ హస్తం పరిధిలోకి రానివారి కోసం ఇది ప్రారంభించారు. 2015-16లో ఈ పథకం కింద 3.29 లక్షల స్వయం సహాయక బృంద మహిళలు నమోదయ్యారు. 41,759 మంది విద్యార్థినులు పారితోషికాలు పొందారు.

★ **ఉద్యమిత్వ అభివృద్ధి కార్యక్రమం (ఇడిపి) :** 2015-16లో స్వయం ఉపాధి బృందాలను, మురికివాడ సమాఖ్యలను మార్కెట్‌తో అనుసంధానం (టై అప్) చేయడానికి మెప్మా ప్రాధాన్యత నిచ్చింది. ఈ బృందాలలో పనిచేసే మహిళలకు ఉద్యమిత్వ శిక్షణ ఇవ్వడానికి ప్రతిపాదించింది. 2015-16లో ఉద్యమిత్వ అభివృద్ధి కార్యక్రమం (ఇడిపి) కింద 36,234 మంది సభ్యులు శిక్షణ పొందారు. **ALEEP, APITCO, KVK** ఆంధ్రాబ్యాంకు, కెనరా బ్యాంకు, ఆంధ్రమహిళా సభ, ప్రభుత్వేతర సంస్థలు ఈ శిక్షణ అందించాయి. కుట్టుపని, ఆహార ప్రాసెసింగ్, జూట్ ఉత్పత్తులు, గాజుల తయారీ, భోజనవసతి సమకూర్చడం (కేటరింగ్) మొదలైన బతుకుదెరువు యూనిట్లు స్వయం సహాయక బృందాలు బ్యాంకుల అనుసంధానం ద్వారా ఏర్పాటు చేశారు.

★ **నగర బతుకుదెరువు కేంద్రాలు (సిటీ లైవ్‌లీహుడ్ సెంటర్స్) :** జాతీయ పట్టణ బతుకుదెరువు మిషన్ (ఎన్‌యుఎల్ఎం) గుర్తించిన పట్టణ స్థానిక సంస్థలలో, 2015-16లో 35 నగర బతుకుదెరువు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క కేంద్రానికి రూ.3 లక్షలు విడుదల చేశారు. కంప్యూటర్, నెట్ కనెక్షన్‌తో ఫోను, సిబ్బంది నియామకాలకు ఇది ఉపయోగించుకోవాలి.

★ **ఉమ్మడి సౌకర్య కేంద్రాలు/ ఉత్పత్తి కేంద్రాలు :** ఉద్యమిత్వ అభివృద్ధి శిక్షణ ఇచ్చిన తరువాత స్వయం సహాయక బృందాలలోని మహిళలకు ఉద్యమిత్వ అభివృద్ధి చేయూత అందించనున్నారు. అన్ని జిల్లాలలో 42 ఉత్పత్తి కేంద్రాలు నెలకొల్పారు. కుట్టుపని, జూట్ ఉత్పత్తులు, పచ్చళ్ల తయారీ వంటి కార్యకలాపాలు నిర్వహించనున్నారు.

★ **జనరిక్ మందుల దుకాణాలు :** 2015-16లో పట్టణంలో 52 దుకాణాలు ఏర్పాటు చేశారు.

★ **మెప్మా బజార్లు :** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థల సహకారంతో స్వయం సహాయక బృందాలు తమ మార్కెట్లను పెంచుకోవడం కోసం ఎగ్జిబిషన్‌లలో పాల్గొనడానికి మెప్మా తోడ్పడింది. న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్, హైదరాబాద్ ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వహించిన నుమాయిష్ ఎగ్జిబిషన్‌లో ఇది పాల్గొని, తమ స్వశక్తి బ్రాండు ఉత్పత్తులు విక్రయించాయి.

అన్ని జిల్లాలోని కలెక్టరు కార్యాలయాలు, ఆస్పత్రులు, మున్సిపల్ కార్యాలయాలు, మార్కెట్ యార్డులు, మండల రెవెన్యూ కార్యాలయాలు, ఇతర బహిరంగ ప్రదేశాలలో 129 స్వశక్తి క్యాంటీన్లు నెలకొల్పారు. ★

ఉద్యోగాలు

1051 పంచాయతీ సెక్రటరీ పోస్టులకు నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ సబార్డినేట్ సర్వీస్‌లో 1051 పంచాయతీ సెక్రటరీ పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ ప్రకటన విడుదల చేసింది.

జిల్లాల వారీ ఖాళీలు: శ్రీకాకుళం-114, విజయనగరం-120, విశాఖపట్నం-107, తూర్పు గోదావరి-104, పశ్చిమ గోదావరి-25, కృష్ణా-22, గుంటూరు-50, ప్రకాశం-172, నెల్లూరు-63, చిత్తూరు-141, అనంతపురం-41, కర్నూలు-90, కడప-2.

అర్హత : ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత.

వయసు : జులై 1, 2018 నాటికి 18-42 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ/ ధ్రువపత్రాల పరిశీలన.

దరఖాస్తు ఫీజు: అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250, ఎగ్జామినేషన్ ఫీజు రూ.80.

ఫీజు చెల్లించడానికి చివరితేదీ : జనవరి 18, 2019.

ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు : జనవరి 19, 2019 వరకు.

స్క్రీనింగ్ టెస్ట్ తేదీ : ఏప్రిల్ 21, 2019.

మెయిన్ ఎగ్జామ్ తేదీ : ఆగస్టు 2, 2019.

పూర్తి వివరాలకు : వెబ్‌సైట్‌లో పరిశీలించొచ్చు.

వెబ్‌సైట్: https://psc.ap.gov.in/

పారిశ్రామికోత్పత్తి ఢమాల్

- **17 నెలల కనిష్టానికి పతనం**
- **నవంబర్‌లో పడకేసిన తయారీ రంగం**
- **సిఎస్ఒ గణంకాల వెల్లడి**

న్యూఢిల్లీ : దేశంలో కొనుగోలు డిమాండ్ పడిపోయి పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) నేల చూపులు చేస్తోంది. ముఖ్యంగా తయారీ రంగంలో స్తబ్దత వల్ల గతేడాది నవంబర్‌లో ఐఐపి వృద్ధి 0.5 శాతానికి క్షీణించింది. దీంతో పారిశ్రామిక ఉత్పత్తి 17 నెలల కనిష్టానికి పడిపోయినట్లయ్యింది. శుక్రవారం కేంద్ర గణంకాల శాఖ (సిఎస్ఒ) నవంబర్ ఐఐపి రిపోర్టును వెల్లడించింది. 2017 ఇదే నవంబర్‌లో ఏకంగా 8.5 శాతం వృద్ధి చోటు చేసుకుంది. ఇది వరకు జూన్ 2017లో అత్యల్పంగా 0.3 శాతం పెరుగుదల నమోదయ్యింది. ఆ తర్వాత ఈ స్థాయిలో క్రితం నవంబర్‌లోనే పడిపోయింది. 2018 అక్టోబర్ ఐఐపి సూచీని 8.1 శాతం నుంచి 8.4 శాతానికి కేంద్ర గణంకాల శాఖ సవరించింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ కాలంలో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ 5 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో 3.2 శాతం పెరుగుదల నమోదయ్యింది. పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో 77.63 శాతం వాటా కలిగిన తయారీ రంగం క్రితం నవంబర్‌లో కేవలం 0.4 శాతం వృద్ధితో సరిపెట్టుకుంది. 2017 ఇదే మాసంలో ఈ రంగం 10.4 శాతం వృద్ధిని సాధించింది. ఈ నెలలో గనుల రంగం 1.4 శాతం పెరగ్గా, 2018 నవంబర్‌లో 2.7 శాతం వృద్ధిని కనబర్చింది. విద్యుత్ రంగం ఉత్పత్తి 5.1 శాతానికి పెరిగింది. 2017 ఇదే మాసంలో విద్యుత్ రంగం 3.9 శాతం పెరుగుదలను నమోదు చేసింది. ఈ మాసంలో కాపిటల్ గూడ్స్ 3.7 శాతంగా ఉండగా, క్రితం నవంబర్‌లో 3.4 శాతానికి పడిపోయింది.

కన్సూమర్ డ్యూరెబుల్స్ సూచీ 2017 నవంబర్‌లో 3.1 శాతం వృద్ధిని సాధించగా, క్రితం నవంబర్‌లో ఏకంగా 0.9 శాతం పెరుగుదలతో సరిపెట్టుకుంది. ఇదే సమయంలో కన్సూమర్ నాన్ డ్యూరెబుల్స్ పెరుగుదల 0.6 శాతానికి క్షీణించింది. 2017 ఇదే మాసంలో ఈ రంగం ఉత్పత్తి ఏకంగా 23.7 శాతం వృద్ధిని సాధించింది. 2018 నవంబర్‌లో తయారీ రంగంలోని 23 పరిశ్రమల గ్రూపుల్లో 10 సూచీలు మాత్రమే సానుకూలంగా ఉండగా, మిగితా విభా గాలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. క్రితం నవంబర్‌లో ప్రాథమిక వస్తువులు 3.2 శాతం, ఇంటర్మీడియట్ గూడ్స్ (-)4.5 శాతం, మౌలిక వసతులు, నిర్మాణ రంగం 5 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేశాయి. భారత్ సులభ వ్యాపారంలో దూసుకుపోతుందని, మేక్ ఇన్ ఇండియా ఫలితాలు అద్భుతంగా ఉన్నాయని పదే పదే చెప్పుకుంటున్న మోడీ సర్కార్‌కు నవంబర్ మాసం పారిశ్రామికోత్పత్తి గణంకాలు చెంపపెట్టులా నమోదయ్యాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

మార్కెట్లలో తీవ్ర ఊగిసలాట


సెన్సెక్స్ 96 పాయింట్ల పతనం

ముంబయి : మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో వరుసగా రెండో రోజూ దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలు చవి చూశాయి. శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ తొలుత 36,192 గరిష్ట స్థాయి వద్ద బలంగానే ప్రారంభమైనప్పటికీ అంతర్జాతీయ బలహీన పరిణామాల నేపథ్యంలో ఎక్కువ సమయం నిలువలేకపోయింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడం, డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో పలు కార్పొరేట్ కంపెనీల ఫలితాలు మదుపర్లను మురిపించలేకపోవడం తదితర పరిణామాల మధ్య మార్కెట్లు తీవ్ర ఊగిసలాటకు గురైయ్యాయి. తుదకు బిఎస్ఇ సెన్సెక్స్ 96.66 పాయింట్లు లేదా 0.27 శాతం తగ్గి 36,009.84కు పడిపోయింది. ఇంట్రా ట్రేడింగ్‌లో 36,214-35,840 మధ్య కదలాడింది. సెన్సెక్స్-30లో ఇండుస్ఇండ్ బ్యాంకు, టాటా మోటార్స్, టిసిఎస్, యస్ బ్యాంకు, ఎల్అండ్‌టి షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు ఐటిసి, ఒఎన్‌జిసి, వేదాంత, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి సూచీలు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. రంగాల వారిగా నిఫ్టీలో ఎఫ్ఎంసిజి, రియాల్టీ సూచీలు అత్యధికంగా 1.43 శాతం మేర నష్టపోయాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు వరుసగా 0.13 వాతం, 0.19 శాతం చొప్పున నష్టపోయాయి.

లివ్‌ఫాస్ట్ నుంచి కొత్త ఇన్వర్టర్లు

తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి విడుదల

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో



ఎస్ఎఆర్ గ్రూపునకు చెందిన లివ్‌ఫాస్ట్ మార్కెట్లోకి 25 శాతం వేగవంతమైన ఛార్జింగ్, 25 శాతం అదనపు బ్యాటరీ బ్యాకప్‌తో కూడిన ఇన్వర్టర్ల శ్రేణిని మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ గ్రూపు వాహన బ్యాటరీఉ, ఇన్వర్టర్లు, ఇన్వర్టర్ బ్యాటరీల వ్యాపారంలో ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరంలో రూ.1000 కోట్ల టర్నోవర్ నమోదు చేశామని లివ్‌ఫాస్ట్ సిఇఒ గురుప్రీత్ సింగ్ బాటియా తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లివ్‌ఫాస్ట్ బ్యాటరీలకు ప్రముఖ క్రికెటర్ ధోణిని ప్రచారకర్తగా నియమించుకున్నామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి రెట్టింపు రెవెన్యూ రూ.2,000 కోట్లు అంచనా వేస్తున్నామన్నారు. ఇన్వెర్టర్ల విభాగంలో వచ్చే 15 మాసాల్లో 15 శాతం మార్కెట్ వాటా అంచనా వేస్తున్నామన్నారు. ప్రస్తుత ఏడాది ముగింపు నాటికి దేశ వ్యాప్తంగా 25,000 అవుట్‌లెట్లకు విస్తరించనున్నామన్నారు. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 22 మంది డిస్ట్రిబ్యూటర్లు, 3,000 మంద్ది డీలర్లకు విస్తరించనున్నామని తెలిపారు. తాము ప్రస్తుతం 18 మోడళ్ల బ్యాటరీలను తయారు చేస్తున్నామన్నారు. దేశంలో రూ.55వేల కోట్ల విలువ చేసే ఇన్వెర్టర్ల బ్యాటరీల వ్యాపారం జరుగుతుందన్నారు.

రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ

రిజర్వుబ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులతో సమానంగా రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగులందరికీ ఫ్యామిలీ పెన్షన్ పెంచాలని వైజాగ్ యూనిట్ రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐబిఆర్ఎఫ్(ఎపి) ఇండియన్ బ్యాంక్స్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.రామచంద్రరావు మాట్లాడుతూ, 2002 సంవత్సరానికి ముందు ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులందరికీ 100 శాతం కరువు భత్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీనామా చేసిన ఉద్యోగులకు పింఛను ప్రయోజనాలు వర్తింపజేయాలని కోరారు. గ్రాట్యూటీ, పింఛను లెక్కింపులో స్పెషల్ అలవెన్స్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. జెపి శర్మ, నరసయ్య, ప్రభాకర్, జి.వాసుదేవ్‌మూర్తి, టి.కామేశ్వర రావు, ఐ.కేశవరావు, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్



బలవంతపు భూసేకరణ అన్యాయం

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

బలవంతపు భూసేకరణ చేయడం అన్యాయమని, 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సిపిఎం ఉత్తర, దక్షిణ ప్రాంత జిల్లా కార్యదర్శులు వి.రాంభూపాల్, ఎం.ఇంతియాజ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుంపర్తి, మోటుమర్ల గ్రామాల్లో బలవంతపు భూసేకరణ ఆపాలని, తమ భూములు అప్పగించాలని కోరుతూ ఆ గ్రామాల రైతులు భూ హక్కుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. రెడు రోజులుగా శిబిరంలోనే ఉంటూ రైతులు, నాయకులు నిరసన తెలిపారు. వీరి ఆందోళనకు మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మద్దతు తెలిపి మాట్లాడారు. రైతుల ఆమోదం మేరకు భూములు స్వాధీనం చేసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బలవంతంగా భూములు సేకరించడం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందన్నారు. పరిహారం ఇవ్వకుండా ఉన్న ఉపాధిని దూరం చేయడం దయనీయమైన పరిస్థితి అన్నారు. ప్రభుత్వం పునరాలోచించి రైతులకు భూములు అప్పగించాలని డిమాండ్ చేశారు. రాంభూపాల్, ఇంతియాజ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తూ రైతులకు అన్యాయం చేస్తోందన్నారు. వంశ పారంపర్యంగా వస్తున్న భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, నాలుగు తరాలు ఆ భూములపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేయించుకోవాలనే తపనతో ఇంకో ప్రాంత రైతులను ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రైతులకు ఆ భూములు తిరిగి ఇప్పించాలని కోరారు.

ప్రయి'వేటు'కే కాఫీ కొనుగోలు

- ఐసిఎస్‌డికి అప్పగించడాన్ని వ్యతిరేకించిన జిసిసి ఎమ్‌డి బాబురావునాయుడు
- పట్టించుకోకుండా అమలుకు ప్రభుత్వ యత్నం
- జిసిసి నిర్వీర్యానికి చంద్రబాబు కుట్ర
- నోరువిప్పని గిరిజన మంత్రి శ్రావణ్‌కుమార్



ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి


ఇంటర్ కో-ఆపరేషన్ సోషల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా (ఐసిఎస్‌డి)సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందంపై జిసిసి ఎమ్‌డి టి.బాబూరావునాయుడు అభ్యంతరాలను చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదు. కాఫీ కొనుగోలు బాధ్యత నుంచి జిసిసిని క్రమంగా తప్పించి, ఐసిఎస్‌డికి అప్పగించే ప్రభుత్వ కుట్రలపై తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదు.

చింతపల్లి జిసిసి బ్రాంచ్ పరిధిలో రైతుల కాఫీ ఉత్పత్తిని ఐసిఎస్‌డికి అప్పగించడంపై జిసిసి బాబూరావునాయుడు వ్యతిరేకిస్తున్నారు. చాపకిందనీరులా సాగుతున్న ఒప్పంద వ్యవహారాన్ని గిరిజన సంఘం గతంలో వెలుగులోకి తీసుకొచ్చింది. కాఫీ కొనుగోలును ఐసిఎస్‌డికి అప్పగించొద్దంటూ ఆందోళనలు చేసింది. ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోకుండా జిసిసిని నిర్వీర్యం చేసి, ఐసిఎస్‌డికి లాభం చేకూర్చాలన్న సంకల్పంతో జిసిసి ఎమ్‌డితో సంబంధం లేకుండానే ఒప్పందం చేసుకుంది. ఐసిఎస్‌డిసితో చేసుకున్న ఒప్పందంలో ట్రైకార్, రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి, పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సంతకాలు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. తనకున్న అనుమానాలను నివృత్తిచేయకుండా, అభ్యంతరాలకు సమాధానం చెప్పకుండా ఒప్పందంపై సంతకం చేసేదిలేదని జిసిసి ఎమ్‌డి బాబూరావునాయుడు తెగేసి చెప్పడంతో ఆయన్ను పక్కకునెట్టి ఒప్పందాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. కాఫీ రైతులకు సహకరిస్తున్న జిసిసిని కాదని, కాఫీ కొనుగోలును ఐసిఎస్‌డికి అప్పగించే ఒప్పందంపై సంతకం చేసి తాను గిరిజనులకు అన్యాయం చేయలేనని ఒకదశలో ప్రభుత్వానికి చెప్పినట్లు కూడా తెలిసింది. జిసిసి వనరులన్నింటినీ ఉపయోగించుకొని గిరిజన రైతుల నుంచి కాఫీ కొనుగోలును ప్రయివేటు సంస్థకు అప్పగించడాన్ని వ్యతిరేకించిన గిరిజన ఐఎఎస్ అధికారి బాబూరావునాయుడును ప్రభుత్వం పక్కకు నెట్టి తన గిరిజన వ్యతిరేక స్వభావాన్ని మరోమారు చాటుకుంది.

ఐసిఎస్‌డితో జరిగిన ఒప్పందంపై జిసిసి ఎమ్‌డి, ప్రభుత్వానికి మధ్య అంతర్గత వార్ జరుగుతుండగానే, ప్రభుత్వంతో కాఫీ కొనుగోలు ఒప్పందం చేసుకున్న ఐసిఎస్‌డిని ఐక్యరాజ్యసమితి నిషేధిత జాబితాలో చేర్చినట్లు ప్రచారం జరగడంతో ప్రభుత్వం ఇరుకునపడింది. నిషేధిత జాబితాలో ఐసిఎస్‌డి వున్నట్లు తమకు తెలీదని గిరిజన సంక్షేమశాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి ప్రజాశక్తితో అన్నారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ సొంత ప్రాంతంలో గిరిజనులకు నష్టం తెచ్చే ఒప్పందాలపై ఆయన నోరు విప్పకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

విశాఖ ఏజెన్సీలో సుమారు 70వేల మంది కాఫీ రైతులు అరాబిక్ పాచ్‌మెంట్, అరాబిక్ చెర్రీ కాఫీ 10 వేల టన్నులు ఏటా ఉత్పత్తి చేస్తున్నారు. దీంట్లో చింతపల్లి మండలంలో 3వేల టన్నులకు పైగా కాఫీ దిగుబడివుంటుందని అంచనా. ఇంత పెద్దఎత్తున కాఫీ ఉత్పత్తి జరుగుతున్న మండలంలో గిరిజనులకు లబ్ధి చేకూర్చే జిసిసిని తప్పించి, ప్రయివేటు సంస్థకు అప్పగించడం వెనుక అవినీతి భారీ స్థాయిలో జరిగిఉంటుందన్న ప్రచారం వుంది. 2018 అక్టోబర్ నుండి 2021 వరకు కాఫీ మార్కెటింగ్ కోసం ట్రైకార్‌తో జిసిసి ఒప్పందం చేసుకొని, గతేడాది 1000 టన్నుల వరకు కాఫీని జిసిసి కొనుగోలు చేసింది. ఈ కొనుగోలును మరింత విస్తరించాలని జిసిసి యోచిస్తుండగానే మధ్యలో ఐసిఎస్‌డికి కొనుగోలుకు ప్రభుత్వం అధికారం కట్టబెట్టింది. 2019 మార్చి తరువాత ది పార్ట్‌నర్స్ ఇన్ ప్రాస్పెరిటీ అనే సంస్థకు కాఫీ మార్కెట్‌ను పూర్తిగా అప్పజెప్పాలని ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. జిసిసికి ఆర్థిక సహాయం చేయడానికి ముందుకురాని ప్రభుత్వం, కాఫీ కొనుగోలుకు ఐసిఎస్‌డికు రూ.15.51 కోట్ల రూపాయలు ట్రైకార్ ద్వారా చెల్లించడానికి అంగీకారం తెలపడం గమనార్హం.

రద్దు చేయకపోతే ఉద్యమం : పి.అప్పలనర్స, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



ఐసిఎస్‌డితో చేసుకున్న ఒప్పందం రద్దు చేయకపోతే గిరిజనులను సమీకరించి ఉద్యమం చేపడతాం. గిరిజన సబ్‌ప్లాన్ నిధుల ఖర్చుకు ఐసిఎస్‌డికు అనుమతివ్వడం సరికాదు. ఒప్పందానికి ఐటిడిఎ పాలకమండలి ఆమోదం లేదు. కాఫీ రైతులు, గిరిజన సంఘాలతో సంప్రదించకుండా అక్రమ ఒప్పందాలు చేసుకోవడం సరికాదు. ఒప్పందం రద్దయ్యే వరకు పోరాడుతాం.

ఒప్పందం రద్దు చేయాలి : కె.లోకనాథం, సిపిఎం జిల్లా కార్యదర్శి



చింతపల్లిలో కాఫీ కొనుగోలుకు ఐసిఎస్‌డితో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం రద్దు చేయాలి. కాఫీ కొనుగోలు జిసిసి ద్వారా చేపట్టి, మార్కెట్ సదుపాయం ప్రభుత్వం కల్పించాలి. దళారీల స్థానంలో ప్రభుత్వమిప్పుడు ప్రయివేటు సంస్థలకు దోచుకొనేందుకు అవకాశం కల్పించి గిరిజనులకు అన్యాయం చేస్తోంది. జిసిసి వ్యతిరేకించినా ఒప్పందం చేసుకొని అమల్లోకి వెళ్లడం ప్రభుత్వ నియంతృత్వానికి నిదర్శనం.



డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఎమ్‌డి విజయకుమార్, డిఎస్‌ఎమ్ఎమ్ జాతీయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు

కెవిపిఎస్ కృషి అభినందనీయం

డైరీ ఆవిష్కరణలో ఎస్సీ కార్పొరేషన్ ఎమ్‌డి విజయకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వెనుకబడిన వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించి, వారి సామాజికాభివృద్ధికి సహకరిస్తున్న కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) కృషిని ఎస్సీ కార్పొరేషన్ ఎం.డి జియస్ఆర్‌కెఆర్ విజయకుమార్ అభినందించారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం కెవిపియస్ డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో కులవివక్షను వ్యతిరేకించే సంఘాలు అనేకం ఉన్నప్పటికీ కెవిపియస్ ప్రజల్లో ఆదరణ పొందిందన్నారు. కెవిపియస్ తన ఆలోచనలను బలోపేతం చేసుకుని దళిత, వెనుకబడిన వర్గాల్లో ధైర్యాన్ని నింపి వారికి అండగా నిలవాలని కోరారు. దళిత్ శోషణ్ ముక్తి మంచ్(డిఎస్‌ఎమ్ఎమ్) జాతీయ కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ పేరును వాడుకుని నేడు అనేక కుల సంఘాలు పుట్టుకొస్తున్నాయన్నారు. కానీ ఈ సంఘాలేవీ కుల వివక్ష దాడులను అరికట్టడానికి ముందుకు రావడంలేదని తెలిపారు.

దేశాన్ని పట్టి పీడిస్తున్న మనువాదం, మతోన్మాదాన్ని ఎదిరించే ధైర్యం ఒక్క కెవిపియస్‌కు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. కొంతమంది స్వలాభం కోసం సంఘాలను స్థాపించి కొన్ని కులాలకు ఊడిగం చేస్తున్నారన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత కలలుకన్న సమాజాన్ని నిర్మించడానికి కెవిపియస్ తమ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కెవిపియస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, జి నటరాజు, ఒ నల్లప్ప, రఘురాం, ఎమ్ డి ఆనంద్‌బాబు, కృష్ణమోహన్, సాల్మన్‌రాజు, రామకృష్ణ, క్రాంతి, గణేష్, సురేంద్ర, వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు జాతి ఎడ్ల బండ లాగుడు పోటీలు

తొలి రోజు రెండు పళ్ళ విభాగంలో గుంటూరు జిల్లా ఎడ్లజతల హవా

ప్రజాశక్తి - గుడివాడ(కృష్ణా)



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని

కృష్ణాజిల్లా గుడివాడలో జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు ప్రదర్శన శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. గుడివాడ మండలం లింగవరంలోని కె-కన్వెన్షన్‌లో బండలాగుడు పోటీలను గుడివాడ శాసనసభ్యులు కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ప్రారంభించారు. ఎన్‌టిఆర్ 2 వైయస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 11వ తేదీ నుండి నుంచి 15వ తేదీ వరకు జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాడుగు ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. తెలుగువారి సాంప్రదాయ పండుగ సంక్రాంతిని సాంప్రదాయ పద్ధతిలో జరుపుకునేందుకు ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 100 జతల ఎడ్లు హాజరయ్యాయి. పాలపళ్ళు, వ్యవసాయ, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. 5 విభాగాలుగా తొమ్మిది రకాల ప్రదర్శనలను నిర్వహిస్తున్నారు. రెండు పళ్ళ విభాగంలో గుంటూరుజిల్లా, పత్తిపాడు మండలం చినకొండ్రుపాడుకు చెందిన కండే హనుమంతరావు ఎడ్ల జత, గుంటూరు జిల్లా అమరావతి, మనుగోడుకు చెందిన కె.ఆస్.ఆర్ నంది బ్రీడింగ్ బుల్ సెంటర్‌కు చెందిన ఎడ్ల జత, గుంటూరు జిల్లా, ముపాళ్ళ మండలం మాదాలకు చెందిన పొన్నిబోయిన విష్ణుభరత్‌కు చెందిన ఎడ్ల జతలు సంయుక్తగా 4,500 అడుగుల దూరం బండను లాగి ప్రథమస్థానం, గుంటూరుజిల్లా శ్యామలాపురం పిచికలపాలేనికి చెందిన కంచర్ల లక్ష్మణరావు, నరసరావుపేట మండలం, కొండరావూరుకు చెందిన వెన్నపూస వెంకటకోటిరెడ్డి ఎడ్ల జతలు సంయుక్తంగా 4242.9 అడుగుల దూరం బండలాగి ద్వితీయ స్థానంలో నిలిచారు. అమరావతి, జిడుగుకు చెందిన ఏలూరి గణేష్ చౌదరికి చెందిన ఎడ్ల జత 4,200 అడుగుల దూరంతో తృతీయ స్థానం, నరసరావుపేట మండలం, రాజుపాలెంకు చెందిన బి.రమ్యానాయుడు ఎడ్ల జత, నరసరావుపేట మండలం కొండరావూరుకు చెందిన మర్రి శ్రీనివాసరావు ఎడ్ల జతలు సంయుక్తంగా 4055.5 అడుగుల దూరంతో నాల్గోస్థానం, గుంటూరు జిల్లా, ముపాళ్ళ మండలం తొండపికు చెందిన దరిసినాల చెన్నకేశవుల ఎడ్ల జత 4037.3అడుగుల దూరం బండ లాగి 5వ స్థానం, నరసరావుపేట మండలం, కొండరావూరుకు చెందిన వెన్నపూస చిన్నప్పరెడ్డి ఎడ్లజత 3855.7 అడుగుల దూరం బండలాగి 6వ స్థానం, గుంటూరు జిల్లా జిడుగుకు చెందిన బండి సాహిత్ శ్రీభవన్‌ల ఎడ్ల జత 3632.7 అడుగుల దూరం బండలాగి 7వ స్థానం, మోపిదేవి మండలం కొక్కిలిగడ్డకు చెందిన ముమ్మనేని బాలాజీరావు ఎడ్ల జత 3600అడుగుల దూరం బండలాగి 8వ స్థానంలో నిలిచాయి. తొలిరోజు ప్రదర్శనలో విజేతలకు ఎమ్మెల్యే నాని, సిటికేబుల్ ఎం.డి నారాయణప్రసాద్, యాదవ సేవాసంఘం నాయకులు డొక్కు రాంబాబు తదితరుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పోటీలను తిలకించేందుకు ప్రేక్షకులు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే నాని, ఆయన సోదరుడు చిన్నిలు దగ్గరుండి ప్రదర్శనల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

అధిక వడ్డీ ఆశ చూపి ప్రజల నుంచి కోట్లాది రూపాయలను వసూలు చేశారన్న ఆరోపణల్లో నిందితురాలుగా ఉన్న నౌహీరా, మరో ఇద్దరు నిందితులు థామస్, బిజూ థామస్‌లను మూడు రోజులు సిఐడి కస్టడీ అనంతరం శుక్రవారం సాయంత్రం జిల్లా కోర్టులో హాజరు పరిచారు. జిల్లా జడ్జి రవీంద్ర బాబు ఈనెల 25 వరకు రిమాండ్ గడువును పొడిగించారు. నౌహీరాతో పాటు మరో ఇద్దరిని పోలీసులు స్థానిక సబ్‌జైలుకు తరలించారు. - చిత్తూరు

పుస్తక విజ్ఞానం ప్రతి ఒక్కరికీ అవసరం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ప్రతిఒక్కరూ పాఠశాల స్థాయి నుండే జనరల్ నాలెడ్జి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని ఇంటెలిజెన్స్ కమిషనర్ ఎ.బి.వెంకటేశ్వరరావు అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని స్వరాజ్యమైదాన్‌లో జరుగుతున్న 30వ పుస్తక మహోత్సవ్‌లో శుక్రవారం సాయంత్రం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు అంటే కష్టంతో కాకుండా ఇష్టంగా చదవాలన్నారు. సాధారణంగా చాలా మంది సబ్జెక్టు పుస్తకాలు అంటే ఇష్టంగా చదువుతారని జనరల్ నాలెడ్జి పుస్తకాలు అంటే ఇష్టపడరని తెలిపారు. వాస్తవానికి సబ్జెక్టు పుస్తకాలతో పాటు జనరల్ నాలెడ్జి పుస్తకాలపై కూడా పట్టు ఉన్నవారే అన్ని రంగాల్లోనూ ఉన్నతులుగా ఎదగగలరని అన్నారు. సాహితీవేత్త పతంజలి శాస్త్రి మాట్లాడుతూ పుస్తకం మనిషిని విజ్ఞానంపైపు నడిపిస్తుందన్నారు. పుస్తకాలు అంటే ప్రతి ఒక్కరూ ప్రేమిస్తారని వాటిలో విజ్ఞానం తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ గౌరవాధ్యక్షులు బి.బాబ్జి, కార్యదర్శి ఎం.లక్ష్మయ్య, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఎఎన్‌యు విసికి సత్కారం

ఇన్‌చార్జి విసిగా తిరిగి నియామకం

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విసిగా తన పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న ప్రొఫెసర్ ఎ.రాజేంద్ర ప్రసాద్ దంపతులను వర్సిటీలో అధ్యాపక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విసిగా రాజేంద్రప్రసాద్ పనితీరును కొనియాడారు. అధ్యాపకులు, ఉద్యోగులైతే విసిగా మళ్లీ ఆయన్నే నియమించేలా సిఫార్సు చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ పి.నరసింహరావు, ఎమ్మెల్సీ ఎఎస్.రామకృష్ణను కోరారు. వర్సిటీకి పరిపూర్ణ అభివృద్ధిని అందించిన వారిలో రాజేంద్రప్రసాద్ ఒకరని నూటా కార్యదర్శి డాక్టర్ తసింహాచలం అన్నారు. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచని సమస్యలను ఆయన పరిష్కరించారని వికాస ఉద్యోగ సంఘం అధ్యక్షుడు బి.రాజశేఖర్ చెప్పారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమకు వేతనాలు పెంచారనిదినసరి వేతన ఉద్యోగుల సంఘం కార్యదర్శి నంబూరు సాంబయ్య పేర్కొన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించారని చెప్పారు. అనంతరం విసి మాట్లాడుతూ ఇక్కడ చేపట్టిన సంస్కరణలు ఇతర విశ్వవిద్యాలయాలకు ఆదర్శవంతంగా నిలిచేలా అంతా కృషి చేయాలన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.రోశయ్య అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆచార్య చందన్, ఆచార్య చంద్రకుమార్, ఆచార్య పి.సిద్ధయ్య, ఆచార్య ఎ.ప్రమీలారాణి, జనకీరామమూర్తి పాల్గొన్నారు.

విసిగా మళ్లీ ఆయనే..

ఇదిలా ఉండగా వర్సిటీ ఇన్చార్జి వైస్ ఛాన్స్‌లర్‌గా ఎ.రాజేంద్రప్రసాద్‌ను తిరిగి నియమిస్తూ ఉన్నత విద్యామండలి ప్రిన్సిపల్ సెక్రటరీ కె.దమయంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జీవో ఎంఎస్ 1ని విడుదల చేశారు. తదుపరి పూర్తి కాల వీసీ నియమితులయ్యేవరకూ రాజేంద్రప్రసాద్ కొనసాగనున్నారు.

అధికారంలోకి వస్తే ఎపికి ప్రత్యేక హోదా : రాహుల్


దుబాయ్ : వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదానిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఇక్కడ శుక్రవారం హామీనిచ్చారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం దుబాయ్ చేరుకున్న రాహుల్ అక్కడ లేబర్ కాలనీలో భారతీయ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. ' తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తాం' అని అన్నారు. ' మీరు దేశంతో పాటు మన రాష్ట్రాలు, పేద ప్రజలకు సహాయం చేశారు. ప్రపంచంలో అతి పెద్ద నగరమైన దుబాయ్ అభివృద్ధిలో పాలుపంచుకున్నందుకు అభినందనల'ని భారతీయులను ఉద్దేశించి అన్నారు. ఇక్కడ భారీ అభివృద్ధి ఉందని, బహుళ అంతస్తులు, పెద్ద విమానాశ్రయలు, మెట్రోస్టేషన్లు ఉన్నాయని, మీ కృషి లేకుండా ఇవి నిర్మించడం అసాధ్యమని కొనియాడారు. గత ఏడాదిలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తమ పార్టీ నేతలు నిరసనలు తెలిపారని కూడా ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆంధ్రకు ఎందుకు ప్రత్యేక హోదా ఇవ్వాలని మోడీ అన్నారని, ఎపికి ఎంత బాకీ పడ్డారో ఆయనకు, కేంద్రానికి అర్థమయ్యేలా చెప్పాలని అన్నారు.

సమావేశం । భారత పర్యటనకు వచ్చిన నేపాల్ విదేశాంగ మంత్రితో సమావేశమై ద్వైపాక్షిక అంశాలపై చర్చిస్తున్న భారత విదేశాంగమంత్రి సుష్మాస్వరాజ్



ఎన్ఎస్ఇ ఛైర్మన్ రాజీనామా

మాక్సిస్-ఎయిర్‌సెల్ కేసు ఎఫెక్ట్



ముంబయి : నేషనల్ స్టాక్ ఎక్సేంజీ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఇ) ఛైర్మన్ అశోక్ చావ్లా రాజీనామా చేశారు. ఎయిర్‌సెల్-మాక్సిస్ కేసులో ఆయనకు పాత్ర ఉందని ఈ మధ్య కాలంలో వచ్చిన రిపో ర్టులతో వైదొలగాల్సి వచ్చింద ని తెలుస్తోంది. కాగా చావ్లా రాజీనామా తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ఎన్ఎస్ఇ శుక్రవారం వెల్లడించింది. ఆయనపై వచ్చిన ఆరోపణలపై సెబీ కూడా విచారణ జరపనుంది. ఎయిర్‌సెల్-మాక్సిస్ కేసులో చావ్లాతో పాటు మరో నలుగురు అధికారులను విచారించడానికి అనుమతినివ్వా లని సిబిఐ శుక్రవారం ఢిల్లీలోని స్పెషల్ కోర్టును కోరింది. ఆర్థిక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎవరైనా స్టాక్ ఎక్సేంజీ నిర్వహణలో ఉండకూడదని సెబీ స్టాక్ ఎక్సేజీ అండ్ క్లియరింగ్ కార్పొరేషన్స్ (ఎస్ఇసిసి) నిబంధనలు పేర్కొంట ున్నాయి. చావ్లాపై రెండు ఫిర్యాదులు రావడంతో సెబీ కూడా ప్రాథమిక విచారణ ప్రారంభించినట్లు తెలిపింది. ఈ నేపథ్యంలోనే చావ్లా వైదొలిగారని తెలుస్తోంది. అదే విధంగా ఈ కేసులో ప్రధాన అరోపణలు ఎదుర్కొంటున్న మాజీ కేంద్ర మంత్రి పి చిదంబరం, ఆయన కుమారుడు కార్తిని ఫిబ్రవరి 1 వరకు అరెస్ట్ చేయకుండా స్పెషల్ కోర్టు ఉత్తర్వులిచ్చింది. 2006లో చిదంబరం ఆర్థికమంత్రిగా ఉన్నపుడు మ్యాక్సిస్ అనుబంధ సంస్థ గ్లోబల్ కమ్యూనికేష న్స్‌కి రూ.3,680 కోట్ల మేర ఎఫ్ఐపిబి అనుమతులు జారీచేసింది. రూ.600 కోట్లు దాటితే కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీనే అనుమతులివ్వాలి. చిదంబరం నిబంధనలు ఉల్లంఘించి ఎలా అనుమతులిచ్చారనే విష యమై దర్యాప్తు సంస్థలు విచారిస్తున్న విషయం తెలిసిందే. మాక్సిస్‌కు అనుమతులిచ్చిన సమయంలో చావ్లా ఆర్థిక వ్యవహారాల అదనపు కార్యదర్శితో పాటు, ఎఫ్ఐపిబిలో సభ్యులుగా ఉన్నారు.

మరో కుట్ర

అలోక్ వర్మ బదిలీపై సిపిఎం

ఇండియా న్యూస్‌నెట్‌వర్క్, న్యూఢిల్లీ:
సిబిఐ చీఫ్‌గా అలోక్ వర్మను సుప్రీంకోర్టు నియమిం చిన 48 గంటల్లోనే ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో ఆయనను బదిలీ చేసిన కేంద్ర ప్రభుత్వ చర్యను సిపిఎం పొలిట్‌బ్యూరో శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండి ంచింది. మోడీ సారథ్యం లోని కేంద్ర ప్రభుత్వం తన రాజ కీయ, ఎన్నికల అజెండాను కొనసాగించేందుకు సిబిఐని ఒక పావుగా వాడుకోటానికి ప్రయత్నిస్తోందని, అందుకే ఆ సంస్థపై పూర్తి నియంత్రణను తన చేతుల్లోకి తీసుకునేం దుకే మోడీ సర్కారు ఈ నిర్ణయం తీసుకున్నదని పొలిట్ బ్యూరో వ్యాఖ్యానించింది. తన విధేయులను రక్షించ టంతో పాటు ప్రభుత్వ విమర్శకులను, వ్యతిరేకులను బెదిరించి, బ్లాక్‌మెయిల్ చేసి వారి నోళ్లు మూయించేం దుకు బిజెపి ప్రయత్నిస్తోందని పొలిట్‌బ్యూరో తన ప్రకటనలో ధ్వజ మెత్తింది. ఈ నిర్ణయం, అనంతర చర్యల ద్వారా తన తాబేదారులను గీత దాటకుండా చూసుకునేం దుకు మోడీ సర్కారు ప్రయత్నిస్తోందని పేర్కొంది. ఏ మాత్రం చట్టబద్ధత లేని, ప్రశ్నార్థకంగా మారిన సివిసి నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం గత అక్టోబర్ 23న సిబిఐపై తన తొలి కుట్రను విజయవంతంగా అమలు చేసిందని గుర్తు చేసింది. ఇది అక్రమమని గుర్తించిన సుప్రీంకోర్టు అలోక్ వర్మను ఆయన పదవిలో పునర్నియమించిందని, ఇప్పుడు రెండో కుట్ర ద్వారా ఆయన్ను మరో ప్రాధాన్యతలేని పదవిలోకి బదిలీ చేసి ప్రభుత్వం అవమానించిందని విమర్శించింది. కేంద్రంలోని మోడీ సర్కారు చర్యలతో సిబిఐ వ్యవస్థ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపింది. ఈ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తోందని, భారత ప్రజాస్వామ్యవ్యవస్థకు మూల స్థంభాలయిన సిబిఐ, రిజర్వ్ బ్యాంక్, న్యాయ వ్యవ స్థ, సమాచార కమిషన్ తదితర వ్యవస్థలున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్రలోని ఎన్డీ యే ప్రభుత్వం చేపడు తున్న ఈ అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారని సిపిఎం పొలిట్‌బ్యూరో తన ప్రకటనలో హెచ్చరించింది.

స్వదేశీ విమానాల తయారీ సంస్థ ' హాల్ ' మూసివేతకు కుట్ర

మోడీ 'రాఫెల్ డీల్ 'లో సాంకేతికత బదిలీ అంశం లేదు

హిందుస్తాన్ ఏరోనాటిక్స్ ఉద్యోగుల సంఘం

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ విమానాల తయారీ సంస్థ హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) మూసివేతకు ఎన్‌డీఏ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆ సంస్థ ఉద్యోగ సంఘం ఆరోపించింది. 36 రాఫెల్ యుద్ధ విమానాలను నేరుగా ఫ్రాన్స్‌లోని దసో ఏవియేషన్ నుంచి దిగుమతి చేసుకునేందుకు ఒప్పందం చేసుకోగా, మిగతా 90 యుద్ధ విమానాల తయారీకి సాంకేతికత బదిలీ కింద హెచ్ఏఎల్‌కు అనుమతి ఇవ్వాలని ఉద్యోగ సంఘం డిమాండ్ చేసింది. మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మార్పులు చేసిన ఒప్పందంలో సాంకేతికత బదిలీకి సంబంధించిన క్లాజ్ లేకపోవడాన్ని హాల్ ఉద్యోగ సంఘం గుర్తు చేసింది. 78 ఏండ్ల అనుభవమున్న హాల్‌ను ఇది నిరాశపరిచిందని ఉద్యోగసంఘం ఆవేదన వ్యక్తం చేసింది. యుద్ధ విమానాల తయారీలో దసో ఏవియేషన్‌తో హాల్‌ను భాగస్వామిని చేయాలని వారు కోరారు. హాల్‌కు చెందిన బెంగళూరు ప్లాంట్‌లో 10,000మంది ఉద్యోగులు పని చేస్తున్నారని వారు తెలిపారు. ఇప్పటికీ ఒక్క రాఫెల్ విమానాన్ని కూడా దిగుమతి చేసుకోకపోయినా దసో ఏవియేషన్‌కు కేంద్రం రూ.20 వేలకోట్లు అడ్వాన్స్ కింద ఇచ్చిందని వారు విమర్శించారు. హాల్‌కు విమానాల తయారీ సామర్థ్యం లేదంటూ రక్షణమంత్రి నిర్మలాసీతారామన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారు ఆరోపించారు. తమతో భేటీ సందర్భంగా ప్రధాని మోడీ హాల్‌కు రూ.5000 కోట్లపెట్టుబడులు వచ్చేలా చూస్తానన్నారు. కానీ, తమకున్న రిజర్వ్ నిధులను పక్కదారి పట్టించారని ఉద్యోగ సంఘం నేతలు విమర్శించారు. ఉద్యోగుల జీతభత్యాల కోసం బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోవాల్సి వస్తున్నదని వారు తెలిపారు. తమ సంస్థకు రూ.లక్షా 28 వేల కోట్ల ఆర్డర్లు రాగా, అందులో యూపీఏ హయాంలో వచ్చినవే అధికమని హెచ్ఏఎల్ ఉద్యోగ సంఘం స్పష్టం చేసింది. మోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ హయాంలో వచ్చింది కేవలం రూ.26,570 కోట్లు మాత్రమేనని వారు తెలిపారు. లోక్‌సభలో నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనలో వాస్తవం లేదని హెచ్ఏఎల్ ఉద్యోగ సంఘం తెలిపింది.

బూటకమే కానీ.. ప్రభుత్వ ప్రమేయం లేదు

గుజరాత్ ఎన్‌కౌంటర్లపై బేడీ కమిటీ నివేదిక

న్యూఢిల్లీ : గుజరాత్‌లో బూటకపు ఎన్‌కౌంటర్లు జరిగిన మాట వాస్తవమేనని తేల్చిన బేడీ కమిటీ.. ఇందులో రాష్ట్ర సర్కారు, ప్రభుత్వ ఉన్నతాధికారుల ప్రమేమున్నట్టు ఎలాంటి ఆధారాలూ లేవని స్పష్టం చేసింది. ఈ ఎన్‌కౌంటర్ల వెనుక మతపరమైన కుట్రలు కూడా ఏమీ లేవని వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్రంలో 2002 నుంచి 2006 వరకు(నరేంద్ర మోడీ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో..) జరిగిన 17 ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టుకు బేడీ కమిటీ రిపోర్టును సమర్పించింది. 17 మంది ఎన్‌కౌంటర్‌పై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేశామని, వీటిలో మూడు ఘటనలే బూటకమని తేలాయని కమిటీ తన రిపోర్టులో పేర్కొన్నది.

అసోం కమిటీలో కొనసాగలేం

అయిదుగురు మేధావుల స్పష్టీకరణ



ధరఖాస్తుల దాఖలుకోసం క్యూలో వేచివున్న ప్రజలు

న్యూఢిల్లీ: జాతీయపౌరసత్వ బిల్లుపై అస్సామీయులలో తలెత్తుతున్న సందేహాలను, ఆ రాష్ట్రంలో జరుగుతున్న ఆందోళనలను పరిష్కరించేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన ఉన్నతాధికార కమిటీలో సభ్యులుగా నియమించిన తొమ్మిది మందిలో ఐదుగురు కమిటీలో కొనసాగేందుకు నిరాకరించారు. 2016 నాటి వివాదాస్పద పౌరసత్వ చట్ట (సవరణ) బిల్లుపై పార్లమెంట్ ఆమోద ముద్ర పొందాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ఈశాన్య రాష్ట్రాలలో మెజార్టీ ప్రజలు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. అసోం ఒప్పందంలోని క్లాజ్ 6 ప్రకారం అసోం ప్రజలకు వారి సంస్కృతి, సామాజిక, భాషాపరమైన గుర్తింపును కాపాడుకునేందుకు రాజ్యాంగపరమైన, శాసనపరమైన, పాలనా పరమైన భద్రత కల్పించాల్సి వుంది. ప్రతిపాదిత పౌరసత్వ చట్ట సవరణ బిల్లు ఈ హక్కులను కాలరాస్తుందన్న భయాందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈశాన్య రాష్ట్రాల ప్రజలందరూ దీనిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ప్రజల్లో నెలకొన్న ఈ భయాందోళనలు తొలగించింది చట్టాన్ని అమలు చేసేందుకు అవసరమైన మార్గాలను సూచించాలని కోరుతూ కేంద్ర హోంశాఖ ఈ కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీ తన అధ్యయన నివేదికను ఆర్నెల్లలోగా కేంద్రానికి సమర్పించాల్సి వుంటుంది. అసోం ఒప్పందం ప్రకారం మన దేశ పౌరసత్వ హక్కును పొందేందుకు వలస వాసులకు 1971 మార్చి 24న కటాఫ్ తేదీగా నిర్ణయించారు. కేవలం అసోంకు మాత్రమే వర్తించే ఈ కటాఫ్ తేదీని 1955 నాటి పౌరసత్వ చట్టంలోని క్లాజ్ 6ఎ గా ప్రవేశపెట్టారు. అయితే ప్రతిపాదిత సవరణ బిల్లు ప్రకారం ఇతరులతో పాటు హిందు బంగ్లాదేశీయులకు భారత పౌరసత్వాన్ని పొందేందుకు కొత్త కటాఫ్ తేదీ 2014 డిసెంబర్ 31గానిర్ణయించారు. ఈ సవరణ బిల్లుతో రాష్ట్రంలోని దాదాపు ఎనిమిది లక్షలమంది ప్రజలు ప్రయోజనం పొందుతారని బిజెపి రాష్ట్ర నేతలు చెబుతున్నారు. అయితే బంగ్లాదేశ్, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ నుండి భారత్‌కు వలస వచ్చిన ఆరు వర్గాల వారికి మత ప్రాతిపదికపై పౌరసత్వాన్ని కల్పించేందుకు ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించిందని ఇటీవల సిల్చార్ పట్టణంలో జరిగిన ర్యాలీలో ప్రసంగించిన ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించటంతో అసోంలో భారీయెత్తున నిరసనలు వెల్లువెత్తాయి. మతం పేరుతో బంగ్లాదేశ్ నుండి అక్రమంగా వలస వచ్చిన వారికి పౌరసత్వాన్ని కల్పించాలన్న కేంద్ర నిర్ణయాన్ని అసోంలోని మెజార్టీ వర్గ ప్రజలు వ్యతిరేకించారు. దీనితో ఈ నిర్ణయంపై వ్యక్తమవుతున్న భయాందోళనలను తొలగించి సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం పొందేందుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలంటూ కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఈ నెల 7వ తేదీన రిటైర్డ్ ఉన్నతాదికారి ఎంపి బెజ్‌బారువా నేతృత్వంలోని ఉన్నతాధికార కమిటీని నియమించింది. ఇందులో గౌహతికి చెందిన జర్నలిస్టు ధీరేన్ బెజ్‌బారువా, రచయితలు నాగేన్‌శర్మ, రంగ్‌బాంగ్ తెరాంగ్, విద్యావేత్త ముకుంద రాజవంశి, రిటైర్డ్ అధికారులు సుభాష్ దాస్, అసోం అడ్వకేట్ జనరల్ రమేష్ బోర్‌పాత్రో పాటు అఖిల అస్సాం విద్యార్థి సంఘం (ఆసు)నుండి ఒక ప్రతినిధిని సభ్యులుగా నియమించారు.

ఇందులో కేంద్ర ప్రభుత్వం తరపున హోం శాఖలోని ఈశాన్య రాష్ట్రాల వ్యవహారాల కార్యదర్శి సత్యేంద్ర గార్గ్ ప్రాతినిధ్యం వహిస్తారు. కాగా తాము తొలుత ఈ నియామకాలను అంగీకరించినప్పటికీ, కేంద్రంలో తదుపరి ప్రభుత్వం కమిటీ సిఫార్సులను ఆమోదించే అవకాశం లేదన్న విషయం తమకు తెలిసిందని, అందువల్ల ఈ నియామకాలను తిరస్కరిస్తున్నామని ఇందులో సభ్యులుగా నియమితులైన రచయితలు నాగేన్ సైకియా, రంగ్‌బోంగ్ తెరాంగ్ విద్యావేత్త ముకుంద్ రాజవంశి తదితరులు ప్రకటించారు. ఈ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆసు ప్రతినిధి కూడా ఈ కమిటీని బహిష్కరించారు.

మానవ సహిత అంతరిక్ష నౌక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్న ఇస్రో

బెంగళూరు : మానవుని అంతరిక్షంలోకి ప్రవేశపెట్టేందుకు వీలుండే స్వదేశీ మిషన్‌ను రూపొందించే దిశగా భారత్ తొలి అడుగు వేసింది. ఈ మేరకు మానవ సహిత అంతరిక్ష నౌక కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేయనున్నట్లు భారత అంతరిక్ష కేంద్రం (ఇస్రో) ప్రకటించింది. ఉన్ని కృష్ణన్ నాయర్ దీనికి నేతృత్వం వహించ నున్నారని ఇస్రో ఛైర్మన్ కె.శివన్ శుక్రవారం తెలిపారు. ఆర్.హట్టన్ నేతృత్వం వహిస్తున్న గగన్‌యాన్ ప్రాజెక్టు ద్వారా 2021 డిసెంబర్ ముందు నాటికి ముగ్గురు వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపనున్నట్లు తెలిపారు. ఈ బృందంలో మహిళ కూడా ఉన్నట్లు తెలిపారు. 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న భూకక్ష్యలోకి ఈ ముగ్గురిని.. మూడు నుండి ఏడు రోజుల పాటు పంపనున్నట్లు వెల్లడించారు. రూ. పదివేల కోట్ల విలువచేసే ఈ ప్రాజెక్టులో రెండు సార్లు ముందస్తు మానవ రహిత పరీక్షలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. పిఎస్ఎల్‌వి ప్రయోగ వాహనాలను తయారుచేయడానికి హిందూస్తాన్ ఏరోనాటికల్స్ లిమిటెడ్స్ (హెచ్ఎఎల్), ఎల్ అండ్ టీతో ఒప్పందం కుదుర్చుకోనుంది. ఈ ఏడాది ఏప్రిల్ చివరి నాటికి చంద్రుని పైకి 'చంద్ర యాన్-2' పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని శివన్ వెల్లడించారు.

మేజర్, జవాన్ మృతి

జమ్మూ కాశ్మీర్ : రాజౌరి జిల్లాలోని నౌషేరా సెక్టార్‌లోని దేశ సరిహద్దు రేఖ వద్ద జరిగిన పేలుళ్ల ఘటనలో శుక్రవారం సాయంత్రం ఒక ఆర్మీ అధికారి, జవాన్ మృతిచెందారు. మృతిచెందిన వారిలో మేజర్ ఎస్‌జి నాయర్ ఉన్నారు. 4.30 గంటల సమయంలో ఒక పేలుడు, 6 గంటల సమయంలో మరో పేలుడు జరిగింది. ఉగ్రవాదులు ఈ పేలుడు పరికరాలను అమర్చినట్లు ఆర్మీ అధికారులు అనుమానిస్తున్నారు.

కార్మిక సంఘాలపై జైట్లీ అక్కసు

- వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకే అనుచిత వ్యాఖ్యలు
- సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
వామపక్ష కార్మిక సంఘాలపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మరోసారి అక్కసు వెల్లగక్కారని, డిమాండ్లు పరిష్కరించ కుండా అనుచిత వ్యాఖ్యలకు దిగడం తగదని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ కుమార్ సేన్ వ్యాఖ్యానించారు. శుక్రవారం నాడిక్కడ ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని జనవరి 8,9 తేదీల్లో అన్ని కార్మిక సంఘాలతో కలిసి తాము చేపట్టిన భారత్ బంద్‌పై జైట్లీ వ్యతిరేక వ్యాఖ్యలు చేయడం సముచితం కాదని, బిజెపి అను బంధ సంఘం మినహా అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు, ఇతర కార్మిక సంఘాలకు చెందిన కార్మికులదరూ భారత్ బంద్‌లో స్వచ్ఛంధంగా పాల్గొన్నారని తెలిపారు. సమ్మెకు పిలుపునిచ్చిన సంఘాల్లో బిజెపి అనుబంధ కార్మిక సంఘం బిఎంఎస్ కూడా ఉందని, అయితే తరువాత బిజెపి ఆదేశాలతో వెనక్కి తగ్గిందని తపన్‌సేన్ వెల్లడించారు. కార్మిక సమస్యల పరిష్కారంపై దృష్టి సారించని మోడీ సర్కార్ ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ సర్కార్ హయాంలో ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, రైతులు చితికి పోయారని గుర్తు చేశారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే ప్రభుత్వం ఇలాంటి చౌకబారు ప్రచారానికి పూనుకుందని దుయ్యబట్టారు. పది కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా ఇచ్చిన సమ్మె పిలుపులో భాగంగా అన్నివర్గాల ప్రజానీకం పెద్ద ఎత్తున బంద్ పాటించారని వివరించారు. అన్నదాతలు సైతం మోడీ హఠావో... దేశ్ బచావో, కార్మిక విరోధి... నరేంద్ర మోడీ, కార్మికుల ఐక్యత వర్థిల్లాలి అన్న నినాదాలతో సమ్మెలో పాల్గొన్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలు కూడా బంద్‌లో పాల్గొన్నారని వెల్లడించారు. ఈ సమ్మె కార్మిక ఆందోళనగా మాత్రమే కాకుండా..జన ఆందోళన్‌గా సాగిందని తెలిపారు. అయితే, పెట్టుబడిదారీ వర్గాల కోసం అనుక్షణం పని చేస్తున్న మోడీ సర్కారు తాము విజయవంతంగా చేపట్టిన బంద్‌ను జీర్ణించుకోలేకపోతుందన్నారు. అందుకే తమపై ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్నామని, దేశంలో అశాంతి సృష్టించేందుకు కాదని వెల్లడించారు. తాము బంద్‌కు పిలుపునివ్వడం ఇదేం కొత్త కాదని గతంలో కూడా మూడు సార్లు దేశవ్యాప్తంగా బంద్ పాటించినా, ప్రభుత్వం స్పందించకుండా మొద్దు నిద్ర పోతుందని విమర్శించారు. మోడీ సర్కారు దిగి వచ్చేవరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

మమత ర్యాలీకి వెళ్లం

అలోక్ వర్మను తప్పించడం వ్యవస్థపైనే దాడి : నారాయణ



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
కోల్‌కటాలో టిఎంసి అధినేత్రి మమత బెనర్జీ నిర్వహించే ర్యాలీకి తాము హాజరుకామని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తెలిపారు. బిజెపికి వ్యతిరేకం అంటూనే, బిజెపిని వ్యతిరేకిస్తున్న లెఫ్ట్ పార్టీలపై టిఎంసి గూండాలు దాడులకు దిగుతున్నారని విమర్శించారు. జాతీయస్థాయిలో బిజెపికి వ్యతిరేకంగా కలిసివస్తే ఆహ్వానిస్తామని అన్నారు. ఆస్థానా లాంటి అవినీతిపరుడు అలోక్ వర్మపై ఫిర్యాదు చేస్తే, దాని ఆధారంగా చర్యలు తీసుకోవడంపై ప్రధాని ఆలోచించాల్సిందేనని, ఇలాంటి పరిస్థితులు సిబిఐ చరిత్రలోనే ఇదే ప్రథమమని అన్నారు. కేంద్రం తమకు అనుకూలంగా ఉండే అధికారులను చెప్పుచేతల్లో పెట్టుకొని ప్రత్యర్థులపై దాడి చేస్తోందని, రాఫెల్ కుంభకోణం బయటపడుతుందనే భయంతోనే అలోక్ వర్మను తప్పించారని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని, వ్యవస్థలపై ప్రజలు నమ్మకం కోల్పోతే దేశాన్ని కాపాడటం కష్టమని, ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని. శుక్రవారం నాడిక్కడ స్థానిక ఏపి భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో నారాయణ పేర్కొన్నారు.. మోడీ ప్రభుత్వానికి అసహనం పెరిగిపోయిందని, న్యాయ వ్యవస్థపై, ప్రజాస్వామ్యంపై మోడీకి గౌరవం లేదని విమర్శించారు. అస్సాంలో నిరసన జ్వాలలు చెలరేగాయని, అందుకు బిజెపియే కారణమని దుయ్యబట్టారు. దేశంలో మతోన్మాద శక్తులను పెంచిపోషిస్తోందని, మతపరంగా దేశాన్ని విభజించాలన్న లక్ష్యంతో బిజెపి కుటిల రాజకీయాలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. సిటిజన్ షిప్ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అగ్రవర్ణాల్లోని పేదలకు రిజర్వేషన్లను స్వాగతిస్తున్నామని, కానీ తీసుకొచ్చిన విధానం సరిగా లేదని అన్నారు.

ప్రొఫెసర్ అతుల్ జోహ్రిని శిక్షించండి


జనవాదీ మహిళా సమితి

న్యూఢిల్లీ : జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ ప్రొఫెసర్ అతుల్ జోహ్రిని అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసిసి) నిర్దోషిగా పేర్కొన్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో జనవాదీ మహిళా సమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ రకంగా చేయడం ద్వారా ఫిర్యాదు చేసిన 8మంది మహిళలకు న్యాయం నిరాకరించినట్లైందని పేర్కొంది. పైగా లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013లోని నిబంధనల అమలు చేయడంలో విఫలమైనట్లు తెలుస్తోందని పేర్కొంది. పైగా, ఫిర్యాదు చేసిన మహిళలకు పలు సార్లు ఐసిసి హెచ్చరికలు జారీ చేయడం చూస్తుంటే ఇక పై ఇలా ఎవరూ ఫిర్యాదులివ్వడానికి సాహసించకుండా వుండేలా చేయడానికేనని మహిళా సమితి పేర్కొంది. ఇది, లింగ వివక్ష వ్యతిరేక నిబంధనా వళికి పూర్తి విరుద్ధమని ఆందోళన వ్యక్తం చేసింది. ఐసిసికి ఫిర్యాదు చేయడం లేదా పోలీసులను ఆశ్రయించడం అనేది పూర్తిగా ఫిర్యాదీదారుని విచక్షణకు సంబంధించిన అంశమని హైకోర్టు చాలా స్పష్టంగా చెప్పింది. ఈ కేసులో ఫిర్యాదీదారులకు ఐసిసి పట్ల విశ్వాసం లేనందున పోలీసులను ఆశ్రయించారు.

ప్రత్యేకం

లోపభూయిష్టమైన నిర్ణయం

వర్మ తొలగింపుపై నిపుణుల విశ్లేషణ



న్యూఢిల్లీ: సిబిఐ డైరెక్టర్ పదవి నుండి అలోక్ వర్మను తొలగిస్తూ ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని ఉన్నతాధికార కమిటీ తీసుకున్న నిర్ణయం నైతికంగానూ, విధాన పరంగానూ లోపభూయిష్టమైనదని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రక్రియలో తన వాదనను వినిపించేందుకు అలోక్ వర్మకు అవకాశం ఇవ్వకుండా కమిటీ సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘించటం ఒక్కటే ఇందులో సమస్య కాదు. ఈ కేసులో నిందితుడిగా వున్న ప్రధాని ఈ కమిటీ భేటీకి అధ్యక్షత వహించటం చట్టపరమైన, నైతికపరమైన అంశాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తోంది. ఈ విషయంలో మోడీ తనకు తానుగా ఎందుకు బయటపడలేకపోయారన్న ప్రశ్న వినిపిస్తోంది. ప్రధాని కార్యాలయ వ్యవహార శైలి ప్రశ్నార్థకంగా మారిన కేసుల్లో ఆయన ఏ విధంగా తీర్పునిస్తారు? ప్రధాని, ఆయన కార్యాలయం నిందితులుగా వున్న కేసుల్లో సిబిఐ దర్యాప్తును పర్యవేక్షించాల్సిన స్వతంత్ర లోక్‌పాల్ వ్యవస్థ లేకపోవటం వల్లే ఇటువంటి విపరిణామాలు చోటు చేసుకుంటున్నాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇక్కడ కేవలం అలోక్ వర్మ మాత్రమే కాదు, ఇంకా ఎంకె సిన్హా ఎకె శర్మ వంటి ఇతర ప్రముఖ సీనియర్ అధికారులు కూడా ప్రధాని కార్యాలయ వైఖరిని తప్పుపడుతున్నారు. అత్యంత నిజాయితీపరుడు, సమర్ధుడు అయిన సిన్హా సిబిఐని 'సెంటర్ ఫర్ బోగస్ ఇన్విస్టిగేషన్, అని, ఇడిని 'ఎక్టార్షన్ డైరెక్టరేట్' అని అలోక్ వర్మ వివాదంపై సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్నారంటే అక్కడి పరిస్థితులు ఎంత దిగజారి పోయాయో అర్థం చేసుకోవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ఇదంతా మీడియా చెబుతున్నట్లు 'సిబిఐ వర్సెస్ సిబిఐ' వివాదం కాదని వారు స్పష్టం చేస్తున్నారు. సిబిఐ, ఇడి కార్యకలాపాలలో ప్రధాని కార్యాలయ నిరంతరజోక్యాన్ని ఈ వివాదం తెరపైకి తెస్తోందని వారు గుర్తు చేస్తున్నారు. అయితే ఇడి, పిఎంఒ అధికారుల మధ్య కొనసాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం అందరికీ తెలియటం లేదు. గత ఏడాది రిటైరయిన ఇడి అధినేత కర్నాల్ సింగ్ ప్రధాని కార్యాలయ ఆదేశాలను బాహాటంగానే వ్యతిరేకించారు. వ్యాపారవేత్తలు, రాజకీయ నేతలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులను దర్యాప్తు చేసిన ఇడి అధికారి రాజేశ్వర్ సింగ్ ఆయనను గట్టిగా సమర్ధించటం విశేషం. ఈ అధికారిపై అవినీతి ఆరోపణలతో ప్రధాని కార్యాలయం ఫిర్యాదును సిద్ధం చేసినప్పటికీ ఇడి అధినేత ఆయనను గట్టిగా సమర్ధించారు. రాజేశ్వర్‌పై పిఎంఒ చేస్తున్న అవినీతి ఆరోపణలు నిజమో కాదో ఎవరికీ తెలియదు. ఒక దశలో ప్రధాని కార్యాలయానికి అత్యంత సమర్ధులుగా కనిపించిన ఈ ఇరువురు అధికారులంటే ఇప్పుడు పిఎంఒకు ఎందుకు గిట్టడం లేదనేది అందరినీ వేధిస్తున్న ప్రశ్న. సిబిఐ వ్యవహారం కూడా ఇదే తంతుగా నడుస్తోంది. అలోక్‌వర్మను సిబిఐ డైరెక్టర్‌గా ప్రధాని కార్యాలయమే నియమించింది. ముఖ్యంగా అజిత్ దోవల్ ఇందులో కీలక పాత్ర పోషించారని తెలుస్తోంది. తమ మాట వినని అలోక్ వర్మపై పిఎంఒ ఇప్పుడు ఆకస్మికంగా కత్తికట్టింది. అంతేకాదు సిబిఐకి ఏరికోరి తెచ్చిన గుజరాత్ కేడర్ అధికారి ఎకె శర్మను కూడా ఇప్పుడు పిఎంఒ పక్కన పెట్టేసింది. ఆయన అలోక్‌వర్మతో కలిసి పనిచేయటమే ఇందుకు కారణం. యశ్వంత్ సిన్హా ప్రశాంత్‌భూషణ్, అరుణ్‌శౌరీ రాఫెల్ ఒప్పందంపై చేసిన ఫిర్యాదు విషయంలో స్వతంత్ర ఆలోచనా ధోరణిని అవలంభిస్తున్నప్పటి నుండి అలోక్ వర్మ పిఎంకు విరోధిగా మారిపోయారు. దీనితో పాటు ప్రధాని వద్ద ప్రత్యేకాధికారిగా వున్న భాస్కర్ కుల్బే బొగ్గు కుంభకోణంలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణల కేసు కూడా వర్మ దర్యాప్తు పరిధిలో వుండటం ఈ వైరానికి మరో కారణం. ఈ అంశాలన్నీ ఉన్నత స్థాయి రాజకీయ వ్యవస్థలో కొనసాగుతున్న అవినీతి చర్యలకు పరాకాష్టగా నిలుస్తున్నాయి. అందువల్లే అలోక్ వర్మ దీనిని ఎన్నడూ 'సిబిఐ వర్సెస్ సిబిఐ'గా చూడలేదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రాజకీయ అవినీతి, మనీలాండరింగ్ ఆరోపణలతో రూపుదిద్దుకుంటున్న కేసుల్లో ప్రధాని కార్యాలయ ప్రత్యక్ష జోక్యం తిరుగులేనిది. ఇదే ఇప్పుడు సిబిఐ, ఇడిలలో చోటు చేసుకుంటున్న ప్రకంపనలకు మూలకారణమవుతోంది. నరేంద్రమోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా, అమిత్‌షా హోం మంత్రిగా వున్న సమయంలోనే ఇది బయటపడింది. అయితే 'గుజరాత్ మోడల్' న్యూఢిల్లీలో పనిచేయటం లేదన్నది నిర్వివాదాంశం. కేంద్రం స్థాయిలో అనేక వ్యవస్థీకృత తనిఖీలు, సమతుల్యతలు వుండటంతో మోడీ,షాల రాయ'బేరాల'కు వీలుపడటం లేదు. కేంద్ర దర్యాప్తు సంస్థలో ఇప్పుడు కొనసాగుతున్న వ్యవస్థాగత సంక్షోభానికి అత్యున్నత స్థాయి రాజకీయ నాయకత్వమే మూలకారణమనటంలో ఎటువంటి సందేహానికి తావులేదు. సిబిఐ డైరెక్టర్ పదవి నుండి అలోక్ వర్మను తప్పించేందుకు ఏర్పాటయిన ఉన్నతాధికార కమిటీ భేటీకి ప్రధాని అధ్యక్షత వహించటమే ఇందుకు నిదర్శనం. సహజన్యాయానికి ఇక్కడ చోటు దక్కలేదన్నది నిర్వివాదాంశం.



సరిహద్దు గోడ కోసం నిధుల మళ్లింపు

• ట్రంప్ యోచన • షట్‌డౌన్‌లో రికార్డు

వాషింగ్టన్: సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి అమెరికన్ కాంగ్రెస్ తిరస్కరించిన దరిమిలా ఇతర దేశాలకు అందించే సహాయ నిధులను ఈ గోడ నిర్మాణానికి మళ్లించాలని అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ యోచిస్తున్నారు. మరో వైపు షట్‌డౌన్ 21వ రోజుకు చేరుతుంది. అమెరికాలో అత్యంత సుధీర్ఘకాలం కొనసాగిన షట్‌డౌన్‌గా ఇది రికార్డుకెక్కింది. సరిహద్దు గోడ కోసం ఎమర్జెన్సీని విధించేందుకు కూడా తాను వెనుకోడబోనని ట్రంప్ చెప్పారు. గురువారం టెక్సాస్ రాష్ట్రంలోని దక్షిణ సరిహద్దు ప్రాంతాన్ని సందర్శించినపుడు ఆయన్ను మీడియా ప్రతినిధులు ఈ అంశంపై ప్రశ్నించినప్పుడు ఆయన ఈ విషయం వెల్లడించారు. ఈ అంశాన్ని తాను విస్తృత స్థాయిలో పరిశీలిస్తున్నానని, సాధ్యమైనంత త్వరలో దీనిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏటా పెరిగిపోయే ఈ సరిహద్దు గోడ నిర్మాణ వ్యయాన్ని కట్టడి చేసేందుకు సత్వర స్పందన అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. అంతకు ముందు బుధవారం వాషింగ్టన్‌లో మీడియాతో మాట్లాడిన ట్రంప్ జాతీయ ఎమర్జెన్సీ విధించటం అన్నది చివరి ఎంపిక అని, సరిహద్దు గోడ నిర్మాణం కోసం తాను కోరుతున్న 570 కోట్ల డాలర్ల కేటాయింపును డెమొక్రాట్స్ అనుమతించకుంటే ఎమర్జెన్సీ విధించక తప్పదని బెదిరించారు. ఆర్థిక ప్రతిష్టంభనపై బుధవారం జరిగిన భేటీ నుండి స్పీకర్ నాన్సీ పెలోసీ, సెనేట్ మైనార్టీ పక్షనేత చుక్ స్కమర్‌తో కలిసి ట్రంప్ వాకౌట్ చేసిన తరువాత నేషనల్ ఎమర్జెన్సీ విధింపుపై ఊహాగానాలు జోరందుకున్నాయి. సరిహద్దు గోడ నిర్మాణం అంశాన్ని తరువాత చర్చిద్దాం, ముందు ఇదంతా 'టైమ్ వేస్ట్' కార్యక్రమమని అన్నారు. ట్రంప్ వైఖరికి ఎలా ప్రతిస్పందించాలో తమకు బాగా తెలుసని డెమొక్రాట్స్ చెబుతున్నారు.

నిరసనల భయంతో దావోస్ పర్యటన రద్దు చేసుకున్న ట్రంప్

ఆర్థిక ప్రతిష్టంభన నేపథ్యంలో నిరసనలు ఎదుర్కొనాల్సి వస్తుందనే భయంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం దావోస్ పర్యటన రద్దు చేసుకున్నారు. కాగా, ఈ నెల 21 నుండి 25వరకు దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) సమావేశాలు జరగనున్నాయి.



సిరియా నుండి వైదొలగుతున్న అమెరికా బలగాలు

బీరుట్ : సిరియా నుండి అమెరికా సైనిక బలగాలు వైదొలగడం ఆరంభమైందని అమెరికా నేతృత్వంలోని సైనిక సంకీర్ణ కూటమి ప్రతినిధి కల్నల్ సియాన్ రియాన్ తెలిపారు. అయితే ఎప్పుడు, ఎక్కడ అనే వివరాలేవీ ఆయన వెల్లడించలేదు. భద్రతాపరమైన అంశాలను దృష్టిలో వుంచుకుని కచ్చితమైన సమయం లేదా ప్రాంతం, సైనిక బలగాల కదలికలు ఇవేవీ వెల్లడించడం లేదని ఆయన చెప్పారు. ఈశాన్య రాష్ట్రమైన హసకెలో మెలన్ వైమానిక స్థావరంలో బలగాలను తగ్గించడం ఆరంభించినట్లు సిరియా మానవ హక్కుల సంస్థ తెలిపింది. సిరియా నుండి పూర్తి స్థాయిలో బలగాలను ఉపసంహరిస్తామని గత నెల 19న ట్రంప్ ప్రకటించిన తర్వాత బలగాలు వైదొలగడం ఇదే మొదలని ఆయన తెలిపారు. సిరియాలో దాదాపు 2వేలమంది అమెరికా సైనికులు మోహరించి వున్నారు.

2018లో మరణించిన లేదా గల్లంతైన శరణార్థులు 4,592మంది

బ్రసీలియా : గతేడాది కాలంలో మరణించిన లేదా అదృశ్యమైన శరణార్థుల సంఖ్య తగ్గిందని అంతర్జాతీయ వలసల సంస్థ (ఓఐఎం) తెలిపింది. ఆ సంస్థ ప్రచురించిన సమాచారం ప్రకారం, 2018లో ప్రపంచవ్యాప్తంగా 4,592మంది శరణార్థులు మరణించడమో లేదా గల్లంతవడమో జరిగింది. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో నడిచే ఈ సంస్థ ఈ వివరాలను మంగళవారం ప్రచురించింది. ఈ సంఖ్య 3వేలను దాటడం ఇది ఐదవసారి. 2017లో ఈ సంఖ్య 6వేలను దాటింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే గతేడాది ఈ సంఖ్య గణనీయంగా తగ్గిందని ఆ నివేదిక తెలిపింది. వలసలు వెళ్లడానికి ప్రయత్నించడం తగ్గడమే ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది. మధ్యధరా సముద్రాన్ని దాటుతూ మరణించిన వారి సంఖ్య 2,297గా వుంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా నమోదైన సంఖ్యలో సగంగా వుంది. యూరప్ దేశాలకు వెళ్లాలనుకుని భూ మార్గాల్లో ప్రయాణిస్తూ మృతి చెందినవారు 110మంది వున్నారని నివేదిక తెలిపింది. ఉత్తరాఫ్రికాలో ఈ మరణాల సంఖ్య 564గా వుంది.



అమెరికా జోక్యాన్ని సహించం

- లాటిన్ అమెరికా ఐక్యత పటిష్టతకు కృషి
- వెనిజులా అధ్యక్షునిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన అనంతరం మదురో



కారకస్ : ప్రాంతీయ సమగ్రతను, వెనిజులాతో సహా ఈ ప్రాంత ప్రజల ఉమ్మడి ప్రయోజనాలు, లాటిన్ అమెరికా, కరీబియన్ ఐక్యత వంటి అంశాలపై చర్చించేందుకు ఉన్నత స్థాయి ప్రాంతీయ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు రెండవసారి వెనిజులా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నికోలస్ మదురో పేర్కొన్నారు. గురువారం నాడు జరిగిన ఆయన ప్రమాణస్వీకారోత్సవానికి క్యూబా, బొలీవియా, నికరాగ్వా, సాల్వడార్ అధ్యక్షులతో సహా 94 దేశాల ప్రతినిధులు, పలు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం మదురో మాట్లాడుతూ దౌత్యపరమైన దాడులు, మితవాదుల అసహన దాడులు పెరిగిపోతున్న తరుణంలో లాటిన్ అమెరికా ఖండంలో శాంతి, దేశ సమగ్రతల పరిరక్షణకు వెనిజులా ప్రజలు కట్టుబడివున్నారని చెప్పారు. దక్షిణ అమెరికా దేశాల కూటమి (ఉనాసుర్) నుంచి ఆరు దేశాలు వైదొలిగాయి. పరాగ్వే శాశ్వితంగా సంబంధాలు తెంచుకున్నట్లు ప్రకటించింది. మదురో ఎన్నిక అక్రమమని అర్జెంటీనాలో మితవాద ప్రభుత్వం పేర్కొంది. ఈ మితవాద ప్రభుత్వాల పోకడలు లాటిన్ అమెరికా ఉమ్మడి లక్ష్యానికి విఘాతం కలిగిస్తున్నాయన్నారు. గత ఆరు మాసాలుగా ఉనాసుర్ పనిచేయడం లేదన్నారు. ఉనాసుర్‌ను విచ్ఛిన్నం గావించేందుకు చేస్తున్న యత్నాలను అడ్డుకోవాలని ఆయన చెప్పారు. అమెరికా, దాని అండతో మితవాదులు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు పలు దేశాలతో ద్వైపాక్షిక చర్చలు సాగిస్తున్నామని ఆయన చెప్పారు. భౌగోళికంగా, రాజకీయంగా కీలక పాత్ర పోషించే రష్యా, చైనాలతో సంబంధాలను మరింత మెరుగుపరచుకునేందుకు కృషి చేస్తానన్నారు. వెనిజులాలో జోక్యానికి అమెరికా, మితవాద శక్తులు సాగిస్తున్న కుట్రలను తిప్పికొట్టడంలో సైన్యం పాత్రను మదురో ప్రశంసించారు. ఈ శక్తుల నుంచి సైనికులు అనేక దాడులు ఎదుర్కొన్నారని ఆయన అన్నారు. గురువారం రెండో పర్యాయం వెనిజులా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మదురో కారకస్‌లోని టియనా ఫోర్ట్‌లో బొలివారియన్ మిలటరీ యూనివర్శిటీ ఆఫ్ వెనిజులా (యుఎంబివి)లో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తూ ' మీరు నా పట్ల చూపుతున్న విశ్వాసం, క్రమశిక్షణ, వినయవిధేయతలను హృదయపూర్వకంగా స్వీకరిస్తున్నాను.' అన్నారు. అధ్యక్షుడు మదురో సైనిక దళాల సుప్రీం కమాండర్ ఇన్ చీఫ్ హోదాలో ఈ సమావేశంలో పాల్గొన్నారు. సుప్రీం కమాండర్ హ్యూగో ఛావెజ్ వెనిజులాలో సైనిక విప్లవాన్ని తీసుకువచ్చారు. ఆ విప్లవం అంతటితో ఆగిపోరాదని మదురో వ్యాఖ్యానించారు. సైమన్ బొలివర్, హ్యూగో ఛావెజ్‌లు మంచి దార్శనికులని ఆయన కొనియాడారు. విదేశీ జోక్యం లేకుండా దేశాన్ని పాలించుకోగలమని వెనిజులా ప్రజలు మరోసారి ప్రపంచానికి చాటిచెప్పారని మదురో పేర్కొన్నారు.

మదురో ప్రమాణ స్వీకారానికి 94 దేశాల ప్రతినిధులు హాజరు

మదురో ప్రమాణస్వీకారానికి 94దేశాల నుండి, పలు అంతర్జాతీయ సంస్థల నుండి ప్రతినిధులు హాజరయ్యారు. వీరి ఓటింగ్, ఆత్మప్రభోదం ద్వారా విప్లవ క్రమాన్ని పరిరక్షించుకునే చారిత్రక కర్తవ్యానికి ప్రజలు, సామాజిక ఉద్యమాలు తోడ్పాటునందించాయని మొరేల్స్ తెలిపారు. టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ ఫోన్‌లో మదురోతో మాట్లాడారు. తనకు బదులుగా ఉపాధ్యక్షుడు ఓక్తేను పంపించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

బ్రెగ్జిట్ ప్రతిష్టంభన తొలగింపునకు సత్వర ఎన్నికలు

ప్రతిపక్ష లేబర్ పార్టీ నేత కార్బిన్ డిమాండ్

వేక్‌ఫీల్డ్: ఐరోపా కూటమి నుండి నిష్క్రమించే అంశం (బ్రెగ్జిట్)పై ప్రస్తుతం పార్లమెంట్‌లో కొనసాగుతున్న ప్రతిష్టంభనను తొలగించేందుకు వెంటనే పార్లమెంట్ ఎన్నికలు జరపాలని ప్రధాన ప్రతిపక్షం లేబర్‌పార్టీ నేత జెరిమీ కార్బిన్ డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే ఇయుతో కుదుర్చుకున్న బ్రెగ్జిట్ ఒప్పందంపై మరోసారి చర్చలు జరుపుతామని అన్నారు. బ్రెగ్జిట్‌కు సంబంధించిన అత్యంత ప్రధానమైన చట్టానికి ఆమోదముద్ర పొందలేకపోతే, వీలయినంత త్వరగా పార్లమెంట్‌కు సార్వత్రిక ఎన్నికలు నిర్వహించటం అత్యుత్తమం' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ప్రతిష్టంభనకు తెరదించేందుకు ఎన్నికలు కేవలం ఆచరణయోగ్యమైన అవకాశం మాత్రమే కాదని, ప్రజాస్వామ్య యుతమైన అవకాశం కూడా అని ఆయన అన్నారు. బ్రిటన్ ప్రజలు తమకు అధికారాన్ని కట్టబెడితే బ్రెగ్జిట్‌పై మెరుగైన ఒప్పందం కోసం తాము ఐరోపా కూటమితో మరోసారి చర్చలు జరుపుతామని, దానికి పార్లమెంట్‌లోనూ, దేశ ప్రజలలోను మద్దతు సాధిస్తామని చెప్పారు.

చాంగ్-4 మిషన్ విజయవంతం : చైనా

బీజింగ్ : చంద్రుని ఆవల వైపు దిగి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసిన 'చాంగ్-4 మిషన్' పూర్తి విజయవంతమైందని చైనా శుక్రవారం ప్రకటించింది. రిలే శాటిలైట్ క్యెకియో సాయంతో రోవర్ యూటూ-2, చాంగ్-4 ప్రోబ్ ల్యాండర్‌లు పరస్పరం ఫోటోలను తీసుకున్నాయని జిన్హువా వార్తా సంస్థ తెలిపింది. ప్రోబ్‌లోని సైంటిఫిక్ పరికరాలన్నీ బాగానే పనిచేస్తున్నాయని, ప్రోబ్ తీసుకున్న ఫోటోలు, డేటా అంతా గ్రౌండ్ కంట్రోల్‌కి పంపించినట్లు చైనా జాతీయ రోదసీ సంస్థ (సిఎన్‌ఎస్‌ఎ) తెలిపింది. శుక్రవారం 4.47గంటలకు ల్యాండర్, రోవర్ ఫోటోలు బీజింగ్ ఏరోస్పేస్ కంట్రోల్ సెంటర్‌లో పెద్ద స్క్రీన్‌పై కనిపించాయి. చంద్రుడు రెండో వైపు పెద్ద పగుళ్ళతో కనిపిస్తుండగా, ఇరువైపులా చైనా జాతీయ పతాకం ఎగురుతూ కనిపిస్తోంది.

మొదటి పేజీ తరువాయి

18-20 మధ్య జనసేనతో లెఫ్ట్ చర్చలు

షాపుల ద్వారా ఇవ్వడం గర్హనీయమని అన్నారు. బిజెపి ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు కాక రాష్ట్రం దివాళా తీసిందని, టిడిపి అధినేత చంద్రబాబు బిజెపిని బలపరిచి రాష్ట్రాన్ని దెబ్బతీశారని విమర్శించారు. విశాఖ రైల్వే డివిజన్ ఆదాయం అధికంగా ఉన్నా జోన్ ఇచ్చేందుకు కేంద్రం సాకులు చెబుతూ మొండిచెయ్యి చూపిందని చెప్పారు. పార్లమెంట్ సాక్షిగా రాష్ట్రానికి 11 కేంద్ర విద్యాసంస్థల హామీని ఇచ్చి ఉల్లంఘించిందన్నారు. కడప స్టీల్‌ప్లాంట్, అనంతపురానికి సెంట్రల్ యూనివర్సిటీ విషయంలోనూ ఇదే ధోరణి కొనసాగించిందన్నారు. పరిశ్రమల మూత, వ్యవసాయంలో ఉపాధి తగ్గిపోయినా ఈ పరిస్థితులను అధికార పార్టీ చక్కదిద్దడం లేదని, బాధ్యతగా వ్యవహరించాల్సిన ప్రతిపక్షం వైసిపి ఎమ్మెల్యేలను నిలబెట్టుకోలేక, అసెంబ్లీకి వెళ్లకుండా బాధ్యతను నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ నర్సింగరావు, గ్రేటర్ విశాఖ నగర కార్యదర్శి డాక్టర్ బి గంగారావు పాల్గొన్నారు.

ట్రంప్‌కు నిరసనల సెగ

నెల 21 నుంచి దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనాల్సి ఉన్న ట్రంప్ నిరసనలకు భయపడి తన పర్యటనను రద్దు చేసుకున్నారు. ట్రంప్ తన మూర్ఖత్వంతో ఉగ్యోగులను వీధులపాల్జేస్తున్నారని అతిపెద్ద ఉద్యోగ సంఘం ఎఎఫ్‌ఎల్-సిఐవో అధ్యక్షుడు రిచర్డ్ ట్రంకా విమర్శించారు. తాము ఏ తప్పు చేయకున్నా ఉద్యోగాలు పోయాయని రిచర్డ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా వేతనాలు మాకు కావాలి. షట్‌డౌన్‌ను తొలగించాలి. వెంటనే పని కల్పించాలి." అని రాసి వున్న ప్లకార్డులు చేబూని వాషింగ్టన్‌లోని వైట్‌హౌస్ వెలుపల ప్రదర్శన నిర్వహించారు.

పని దొరక్క, పని చేసినా వేతనాలందక ఉద్యోగులు నానా అవస్థలు పడుతున్నారు. ఇది అమెరికన్ సెనేట్‌కు, వైట్ హౌస్‌కు సిగ్గు చేటు అని ఎఎఫ్‌ఎల్-సిఐఓ నేత వ్యాఖ్యానించారు. సామాన్యుల గురించి ట్రంప్ ప్రభుత్వం అసలు పట్టించుకోవడం లేదని 62ఏళ్ళ శాస్త్రవేత్త ఎలైనే సురినావో వ్యాఖ్యానించారు. ఎంత కాలం ఈ అనిశ్చితి కొనసాగుతుందో తెలియడం లేదని, దాంతో అహారం, ఇతర ముఖ్య అవసరాలకు ఎంత మొత్తంలో జాగ్రత్తపడాలనేది కూడా గందరగోళంగా వుందని మరో ఉద్యోగి మాథ్యూ క్రిటన్ వ్యాఖ్యానించారు. పెన్సిల్వేనియా, ఉటా,డెన్వర్ వంటి పలు నగరాల్లో ప్రదర్శనలు జరిగాయి.

అలోక్‌వర్మ రాజీనామా

తీసుకోకూడదని నిర్ణయించారు. ఆయన తీసుకున్న ఈ నిర్ణయం కలకలం రేపింది. తాను గత ఏడాది జులై 31నే ప్రభుత్వ ఉద్యోగం నుండి రిటైర్ అయ్యానని, సిబిఐ డైరెక్టర్‌గా ప్రత్యేకంగా నియమించారని, ఆ ఉద్యోగంలో మాత్రమే తాను ఈ ఏడాది జనవరి 31 వరకు సేవలందించాల్సిఉందని ఆ మేరకు జారీ చేసిన ఉత్తర్వులలో పేర్కొన్నారని తెలిపారు. సిబిఐ డైరెక్టర్‌గా తొలగించినందున, కొత్తగా ప్రభుత్వం నియమించిన ఉద్యోగానికి ఆ ఉత్తర్వులు వర్తించవని, అందువల్ల తాను ఈ రోజు (శుక్రవారం) నుండి రిటైరయినట్లుగా పరిగణించాలని వర్మ తన లేఖలో ప్రభుత్వానికి సూచించారు.

వర్మ ఉత్తర్వులను రద్దు చేసిన నాగేశ్వరరావు

సిబిఐ తాత్కాలిక డైరెక్టర్‌గా నియమితులైన ఎం నాగేశ్వరరావు అంతకు ముందు పదవిలో వున్న అలోక్ వర్మ జారీ చేసిన బదిలీ ఉత్తర్వులన్నింటినీ రద్దు చేస్తూ ఆదేశాలు వెలువరించారు. సిబిఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మ జారీ చేసిన ఆదేశాలేవీ చెల్లుబాటు కావని శుక్రవారం తాజాగా బాధ్యతలు చేపట్టిన నాగేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 8వ తేదీన సిబిఐ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అలోక్‌వర్మ అంతకు ముందు తాత్కాలిక డైరెక్టర్‌గా వున్న నాగేశ్వరరావు జారీచేసిన బదిలీ ఉత్తర్వులను రద్దు చేసిన విషయం తెలిసిందే.

ఆస్థానాకు ఎదురు దెబ్బ

మరోవైపు సిబిఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ ఆస్థానాకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అవినీతి ఆరోపణల వ్యవహారంలో తనపై కేసును కొట్టివేయాలని కోరతూ ఆస్థానా దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో దర్యాప్తు జరపాల్సిందేనని, 10రోజుల్లోగా దర్యాప్తును పూర్తి చేయాలని ఆదేశించింది. అయితే, హై కోర్టు ఆదేశాలపై సుప్రీంను ఆశ్రయించడానికి ఆస్థానా సిద్ధమౌతున్నారు.

ఫీజుల కోసం వేధింపులు

- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులపై కార్పొరేట్ స్కూళ్ళ వివక్ష
- బెస్ట్ అవేలబుల్ స్కూల్ పథకం అమలులో ఘోర వైఫల్యం
- చోద్యం చూస్తున్న సర్కారు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బెస్ట్ అవేలబుల్ పాఠశాలల పథకం కింద కార్పొరేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులపై ఆయా పాఠశాలల యాజమాన్యాలు వివక్ష చూపుతున్నాయి. ఫీజుల కోసం వేధిస్తున్నాయి. పాఠాలు సరిగా బోధించడం లేదు. కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులపై రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజి) ద్వారా స్వయంగా ప్రభుత్వం చేపట్టిన సర్వేలో ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి. అత్యధికంగా గుంటూరు, విజయనగరం జిల్లాల్లోనే ఇటువంటి దుస్థితి నెలకొన్నట్టు సర్వేలో వెల్లడయ్యింది. యాజమాన్యాలు తమపై వివక్ష చూపిస్తున్నాయని విజయనగరం జిల్లాలో 60 శాతం, గుంటూరు జిల్లాలో 57, కర్నూలు జిల్లాలో 27, శ్రీకాకుళం జిల్లాలో 25, పశ్చిమ గోదావరి జిల్లాలో 20 శాతం మంది విద్యార్థులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చదువు సరిగా చెప్పడం లేదని సగటున 38 శాతం మంది విద్యార్థులు తెలిపారు. అత్యధికంగా కడప జిల్లాలో 100 శాతం మంది విద్యార్థులు తమ అభిప్రాయాల్ని వెల్లడించగా, తూర్పు గోదావరి, నెల్లూరులో 50, కర్నూలులో 45, చిత్తూరు, కృష్ణాలో 42, పశ్చిమ గోదావరి జిల్లాలో 40 శాతం మంది విద్యార్థులు వెల్లడించారు. ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తున్నా ఫీజుల పేరిట తమను వేధిస్తున్నట్టు విద్యార్థులు మొరపెట్టుకున్నారు. విశాఖపట్నం జిల్లాలో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడతున్నట్టు 100 శాతం మంది విద్యార్థులు తెలిపారు. బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ స్కీమ్ కింద ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో చదువు చెప్పిస్తున్న విషయం తెలిసిందే. సుమారు 30వేల మంది విద్యార్థులు 13 జిల్లాల్లోని వివిధ కార్పొరేట్ స్కూళ్ళల్లో ఈ పథకం కింద చదువుకుంటున్నారు. డే స్కాలర్స్ కింద చదువుకుంటున్న వారికి రూ. 20వేలు, రెసిడెన్షియల్ విధానంలో చదువుకుంటున్న వారికి రూ. 30వేలు ప్రభుత్వమే యాజమాన్యాలకు చెల్లిస్తోంది. ఈ ఏడాదిలో ఈ పథకం కింద సాంఘిక సంక్షేమ శాఖ కింద 42.57 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖ కింద 34.64 కోట్లు కేటాయించారు.

లోపించిన పర్యవేక్షణ

ఈ పథకం కింద చదువుకుంటున్న విద్యార్థుల బాగోగులపై పర్యవేక్షణ లోపించింది. పాఠాలు సరిగా బోధిస్తున్నారా, బోధనలు విద్యార్థులకు అర్థమవుతున్నాయా, సమస్యలేమైనా ఎదుర్కొంటున్నారా తదితర అంశాలపై ఆయా పాఠశాలల యాజమాన్యాలతో ప్రభుత్వం చర్చించాలి. సమస్యలు పునరావృతం కాకుండా యాజమాన్యాలకు తగు సూచనలివ్వాలి. అవసరమైతే అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించాలి. కానీ నాలుగేళ్ళల్లో అటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఏదో మొక్కుబడిగా పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించి, ఫీజులు చెల్లించి, తమకేమీ సంబంధం లేదన్నట్టుగా సర్కారు చేతులు దులుపుకుంటోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

లక్ష్యానికి దూరంగా రిజిస్ట్రేషన్ల ఆదాయం

- నాలుగేళ్లలో సగటు వృద్ధి లక్ష్యం 13.81 శాతం
- లక్ష్య సాధనపై అధికారుల అంతర్మధనం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రానికి ఆదాయం సమకూర్చే శాఖల్లో స్టాంప్స్, రిజిస్ట్రేషన్లు కూడా ఒకటి. అయితే ప్రతియేటా భారీగా లక్ష్యాలను కేటాయించడం, వాటిని వంద శాతం సాధించడంలో ఆ శాఖ విఫలమవడం జరుగుతోంది. ఈ ఏడాది కూడా లక్ష్యానికి దూరంగానే ఆ శాఖ పయనిస్తోంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల ద్వారా రూ. 4880 కోట్లు లక్ష్యాన్ని నిర్దేశించగా డిసెంబర్ వరకు పరిశీలిస్తే రూ. 3536.4 కోట్ల మేర ఆదాయం సమకూరినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక ఈ చివరి మూడు నెలల్లో గరిష్టంగా రూ. 1188 కోట్ల వరకు ఆదాయం రావచ్చని, మొత్తమ్మీద ఈ ఆర్థిక సంవత్సరం రూ. 4724.4 కోట్ల వరకు వచ్చే అవకాశాలున్నాయని రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమేనంటూ అధికారులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే గత నాలుగేళ్లుగా ముందు ఏడాది ఆదాయానికన్నా ఎక్కువగా లక్ష్యాన్ని కేటాయిస్తున్నారు. ఇలా నాలుగేళ్ల సగటు వృద్ధి లక్ష్యం 13.81 శాతంగా (673 కోట్లు) ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ లక్ష్యం వృద్ధితోనే వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా అదనపు లక్ష్యాన్ని నిర్దేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంటే ఈ అదనపు లక్ష్యంతో కలిపి 2019-20 సంవత్సరంలో రూ.5553.9 కోట్లుగా ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే గతేడాది వృద్ధినే సాధించలేని పరిస్థితిలో ఉన్న ఆ శాఖ వచ్చే ఏడాది వృద్ధిని ఎలా సాధిస్తుందన్నది ప్రశ్నార్థకంగానే కనిపిస్తోంది. ప్రధానంగా స్టాంప్స్, రిజిస్ట్రేషన్లకు కీలక ఆదాయ వనరుగా ఉన్న రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం పురోగతి లేనందువల్లే ఈ పరిస్థితి వచ్చిందని అధికారులు విశ్లేషిస్తున్నారు. రాష్ట్ర విభజన జరిగిన తరువాత నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్ పుంజుకుంటుందని అంతా భావించారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఈ రెండు రంగాల్లో ప్రగతి కనిపించకపోవడం వల్ల దాని ప్రభావం రిజిస్ట్రేషన్ల ఆదాయంపైన కూడా పడినట్లు అధికారులు విశ్లేషిస్తున్నారు.



అగ్రిగోల్డ్ బాధితుల వివరాలు ఆన్‌లైన్‌లో పెట్టాలి

వైసిపి అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అగ్రిగోల్డ్ బాధితుల వివరాలను తక్షణమే ఆన్‌లైన్‌లో పెట్టాలని వైసిపి అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వైసిపి నేతలు మంగళగిరిలో ఉన్న డిజిపి కార్యాలయంలో అదనపు డిజిపిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. గడచిన నాలుగున్నరేళ్లుగా అగ్రిగోల్డ్ కుంభకోణానికి ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారనీ, సిబిసిఐడి దర్యాప్తు అనంతరం అధికారులు చెబుతున్న మాటలకు రాష్ట్ర ప్రజలు మరింత ఆందోళనకు గురవుతున్నారనీ పేర్కొన్నారు. సిబిసిఐడి దర్యాప్తు అనంతరం 19.50లక్షల బాధితులు ఉన్నారని శాసనసభలో మంత్రి చెబితే, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు కుటుంబరావు 10లక్షల బాధితులే ఉన్నారనడం ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తోందని తెలిపారు.

కుటుంబరావు అగ్రిగోల్డ్ ఆస్తుల గురించి చెబుతున్న అంశాల్లో పలు అనుమానాలున్నాయనీ, బాధితులను దృష్టిలో పెట్టుకుని సిబిసిఐడి సందేహాలను నివృత్తి చేయాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగేలా దర్యాప్తును వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కమిటీ సభ్యుల్లో ఎంఎల్ఎ గోపిరెడ్డిశ్రీనివాసరెడ్డి, మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్, లేళ్ల అప్పిరెడ్డి, అడపా శేషు తదితరులు ఉన్నారు.

మోడీని వెంటాడుతున్న రాఫెల్ స్కాం : టిడిపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాఫెల్ స్కాం మోడీని వెంటాడుతోందని, అందుకే సిబిఐ డైరెక్టర్ అలోక్‌వర్మను ఆఘమేఘాలపై 48 గంటల్లో సాగనంపారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామినీ శర్మలు అన్నారు. బందరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతిపక్షనేత మల్లికార్జునఖర్గే సూచనలను పట్టించుకోకుండా అలోక్‌వర్మను తప్పించాలని పట్టుబట్టడానికి గల కారణాలను ప్రధాని దేశ ప్రజలకు వివరించాలని వారు డిమాండ్ చేశారు. మూడేళ్లు ప్రతిపక్షనేతగా పనిచేయలేని జగన్‌కు 30 ఏళ్లు ఉండేలా అధికారం కావాలంటున్నారని వారు ఎద్దేవా చేశారు.

ట్రిపుల్ తలాక్‌పై మరోసారి ఆర్డినెన్స్

కేంద్రమంత్రివర్గం ఆమోదం

న్యూఢిల్లీ: ట్రిపుల్ తలాక్‌పై ఆర్డినెన్స్ జారీకి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ట్రిపుల్ తలాక్ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందగా, రాజ్యసభలో బీజేపీ దాని మిత్రపక్షాలకు తగినంత బలం లేకపోవడంతో పాస్ చేయలేకపోయారు. గతేడాది సెప్టెంబర్‌లోనూ దీనిపై ఆర్డినెన్స్ తేగా దాని కాలపరిమితి ఈ నెల 22తో తీరిపోనున్నది. ఆర్డినెన్స్ ద్వారా వచ్చిన నిబంధనలు ఆరు నెలలు మాత్రమే అమలులో ఉంటాయి. అయితే, ఈ నిబంధన పార్లమెంట్ సమావేశాలు జరగనిపక్షంలోనే వర్తిస్తుంది. ఓవేళ పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైతే 42 రోజులలోగా దానిని మరోసారి బిల్లు రూపంలో తేవాలి. ముస్లింలలోని గత సంప్రదాయాలకనుగుణంగా ట్రిపుల్ తలాక్ ద్వారా తన భార్య నుంచి భర్త విడాకులకు యత్నిస్తే, దానిని నేరంగా పరిగణించేలా మోడీ సర్కార్ బిల్లు రూపొందించింది. ట్రిపుల్ తలాక్ నిందితులకు కఠిన శిక్షలు విధించడాన్ని కాంగ్రెస్, వామపక్షాలుసహా పలు సెక్యులర్ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. బిల్లులో సవరణలను ఆ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. రాష్ట్రపతి ఆమోద ముద్రతో ఆర్డినెన్స్ అమలులోకి రానున్నది.

బిటి రోడ్లకు రూ.1,500 కోట్ల రుణానికి అనుమతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ స్టేట్ రూరల్ రోడ్స్ డెవలప్‌మెంట్ ఎజన్సీ (ఎపిఎస్‌ఆర్‌ఆర్‌ఎ)కు బిటి రోడ్ల పునర్నిర్మాణానికి రూ.1,500 కోట్లు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి రుణాన్ని పొందేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రుణానికి ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వనుంది.

'భావనపాడు' నిర్వాసితులు గరం గరం

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణంతో సర్వస్వం కోల్పోతున్న ప్రతి కుటుంబానికి నెలకు రూ.10 వేలు చొప్పున పదేళ్లు చెల్లించాలని, మత్స్యకారుల బోట్లు, వలలు, ఇతర సామగ్రిని ఆస్తులుగా పరిగణించి వాటికి కూడా నష్టపరిహారం ఇవ్వాలని, మత్స్యకారులకు ఆ సామగ్రిని ఉచితంగా లేదా 90 శాతం సబ్సిడీతో అందజేయాలని కోరుతున్నారు. గృహ నిర్మాణానికి రూ.15 లక్షలు చొప్పున చెల్లించాలని, పోర్టులోని అన్ని విభాగాల్లో తమకు నిర్దేశించిన మేర ప్రాధాన్యత కల్పించి ఉద్యోగాలు ఇప్పించేందుకు ప్రభుత్వం పోర్టు యాజమాన్యంతో ఒప్పందం చేసుకోవాలని, భూసేకరణ, సర్వే, ఉద్యోగాల కల్పన వంటి అంశాల పర్యవేక్షణకు రాజకీయాలకతీతంగా కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్వాసితులు కోరుతున్నారు.


కల్యాణ్ రామ్

మార్చి 1న '118'

నందమూరి కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటిస్తోన్న యాక్షన్ సస్పెన్స్ థ్రిల్లర్ '118'. నివేదా థామస్, షాలిని పాండే హీరోయిన్లు. సినిమాటోగ్రాఫర్ కె.వి.గుహన్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈస్ట్‌కోస్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై మహేశ్ కొనేరు నిర్మిస్తున్నారు. ఈ సినిమా మార్చి ఒకటో తేదీన విడుదల చేస్తున్నట్లు నిర్మాత మహేష్ కోనేరు తెలిపారు.

ఆయన మాట్లాడుతూ 'ఈ చిత్రం టైటిల్ లోగో, ఫస్ట్‌లుక్, టీజర్‌ను ఇప్పటికే విడుదల చేశాం. చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. షూటింగ్ పూర్తి అయ్యింది. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. కల్యాణ్ రామ్ పాత్ర లుక్ ఎలా ఉంటుందనే విషయంతో పాటు అసలు సినిమా ఏ జోనర్‌లో తెరకెక్కిందనే విషయాన్ని టీజర్ ద్వారా చూపించాం. సీట్ ఎడ్జింట్ థ్రిల్లర్ ఇది. కల్యాణ్ రామ్ ఇప్పటి వరకు చేయనటువంటి జోనర్. వెంకట్, అన్బరివు, రియల్ సతీష్ అద్భుతమైన యాక్షన్ పార్ట్ సినిమాలో చాలా కీలకంగా ఉంటుంది. బ్యూటీఫుల్ విజువల్స్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసిన ప్రముఖ ఛాయాగ్రాహకులు కె.వి.గుహన్‌గారు ఈ చిత్రంతో డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. దర్శకత్వంతో పాటు ఆయన కథ, కథనం, సినిమాటోగ్రఫీ చేశారు. శేఖర్ చంద్ర సంగీత సారథ్యం వహిస్తున్నారు' అని అన్నారు.

కంటెంట్ ఉంటేనే విజయం

'రావే నా చెలియ' లోగో ఆవిష్కరణలో రాజ్ కందుకూరి

సూర్య చంద్ర ప్రొడక్షన్‌లో నెమలి సురేశ్ సమర్పణలో తెరకెక్కుతోన్న సినిమా ' రావే నా చెలియ'. నెమలి అనీల్, నెమలి శ్రవణ్ నిర్మాతలు. నెమలి అనిల్, సుబాంగి పంథ్ హీరో హీరోయిన్లు. ఎన్.మహేశ్వర రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం లోగోను నిర్మాత రాజ్ కందుకూరి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'చిన్న సినిమాల పరంపర కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సినిమా కూడా ఆ జాబితాలో చేరుతుంది. 'రావే నా చెలియ' అనే టైటిలే ఆకర్షణీయంగా ఉంది. కంటెంట్ కూడా బాగుంటుందనే అనుకుంటున్నా. కథలో కంటెంట్ ఉంటే తప్పకుండా విజయం సాధిస్తుంది' అని అన్నారు.

హీరో నెమలి అనిల్ మాట్లాడుతూ 'ఇది నా మొదటి సినిమా. మా బ్యానర్‌క్కూడా మొదటిదే. మా నాన్న, బాబాయి ఇద్దరూ ఈ చిత్రానికి నిర్మాతలు. ఎంతో నమ్మకంతో సపోర్ట్ చేశారు. టీమ్ అందరమూ కష్టపడి ప్రాణం పెట్టి సినిమా చేశాం. చిన్న సినిమా అయినా మంచి సినిమా కనుక ఆదరిస్తారని ఆశిస్తున్నా' అని తెలిపారు.

దర్శకుడు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ 'విరాజ్ వలనే ఈ సినిమా మొదలైంది. నిర్మాతలు, హీరో అనిల్ కూడా నన్ను చాలా నమ్మి సపోర్ట్ చేశారు. వాళ్ల నమ్మకాన్ని ఒమ్ము చెయ్యను. ఈ సినిమాకు కెమెరా వర్క్ చాలా బాగొచ్చింది. డిఫరెంట్ లవ్ స్టోరీతో వస్తున్నాం ' అని చెప్పారు. శ్రవణ్, రవి ఎన్. విరాజ్, సుబాంగి, విజయ్ దగ్గుబాటి, ఎమ్ ఎమ్. కుమార్, కృష్ణ మూర్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ట్రెండ్‌కు తగ్గట్టు మారితేనే...

తెలుగు చిత్రసీమలో హీరో మాత్రమే ఎక్కువ కాలం రాణిస్తాడు. హీరోయిన్లకు ఒకటి లేదా రెండేళ్లు పాటు మాత్రమే సినిమాలు చేసే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత వారికి ఛాన్స్‌లు ఇవ్వరు. కొత్తవారే వారి స్థానాల్లోకి వస్తుంటారు. అలా వచ్చిన వారి పరిస్థితీ అంతే. కానీ కొందరు మాత్రం చిత్రసీమకు వచ్చి ఐదు నుంచి పదేళ్లయినా ఇక్కడ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. మారుతున్న ట్రెండ్‌కు తగ్గట్టు సన్నద్ధమవుతూ తమ నటనతో మెప్పిస్తున్నారు. కొత్త పాత్రల్లో నటిస్తున్నారు. ఒకవేళ తెలుగులో సినిమాలు చేసే అవకాశం లేకపోతే పక్క భాషా చిత్రాల్లో చేస్తున్నారు. ఇలా రెండూ బ్యాలెన్స్ చేసుకుంటూ పోతున్న వారికి వయసుతో పని లేకుండా ఛాన్స్‌లు వస్తున్నాయి.


అనుష్క

'భాగమతి' తర్వాత అనుష్క మరే చిత్రమూ చేసేందుకు అంగీకరించలేదు. అందులో చంచలగా మెప్పించి మరో కొత్త పాత్ర కోసం ఇప్పుడు యూరప్‌లో శిక్షణ తీసుకుంటుందట. రచయిత కోన వెంకట్ సినిమాలో ఈమె త్వరలో నటించబోతుందని ఆయనే స్వయంగా ప్రకటించారు. అందుకోసమే ఈ ట్రైనింగ్. ఇటీవల శిక్షణ తర్వాత అనుష్క లుక్ ఎలా ఉంటుందో కూడా కోన వెంకట్ తన ట్విట్టర్ ఖాతా ద్వారా పరిచయం చేశారు. ఈ చిత్రం ఫిబ్రవరిలో సెట్స్‌పైకి వెళ్లనున్నట్టు చెప్పారు. ఈ చిత్రానికి ఇంకా టైటిల్ ఖరారు చేయలేదు.


రకుల్ ప్రీత్‌సింగ్

తెలుగులో అయితే అవకాశాలు లేవు కానీ తమిళంలో మాత్రం ఎక్కువ సినిమాలు రకుల్ ప్రీత్‌సింగ్ చేతిలో ఉన్నాయి. ఇటీవల రకుల్ రామారావు సినీ జీవితంపై తెరకెక్కిన 'ఎన్టీఆర్ కథానాయకుడు' చిత్రంలో శ్రీదేవిగా నటించింది. పాత్ర చిన్నదైనా తన వరకూ మెప్పించింది. ఈ ఏడాది ఈమె తమిళంలో మూడు చిత్రాలు, హిందీలో ఒక చిత్రం చేస్తోంది. ఇప్పటికే కార్తితో నటించిన 'దేవ్' చిత్రం విడుదల సిద్ధమైంది. ఫిబ్రవరిలో ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇది కాకుండా హిందీలో 'డీడీ ప్యార్ డీ', తమిళంలో 'ఎస్‌కే 14' చిత్రాలు చేయబోతుంది. ఈమె ఒక పక్క సినిమాలు చేస్తూనే మరో పక్క జిమ్‌లను నడుపుతోంది.


రాశీ ఖన్నా

రాశీఖన్నా.. ఈ ఢిల్లీ బామక్కూడా తెలుగులో అవకాశాలు రావడం లేదు. గత ఏడాది 'శ్రీనివాస కల్యాణం', టచ్ చేసి చూడు, తొలి ప్రేమ, సినిమాలు చేసింది. వీటిలో 'తొలిప్రేమ' మంచి విజయాన్ని అందుకుంది. ఎన్నో ఆశలతో చేసిన 'శ్రీనివాస కల్యాణం' మాత్రం బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. ఇవి కాకుండా తమిళంలో రెండు సినిమాలు చేసింది. ఈ ఏడాది ఈ భామ ఇప్పటి వరకూ ఒక్క తెలుగు సినిమా కూడా అంగీకరించినట్టు సమాచారం లేదు. తమిళంలో మాత్రం రెండు చిత్రాల్లో చేసేందుకు సై అన్నది. అందులో ఒక్కటి అయోగ్య, రెండోది సైతాన్ క బచ్చాన్. ప్రస్తుతం ఈ రెండూ చిత్రీకరణ దశలోనే ఉన్నాయి.


సమంత

వివాహం చేసుకున్నాక సాధారణంగా సినిమాలు తగ్గిస్తారు. కానీ సమంత మాత్రం వివాహం అయిన తర్వాతే సినిమాలు చేయడం పెంచింది. గత ఏడాది 'రంగస్థలం'లో చేసి మెప్పించింది. తర్వాత ఆమె చేసిన 'యూటర్న్', 'అభిమన్యుడు' వంటి చిత్రాలూ మంచి విజయాన్ని నమోదు చేశాయి. ప్రస్తుతం నందిని రెడ్డి దర్శకత్వంలో ఓ చిత్ర రూపొందుతోంది. అందులో వృద్ధురాలిగానూ, యువతిగానూ రెండు పాత్రల్లో కనిపించబోతుంది. ఈ చిత్రంలో మొదట రెండు పాత్రలనూ చేయడానికి అంగీకరించింది. కానీ ఇప్పుడు తన నిర్ణయాన్ని మార్చుకుందని వార్తలు వస్తున్నాయి. వృద్ధురాలి పాత్ర కోసం మరొకరిని ఎంపిక చేసుకోవాలని దర్శకురాలిని కోరిందట. వెంటనే ఆ పాత్ర కోసం సీనియర్ నటి లక్ష్మిని ఎంపిక చేశారట. ఈ చిత్రానికి ఓ బేబీ ఎంత సక్కగున్నావే అనే టైటిల్‌ను పెట్టే యోచనలో ఉన్నారు. ఇది కాకుండా సమంత తన భర్తతో కలసి 'ప్రేమ మజిలి' చిత్రంలో నటిస్తుంది.


శ్రుతి హాసన్

శ్రుతి హాసన్ పూర్తిగా సినిమాలే మానేసింది. ఈమె ఒక పక్క వివాహం చేసుకోబోతుందని సినిమాలకు స్వస్తి చెప్పబోతుందని ప్రచారం జరుగుతోంది. దానికి తగ్గట్టే ఏ భాషలోనూ ఒక్క చిత్రమైనా చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. శ్రుతి మాత్రం ఓ మ్యూజిక్ ఆల్బమ్ చేసుకుంటోంది. ఇది వరకూ ఆమె నటించిన శభాష్ నాయుడు, దశావతారం త్వరలో విడుదల కానున్నాయి.


కాజల్

వయసు పెరుగుతున్నా తెలుగులో అవకాశాలు తగ్గని కథానాయిక ఎవరైనా ఉన్నారంటే కాజలే. సమంత కూడా తెలుగులో ఈమె చేసినన్ని చిత్రాలు చేయడం లేదు. గత ఏడాది 'ఎంఎల్ఏ', 'కవచం' చిత్రాల్లో చేసింది. రెండూ నిరాశ పరిచాయి. ఇవి కాకుండా తమిళంలో మూడు సినిమాలు చేసింది. ఇప్పుడు కన్నడంలో ఒకటి, తెలుగులో రెండు చిత్రాలు, తమిళంలో మరో రెండు సినిమాలు చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పుడు బాలీవుడ్ 'క్వీన్' చిత్రాన్ని దక్షిణాది భాషల్లో రీమేక్ చేస్తున్నారు. అందులో తమిళంలో కాజల్ లీడ్‌రోల్ పోషిస్తోంది. ఈ చిత్రం ప్యారిస్ ప్యారిస్ అనే పేరుతో తెరకెక్కుతోంది. రమేష్ అరవింద్ దర్శకత్వం వహిస్తున్నాడు.


తమన్నా

'నా..నువ్వే', నెక్స్ట్ ఏంటీ వంటి చిత్రాల్లో గత ఏడాది తమన్నా నటించినా అవి ఆశించిన విధంగా ఫలితాన్నివ్వలేదు. ఈ సినిమా కమర్షియల్‌గా విజయం సాధించకపోయానా వీటిలో తమన్నా నటనకు మంచి మార్కులు పడ్డాయి. యస్ నటించిన 'కేజీఎఫ్'లో అతిథి పాత్రలో చేసింది. ఈ రోజు ఆమె వెంకటేశ్ సరసన కథానాయికగా నటించిన మల్టీస్టారర్ 'ఎఫ్2' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ట్రైలర్లు, టీజర్లు చూస్తుంటే కడుపుబ్బా నవ్వించేలా ఉంటుందనిపిస్తుంది. ఇందులో వరుణ్ తేజ్, మెహ్రీన్ కూడా నటించారు. బాలీవుడ్ 'క్వీన్' తెలుగు రీమేక్‌లో తమన్నా టైటిల్ రోల్ పోషిస్తుంది. ఇటీవల ఈ చిత్రం ఫస్ట్‌లుక్ టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో అచ్చమైన తెలుగు అమ్మాయిలా అమాయకంగా కనిపించింది. ప్రశాంత వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. తమిళంలో మరో రెండు చిత్రాలు చేయనుంది. చిరంజీవి టైటిల్ రోల్ పోషిస్తున్న 'సైరా నరసింహారెడ్డి' చిత్రంలోనూ ఓ కీలక పాత్రలో కనిపించనుంది. విశాల్ హీరోగా సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కనున్న 'దేవీ2'లో ఈమె నటిస్తోంది. ఇది సెప్టెంబర్‌లో విడుదల కానుంది.

నయన తార...ఒకప్పుడు విజయశాంతిలా తమిళంలో రాణిస్తోన్న కథానాయిక నయన తార. తన తరహాలో మహిళా ఓరియెంటెడ్ సినిమాలు చేసుకుంటూ పోతుంది. బుధవారమే ఆమె నటించిన చిత్రం 'విశ్వాసం' ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇందులో అజిత్ హీరో. మరో పక్క ఈమె తమిళ దర్శకుడు శివకార్తికేయతో వివాహం జరగనుందని ప్రచారం జరుగుతోంది. రెండేళ్లుగా ఈ తరహా ప్రచారమే జరుగుతున్నా దానికి వీరి పెళ్లితో ఈ ఏడాది శుభకార్డు పడనుంది. గతంలో డోరా చేశాక ఇప్పుడు ఆరమ్ చేసింది. ఇవి కాకుండా ఈ ఏడాది ఏ సినిమాల్లో నటిస్తున్నట్టు మాత్రం వెల్లడించలేదు. కానీ ఆమె నటిస్తోన్న 'సైరా నరసింహారెడ్డి' ఈ సమ్మర్‌కు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో చిరంజీవికి జోడీగా నయన నటిస్తోంది.

పెద్ద హీరోనని ఎప్పుడూ అనుకోను

'ఎఫ్2' ప్రీ రిలీజ్ వేడుకలో వెంకటేశ్

"ఎఫ్ 2' సినిమా ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తుంది. సినిమాను 75 రోజుల్లో పూర్తి చేశాం. మొత్తం 80 శాతం కామెడీతోనే నింపేశాం. టైమింగ్ ఉన్న గొప్ప నటులు ఇందులో పనిచేశారు. వెంకటేష్, తమన్నా మధ్య ఉండే కెమిస్ట్రీ, కామెడీని ప్రేక్షకులు బాగా ఆస్వాదిస్తారు. వరుణ్ తెలంగాణ యాసతో ఆకట్టుకుంటాడు' అని దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు.

వెంకటేశ్, వరుణ్ తేజ్, తమన్నా, మెహరీన్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'ఎఫ్2'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మించారు. అనిల్ రావిపూడి దర్శకుడు. శనివారం ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం రాత్రి ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు.

వెంకటేష్ మాట్లాడుతూ 'ఈ సంక్రాంతి పండుగకి ఎఫ్ 2 రావడం చాలా ఆనందంగా ఉంది. సాధారణంగా పండగలకు వచ్చే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌ను ప్రేక్షకులు ఆదరిస్తారు. ఈ సంక్రాంతికి ఎఫ్2.. సంక్రాంతి అల్లుళ్లుగా వస్తున్నాం. నేను పెద్ద హీరోనని ఎప్పుడూ అనుకోను. కథ, దర్శకుడిని నమ్మి సినిమా చేశాను. అనిల్‌తో ఏది బావుంది.. ఏది బాలేదు అని డిస్కస్ చేశాను. అలాగే దిల్‌రాజుతో కూడా మంచి అనుబంధం ఉంది. ఈ సినిమాకు నేను పనిచేస్తుంటే కో ప్రొడ్యూసర్ మేనేజర్‌లా కలిసి పోయి పనిచేశాను. దృశ్యం, గురు సినిమాలా తర్వాత చేసిన సినిమా ఇది. ఓ రకమైన ఎనర్జీని ఉండటం నాకే తెలిసింది. చాలా నేచురల్‌గా చేశాను. అనీల్ కూడా చాలా ఫ్రీడమ్ ఇచ్చి చేయించుకున్నాడు. వరుణ్‌తేజ్, రాజేంద్రప్రసాద్‌తో కలిసి పనిచేయడం ఆనందంగా అనిపించింది. తమన్నా, మెహరీన్ వండర్ వర్క్ చేశారు. సినిమాకు పనిచేసిన సమీర్‌రెడ్డి, దేవిశ్రీ ప్రసాద్‌లకు థాంక్స్' అని అన్నారు.

వరుణ్‌తేజ్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో వరుణ్ తేజ్‌లా కాదు.. వరుణ్ యాదవ్‌లా కనపడతాను. ఫస్ట్ టైం ఓ మాస్ క్యారెక్టర్ చేశాను. కామెడీ క్యారెక్టర్. ఈ సినిమా ఎప్పుడు స్టార్ట్ అయ్యింది.. ఎప్పుడు అయిపోయిందో తెలియడం లేదు. ఎంటైర్ టీం కారణంగానే సినిమా చాలా త్వరగా పూర్తయిపోయింది. డైరెక్టర్ అనిల్‌ను చూస్తుంటే తను మాకంటే బావున్నాడనిపిస్తుంటుంది. ఈ జర్నీ నాకు మెమొరబుల్‌గా ఉండిపోతుంది. ఆయనతో నా జర్నీ ఓ నటుడిగా ప్రారంభమై, బ్రదర్‌లా మారింది. ఈ సినిమాతో అనిల్‌లాంటి మంచి ఫ్రెండ్ దొరికినందుకు ఆనందంగా ఉంది. దిల్‌రాజు, శిరీష్, లక్ష్మణ్‌గారితో ఫిదా చేశాం. అది చేశానో లేదో ఈ సినిమా స్క్రిప్ట్‌ను పంపేశారు. ఈ బ్యానర్‌లో పనిచేయడం హ్యాపీగా ఉంది. మరిన్ని సినిమాలను ఈ బ్యానర్‌లో చేయాలనుకుంటున్నాను. నేను చిన్నప్పట్నుండి చిరంజీవి, బాబాయ్ సినిమాలు ఎలానూ చూస్తారు. అయితే నవ్వుకోవాలంటే మాత్రం రాజేంద్ర ప్రసాద్ సినిమాలే చూసేవాడిని. అలాంటి ఆయనతో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. మా పెద్దనాన్నగారి కాన్‌టెంపరరీ హీరో వెంకటేష్‌గారితో సినిమా చేయాలంటే ఎక్కడో చిన్న భయం ఉండేది. కానీ ఆయన మాతో చాలా కంఫర్ట్‌గా ఉన్నారు. ఫ్రెండ్‌లా, మెంటర్‌లా మాతో ఉన్నారు. నెక్స్‌ట్ టైం ఆయనతో స్టోరీ కూడా అడగకుండానే సినిమా చేయడానికి నేను రెడీ. ఈ సినిమాలో మా ఇద్దరి బ్రోమాన్స్ అద్భుతంగా ఉండబోతోంది. ప్రేక్షకులు సీట్లో కుదురుగా కూర్చొని సినిమా చూడలేకుండా నవ్వుతూనే ఉంటారు' అని చెప్పారు.


వరుణ్ తేజ్, వెంకటేశ్

కొన్ని సినిమాలు మైలురాళ్లలాగా అలా నిలిచిపోతాయని, ఈ చిత్రం తనకు అలాంటిదని తమన్నా పేర్కొంది. ఊపిరి తర్వాత తాను ఈ చిత్రానికి డబ్బింగ్ చెప్పుకున్నానని, చాలా షేడ్స్ ఉండే పాత్రలో చేశానని ఆమె చెప్పింది.

లక్ష్మీపార్వతి


యజ్ఞ శెట్టి

'లక్ష్మీస్ ఎన్టీఆర్' పేరుతో ఎన్టీఆర్ జీవితాన్ని వెండితెరపై ఆవిష్కరిస్తున్న విషయం తెలిసిందే. బాలకృష్ణ టైటిల్ రోల్ పోసిస్తున్న 'ఎన్టీఆర్'లో ఏది అవసరమో అదే చూపిస్తామని ఆ చిత్రబృందం చెబుతుంది. ఆ చిత్రం మొదటి భాగం 'ఎన్టీఆర్ కథానాయకుడు'లో అలాగే చూపించారు. రెండో భాగంలో ఎలా ఉంటుందో చూడాలి. రామ్ గోపాల్ వర్మ రూపొందిస్తున్న 'లక్ష్మీస్ ఎన్టీఆర్'లో మాత్రం వాస్తవాలే చూపిస్తామని ఇది వరకే చెప్పారు. ఇటీవల ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఆ టీజర్ మొత్తం చంద్రబాబు విమర్శస్తూ సాగింది. ఈ చిత్రంలో ఎన్టీఆర్ రెండో భార్య లక్ష్మీపార్వతి కన్నడ నటి యజ్ఞ శెట్టి నటిస్తోంది. ఆమె లుక్‌ను శుక్రవారం విడుదల చేశారు. రామ్ గోపాల్ వర్మ తన ట్విట్టర్ ఖాతా ద్వారా విడుదల చేశారు. యజ్ఞ శెట్టి గతంలో రామ్‌గోపాల్ వర్మ చేసిన 'కిల్లింగ్ వీరప్పన్'లో ముత్తులక్ష్మిగా చేసింది. కన్నడలో చాలా సినిమాల్లో నటించింది. ఈ చిత్రంలో ఎన్టీఆర్‌గా మరాఠీ రంగస్థల నటుడు ఒకరు నటిస్తున్నారు. లక్ష్మీపార్వతి ఎన్టీఆర్ జీవితంలో వచ్చిన దగ్గర నుంచీ జరిగిన సంఘటనలను ఈ చిత్రంలో చూపిస్తామని రామ్ గోపాల్ వర్మ తెలిపారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రం మార్చిలో విడుదల కానుంది.

క్రెడిట్ సుబ్బరాజ్‌దే



'పేట' చిత్రం విజయం అంతా దర్శకుడు కార్తిక్ సుబ్బరాజ్‌దేనని రజనీకాంత్ అన్నారు. ఈ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. విహారయాత్ర నిమిత్తం డిసెంబరు 22న అమెరికా వెళ్లిన రజనీ గురువారం తిరిగి చెన్నై వచ్చారు. ఈ సందర్భంగా 'పేట' విజయం గురించి విమానాశ్రయంలో విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. "పేట' సినిమా ప్రేక్షకులకు నచ్చిందని తెలిసింది. నాకు చాలా సంతోషంగా ఉంది. అభిమానుల సంతోషమే నా సంతోషం. ఈ ప్రశంసలన్నీ కార్తిక్ సుబ్బరాజ్‌కే దక్కుతాయి. నేను ఇంకా బాగా నటించానని అందరూ నా ప్రస్తావన తీసుకొస్తున్నారు, నాదేం లేదు. ప్రతి ఒక్కరికీ సంక్రాంతి శుభాకాంక్షలు' అని రజనీ అన్నారు. 'పేట' సినిమాలో త్రిష, సిమ్రన్ కథానాయికల పాత్రలు పోషించారు. నవాజుద్దీన్ సిద్ధిఖీ ప్రతినాయకుడి పాత్ర పోషించారు. విజయ్ సేతుపతి, బాబీ సింహా, మేఘా ఆకాష్, యోగిబాబు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. అనిరుధ్ బాణీలు అందించారు. కళానిధి మారన్, అశోక్ వల్లభనేని నిర్మించారు.



ఒడిశా ఒడిలో టిబెట్ అందాలు


పచ్చని కొండ కోనల నడుమ భిన్న సంస్కృతుల సమ్మేళనాన్ని కనులారా చూడాలంటే.. దేశ సరిహద్దులను చేరుకోవాలి. అయితే, అంతదూరం వెళ్లడం సాధారణ ప్రజలకు సాధ్యం కాదు. అలాంటి వారి కోసం విశాఖ జిల్లాలో అరకు ఒక ప్రకృతి ప్రసాదిత వేదిక. అయితే దీనికి పోటీపడుతూ ఒడిశా సరిహద్దుల్లో ఉన్న మహేంద్రగిరి పర్వతావళి పర్యాటకులకు మరో కానుకనే చెప్పాలి. అచ్చం టిబెట్ వాతావరణాన్ని పోలి ఉండే ఇక్కడి వాతావరణం సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తుంది. అంతేకాదు.. టిబెటన్లు నివసించే ఆరు గ్రామాలు ఇక్కడ ఉన్నాయి. ఇంత చలిలోనూ నిత్యం వేడినీరు ఉబికే తప్తపాని కేంద్రం పర్యాటకులకు మరో అదనపు ఆకర్షణ. ఈ సీజన్‌లో ఇక్కడి ప్రకృతి అందాలు మరింత రెట్టింపు అవుతాయి. ప్రకృతి సిగలో దాగిన అరుదైన టిబెటెన్ పర్యాటక ప్రాంతాల విశేషాలే ఈ వారం 'జర్నీ'!

ఒడిశాలోని పర్లాకిమిడికి 150 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతాలు ఉన్నాయి. శ్రీకాకుళం నుంచి పర్లాకిమిడి సుమారుగా 60 కిలోమీటర్లు. అక్కడి నుంచి మహేంద్రగిరి కొండల పక్క నుంచి వెళ్తుంటే... నిజంగానే టిబెట్‌లోకి వచ్చేశామా! అన్న అనుభూతి కలుగుతుంది. నాతోపాటు మా మిత్ర బృందం అక్కడికి ప్రయాణమయ్యాం. అసలే చలికాలం... అలా పర్లాకిమిడి దాటామో లేదో చలి విశ్వరూపం చూపించింది. మధ్యమధ్యలో ఆగుతూ, అక్కడి ప్రకృతిని ఆస్వాదిస్తూ మా జర్నీ కొనసాగించాం. టిబెటన్లు నివసించే చంద్రగిరి చేరుకోగానే... అచ్చం టిబెట్‌లో ఉన్న ఫీలింగే కలిగింది. అక్కడి కట్టడాలు, ఆలయాలు, వారు నివసించే ఇళ్లు చూస్తుంటే నిజంగానే టిబెట్‌లోకి వచ్చేశామా అనే ఫీలింగ్ కలిగింది. వారి ఇళ్లు కూడా చెక్కలతో నిర్మించుకోవడం విశేషం. ఎప్పుడో 60 ఏళ్ల క్రితం టిబెట్ నుంచి తాము ఇక్కడికి వచ్చేసామని ఒక మహిళ చెబుతూ ఆ ప్రాంతంతో తమ అనుబంధాన్ని జ్ఞాపకం చేసుకున్నారు. తన కొడుకుతో పాటు, ముద్దుగా పెంచుకుంటున్న కుక్కపిల్లలను మాకు పరిచయం చేసిందామె. అక్కడే కొద్దిసేపు ఉండి, ఆ కుక్కపిల్లలతో ఆడుకున్నాం. తర్వాత బౌద్ధవులకు ఆరాధ్యదైవమైన తథాగతుని ఆలయాన్ని దర్శించుకున్నాం.

టిబెట్ శైలీ సంస్కృతి

భారత్‌లోకి 1967లో వలస వచ్చిన టిబెటన్లకు దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో భారత ప్రభుత్వం ఆవాసాలను కల్పించింది. ఇందులో భాగంగానే ఒడిశాలో కూడా కొండప్రాంతంలో ఆరు గ్రామాలను వారి కోసం కేటాయించింది. అప్పటినుంచి వారు అక్కడే జీవనం సాగిస్తున్నారు. ప్రారంభంలో దాదాపు 2,480 మంది జనాభా ఉండగా... ఇప్పుడు ఆ సంఖ్య మూడు వందలు మాత్రమే పెరిగినట్లు తెలుస్తోంది. కుటుంబ నియంత్రణ పాటించడం, ఎదిగిన పిల్లలు వివిధ ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం వల్ల గ్రామాల్లో జనాభా తక్కువగానే కనిపిస్తోంది. ఎక్కువగా భారత ఆర్మీలోనే పనిచేస్తున్నట్లు స్థానికులు చెప్పారు. భాష వేరైనా ప్రస్తుతం అక్కడివారు సగం ఒరియా, సగం హిందీ కలిపి మాట్లాడడం గమనించాం. ఈ గ్రామాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సౌకర్యాలనూ కల్పిస్తున్నాయి. ఇక్కడి పిల్లల కోసం రెండు ప్రాథమిక పాఠశాలలు, నర్సరీ సంస్థలు, చిన్న డిస్పెన్సరీతోపాటు టిబెట్‌లో ప్రత్యేకత కలిగిన ఆయుర్వేదిక వైద్యశాల కూడా ఏర్పాటు చేశారు. వ్యవసాయం చేసుకునేవారికి కావాల్సిన విత్తనాలు, ఇతర అవసరాలకు సహకార సంఘం ఈ గ్రామాలకు ఉండడం విశేషం. అలాగే ప్రతి గ్రామానికి ఒక సెటిల్‌మెంట్ అధికారి ఉంటారు. ఆ అధికారిని కేంద్ర హోంశాఖ నియమిస్తుంది. గ్రామస్తుల అవసరాలను స్థానిక రాష్ట్ర ప్రభుత్వం వద్దకు తీసుకువెళ్లడం ద్వారా వాటి పరిష్కారానికి ఈ అధికారులు చర్యలు తీసుకుంటారు.





తప్తపాని ప్రత్యేకత

తర్వాత అక్కడికి దగ్గరలోనే ఉన్న కొన్ని జలపాతాల వద్దకు వెళ్లాం. అక్కడి ప్రకృతి అందాలను చూడగానే మా శారీరక అలసట మొత్తం ఒక్కసారిగా ఎగిరిపోయింది. చాలాసేపు జలపాతాల్లో సరదాగా గడిపాం. తిరుగు ప్రయాణంలో తప్తపానికి చేరుకున్నాం. అప్పటికే సాయంత్రం కావడంతో చలిగాలులు కూడా పెరిగిపోయి శరీరాన్ని వణికించడం మొదలెట్టింది. తప్తపానిలోని ఓ ప్రత్యేకత మమ్మల్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. అక్కడి కొలనులో 365 రోజులూ వేడినీరు పొంగుతూనే ఉంటుంది. భూగర్భంలో ఉన్న కొన్ని రసాయన ఖనిజాల కారణంగానే నీరు వేడిగా ఉంటుందని అక్కడి వారు చెప్పారు. ఈ నీటితో స్నానం చేస్తే చర్మ వ్యాధులు తొలగిపోతాయని స్థానికుల విశ్వాసం. ఈ ప్రాంతం పర్లాకిమిడి కన్నా... బరంపురానికి దగ్గరలో ఉంటుంది. కొద్దిసేపు అక్కడే ఉండి, స్నానం చేసి, మళ్లీ బయలుదేరాం.






పెథాయి ప్రభావం!

అక్కడి నుంచి దాదాపు 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న దారింబడికి చేరుకున్నాం. ఇది చాలా ఎత్తయిన ప్రదేశంలో ఉన్న చిన్న గిరిజన గ్రామం. అక్కడ సాధారణ పరిస్థితుల్లో చలి తీవ్రంగా ఉంటుంది. దాదాపుగా అత్యంత శీతల ప్రాంతమైన లంబసింగి మాదిరిగానే జీరో డిగ్రీ ఉష్ణోగ్రత నమోదవుతుందని స్థానికులు చెప్పుకొచ్చారు. అయితే అక్కడే మా బృందానికి దురదృష్టం వెంటాడింది. బంగాళాఖాతంలో ఏర్పడిన పిథాయి తుపాను ప్రభావంతో మబ్బులు కమ్ముకోవడంతో చలీ కొంతవరకు తగ్గింది. అయినప్పటికీ 16 డిగ్రీల వరకూ ఉండడంతో ఆ చలిలోనే గ్రామంలో సరదాగా తిరిగాం. ఆ రాత్రికి అక్కడే బస చేసేందుకు ముందుగానే ఏర్పాట్లు చేసుకున్నాం. అయితే, అంత చలిలో రాత్రిపూట కారు ప్రయాణం బాగుంటుందన్న భావనతో రాత్రి పదకొండు గంటలకే తిరుగు ప్రయాణం ప్రారంభించాం. రాయగడ మీదుగా విజయనగరం నుంచి విశాఖ వెళ్దామని భావించాం. రాత్రి సమయంలో నరమానవుల జాడ లేకపోవడంతో గూగుల్‌నే నమ్ముకోవాల్సి వచ్చింది. దాంతో దారి తప్పి, చిన్న చిన్న ఇరుకు రోడ్లపైకి చేరిపోవడంతో కొంత ఇబ్బందిపడ్డాం. ఎట్టకేలకు ఉదయం ఐదు గంటలకు రాయగడ చేరుకుని కాలకృత్యాల అనంతరం మళ్లీ ప్రయాణం ప్రారంభించాం. ఉదయం పదకొండు గంటలకు విశాఖకు చేరుకున్నాం. కేవలం 24 గంటలే మా పర్యటన జరిగినప్పటికీ, అనేక మధుర జ్ఞాపకాలు మూటగట్టుకున్నాం.

మరెందుకు ఆలస్యం!
మీరూ.. మీ జర్నీ మొదలుపెట్టండి!!
హ్యాపీ జర్నీ!

- పి.ఎం. జవహర్

చారిత్రక సంపద.. జురిక్ నగరం!



ఎత్తయిన ఆల్ప్స్ పర్వతాలతో, ప్రకృతి అందాల నడుమ పర్యాటకులను కనువిందు చేస్తుంది జురిక్. ఇది స్విట్జర్లాండ్ దేశంలోని ఓ పెద్ద నగరం. ఆల్ప్స్ పర్వతాల చుట్టూ నదులు, సరస్సులపై తేలియాడే కలపతో నిర్మించిన గృహాలు సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తాయి. ఇవి క్రీస్తుపూర్వం 5000 నుంచి 500 సంవత్సరాల నాటివని చరిత్ర చెబుతోంది. గత చరిత్రకు అద్దం పట్టే ఈ నిర్మాణాల్ని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. రోమన్లు ఈ నగరాన్ని ఏర్పాటు చేశారు. పూర్వం ఈ నగరాన్ని 'టురికమ్' అని పిలిచేవారట! తర్వాతి కాలంలో 'జురిక్' అనే పేరు స్థిరపడింది. ఈ నగరం పక్కనే జురిక్ నది ఉంది. ఇది ఇప్పటి వరకు 1929, 1962 సంవత్సరాల్లో రెండుసార్లు కొన్ని వారాలపాటు పూర్తిగా గడ్డకట్టి పోయిందట! అప్పుడు పర్యాటకుల సందడి అంతా ఇంతా కాదు. ఈ నది చుట్టుపక్కల అందాలు అందర్నీ ఆకట్టుకుంటాయి. రాత్రి వేళల్లో ఇక్కడి పరిసరాలు మరింత కనువిందు చేస్తాయి. స్విట్జర్లాండ్ ఆర్థిక రాజధాని ఇదే. ప్రపంచంలోని ప్రధాన బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాలు ఎక్కువగా ఇక్కడే ఉంటాయి. సరళమైన ప్రభుత్వ విధానాలు, తక్కువ పన్ను ఉండటమే దీనికి ప్రధాన కారణం. ఇక్కడి అధికారిక భాష జర్మన్, కరెన్సీ స్విస్ ఫ్రాంక్. దేశం మొత్తంతో పోల్చుకుంటే, జురిక్ విమానాశ్రయం, రైల్వే స్టేషన్లే ఎక్కువ రద్దీగా కనిపిస్తాయి. నిరుద్యోగ సమస్య చాలా తక్కువ. 'బెస్ట్ క్వాలిటీ ఆఫ్ లైఫ్ ఇన్ ది వరల్డ్' గా దీనికి టైటిల్ కూడా ఉంది. ఇంకా దీన్ని 'హ్యాపీయెస్ట్ సిటీ'గానూ పిలుస్తుంటారు. ఏటా ఆగస్టు నెలలో ఈ సిటీలో పెద్ద టెక్నో స్ట్రీట్ పార్టీ జరుగుతుంది. లక్షలమంది వింత వేషధారణలతో పరేడ్ చేస్తుంటారు. ఈ సిటీలో ఇంచుమించు 12 వందలకు పైగా మంచినీళ్ల ఫౌంటేన్లున్నాయి. ఈ ఫౌంటేన్లు కేవలం ఫొటోలు దిగడం కోసమే కాదండోయ్, దాహం తీర్చుకోవడానికీ ఉపయోగపడుతున్నాయి. స్థానికంగా ఉన్న జంతు ప్రదర్శనశాల దాదాపు ఐదు వేల జీవులతో పర్యటకుల్ని ఆకట్టుకుంటుంది. ఈ జూలో పెంగ్విన్ పరేడ్, ఆసియన్ ఎలిఫెంట్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ. ఏటా ఇక్కడికి ఇంచుమించు 12 లక్షల మంది సందర్శకులు వస్తుంటారు. ★

'జర్నీ'కి ఆహ్వానం

మన జీవితంలో కుటుంబ సమేతంగానో, స్నేహితులతోనో ఎన్నో ప్రయాణాలు చేస్తూ ఉంటాం. ఆ అనుభవాలు, విశేషాలు మాతో పంచుకునేందుకు 'జర్నీ' మీకు ఆహ్వానం పలుకుతోంది. మీ పర్యాటక అనుభూతులను మాకు రాసి పంపండి. లేదా మెయిల్ చేయొచ్చు. ఫొటోలు జత చేయడం మర్చిపోవద్దు.



మా చిరునామా
జర్నీ, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



జోక్:

తల్లి : ఏం చేస్తున్నావు చింటూ అక్కడ?
చింటూ : మొక్కలకు నీళ్లు పోస్తున్నాను అమ్మా..!
తల్లి : వర్షం పడుతోంది కదరా!
చింటూ : ఫర్వాలేదులే.. గొడుగు వేసుకునే పోస్తున్నా!

పొడుపు కథ

అడవిలో పుట్టాను అడవిలో పెరిగాను
వంటి నిండా గాయాలు
కడుపు నిండా రాగాలు
ఎవరిని నేను?



జవాబు : వేణువు

నీడ కనిపెట్టండి!

పిల్లలూ! ఈ చిత్రంలో కొన్ని జంతువులు, వాటి నీడలూ ఉన్నాయి. ఏ నీడ దేనిదో కనిపెట్టండి?



అమ్మ

అమ్మా అమ్మా నువ్వు మా దేవతవమ్మా
మా దైవం నువ్వమ్మా
ఎప్పుడు మాతోనే ఉంటావమ్మా
మాకు జన్మనిచ్చేవమ్మా
మా జీవితానికి వెలుగమ్మా
మాకు ధైర్యం నువ్వేనమ్మా
మా కోసం రాత్రి పగళ్ళు మేల్కొనే
ఉంటావమ్మా
మేము బాగా చదువుకోవాలని
కోరుకుంటావమ్మా
మాకు మంచి మాటలు
చెపుతుంటావమ్మా
మా వేలు పట్టుకొని నడిపిస్తూ
ఉంటావమ్మా
అమ్మా అమ్మా
మా దైవం నువ్వమ్మా





ఎం. సుభాషిణి
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
చిప్పగిరి,
కర్నూలు జిల్లా .




రంగులు వేయండి!

పిల్లలూ..! ఇక్కడ మీకెంతో ఇష్టమైన బొమ్మ ఉంది కదా? దానికి రంగులు వేయండి!

నేను గీసిన బొమ్మ



వి. గాయత్రి
8వ తరగతి,
జెడ్.పి.హైస్కూల్,
కాణిపాకం,
చిత్తూరు.



పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన
మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - Chinnaarips@gmail.com

C M Y K

ఫేవరెట్ భారత్

- నేడు ఆస్ట్రేలియాతో తొలివన్డే
- పాండ్యా స్థానంలో జడేజా
- ఉదయం 7.50 గం॥ల నుంచి సోనీ సిక్స్‌లో



సిడ్నీ: ఆస్ట్రేలియా పర్యటనలో అద్భుత ప్రదర్శనతో దూసుకెళ్తోన్న కోహ్లీ సేన నేటినుంచి ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి వన్డేలో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. ఓపెనర్ కెఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యాలు సస్పెన్షన్ కారణంగా సిరీస్‌కు దూరమైన నేపథ్యంలో ఈ వన్డేకు ప్రాధాన్యత సంతరించుకుంది. అంతేగాక ఐసిసి వన్డే ప్రపంచకప్‌కు ముందు సన్నాహకంగా జరిగే ఈ సిరీస్‌లో కోహ్లీ సేన ఏమేరకు రాణించనుందో కూడా తేలిపోనుంది. ప్రతి ఒక్కట ఆటగాడి ప్రదర్శనను బట్టే రాబోయే ప్రపంచకప్ జట్టు కూర్పు ఉండబోతున్న నేపథ్యంలో వన్డే సిరీస్‌ను చేజిక్కించుకోవాల్సిన అవసరమెంతైనా ఉంది. ఆసీస్‌తో శనివారం జరిగే తొలి వన్డేకు టీమిండియా జట్టును ముందే ప్రకటించే సాంప్రదాయానికి తెరతీయలేదు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్‌లపై నిషేధం నేపథ్యంలో పాండ్యా స్థానంలో రవీంద్ర జడేజాను తుదిజట్టులోకి తీసుకునే అవకాశముంది. ఈ విషయాన్ని టీమిండియా సారథి విరాట్ కోహ్లీ శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో తెలియజేశాడు.

భారత జట్టు (అంచనా): రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, విరాట్ కోహ్లీ, అంబటి రాయుడు, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోనీ, రవీంద్ర జడేజా, భువనేశ్వర్ కుమార్, కుల్దీప్/ చాహల్, ఖలీల్ అహ్మద్/షమీ.

పాండ్యా, రాహుల్‌పై వేటు!

న్యూఢిల్లీ: టీమిండియా యువ ఆటగాళ్లు కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యాలపై వేటు పడింది. కాఫీ విత్ కరన్ షోలో మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో వీరిద్దరినీ శుక్రవారం సస్పెండ్ చేసింది. తదుపరి చర్యలు తీసుకొనేందుకు దర్యాప్తు చేపట్టనున్నామని క్రికెట్ పాలకుల కమిటీ ఛైర్మన్ వినోద్ రాయ్ అన్నారు. సస్పెన్షన్‌కు గురైన రాహుల్, పాండ్యాలు ఆస్ట్రేలియానుంచి తిరిగి భారత్‌కు బయలుదేరనున్నారు. ఇప్పటికే వీరిద్దరినీ జట్టు నుంచి తప్పించారు. వీరిపై రెండు మ్యాచ్‌ల నిషేధం విధించాలని సీఓఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ సూచించిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని బిసిసిఐ న్యాయ కమిటీ అభిప్రాయం కోరింది. అయితే వారి వ్యాఖ్యలు బిసిసిఐ నిబంధనల ఉల్లంఘనకు పరిధిలోకి రావని చెప్పడంతో ఇద్దరు ఆటగాళ్లను ప్రస్తుతానికి సస్పెండ్ చేసి విచారణ చేపట్టనున్నారు. అంతకుముందు బిసిసిఐ సీఈవో రాహుల్ జోహ్రీపై 'మీటూ' ఆరోపణలు రావడంతో అతడిని సెలవుపై పంపించారు. విచారణ పూర్తైన తర్వాత తిరిగి బాధ్యతలు చేపట్టారు.



గాజువాక సమస్యలపై త్వరలో ప్రణాళిక

- రైల్వేజోన్ పట్టని కేంద్రం
- స్టీల్‌ప్లాంట్‌కు ప్రత్యేక గనుల కేటాయింపేదీ?
- ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ కోసం పోరాడతాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లా గాజువాక, పెదగంట్యాడ ప్రాంత ప్రజలు, ప్రధానంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై జనసేన, సిపిఎం, సిపిఐతో కలిసి ప్రణాళికలు తయారు చేస్తున్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. కోటీశ్వరుల కోసం రాష్ట్ర మార్కెట్లను చంద్రబాబు తెరిచివుంచి వాల్‌మార్ట్‌లను స్వాగతించి చిల్లర వర్తకాన్ని దెబ్బతీసే చర్యలు తీసుకున్నారని, ఈ విధానాలు మారేవరకూ పోరాడతామని స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం విశాఖ జిల్లా గాజువాకలో సిపిఎం, సిపిఐ, జనసేన పార్టీల ఆధ్వర్యాన 'రాష్ట్రంలో నూతన రాజకీయ ప్రత్యామ్నాయం'పై గాజువాక జోన్ కార్యదర్శి రాంబాబు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభకు పి.మధు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎపిలో టిడిపికి మరోసారి అవకాశమిస్తే అభివృద్ధి చేస్తామంటూ చంద్రబాబు, అతని మంత్రులు చేస్తున్న ప్రచారంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదైనా పరిశ్రమలో కార్మికుడు ప్రమాదవశాత్తూ చనిపోతే యాజమాన్యం రూ.10 లక్షలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.5 లక్షలకే బేరం కుదిర్చి యాజమాన్యానికి మేలు చేసే విధానం తీసుకుంటున్నా రంటూ ఎద్దేవా చేశారు. దేశంలో జిఎస్‌టి అమల్లోకి వచ్చాక 'అంబానీ తిన్న ఇడ్లీ ఖర్చు.. సామాన్యుడు తిన్న ఇడ్లీ ఖర్చు' ఒక్కటే అయిపోయిందని చెప్పేసరికి సభలో చప్పట్లు మార్మోగాయి. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో అత్యధికంగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, ప్రజానీకం పరిస్థితులు ఏ మాత్రమూ బాగోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలపై పన్నుల భారం పెరిగి సాధారణ జీవనం సాగించలేకపోతున్నా, చంద్రబాబుకు పట్టడం లేదన్నారు.

ఎపికి రైల్వేజోన్ లేదని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనుల కేటాయింపు జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని విభజన హామీల్లో చెప్పినా వైసిపి పాదయాత్ర తప్ప టిడిపిని ప్రశ్నించడం లేదన్నారు. ఏ పోరాటమూ చేయకుండా వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని వైసిపి ఎలా ఓట్లడుగుతుందని ప్రశ్నించారు. ఈ రెండు పార్టీల నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కల్పించాల్సిందేనన్నారు.

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కూడా కమ్యూనిస్టులు ప్రజాసమస్యలపై బాగా పోరాడుతున్నారని, జనసేన పార్టీని కూడా పదవుల కోసం కాకుండా ప్రజల పార్టీగా మార్చడానికే ఎన్నికల బరిలో దిగుతున్నట్లు ప్రకటించడం మంచి పరిణామమన్నారు. డిసిఐ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, స్టీల్‌ప్లాంట్‌లో టోటల్ మేనేజ్‌మెంట్ కాంట్రాక్టు (టిఎంసి)పైనా పోరాటంలో పవన్ కలిసి వచ్చారన్నారు. 'ఎర్రజెండా పైకి లేపితే కొండమీద కోతైనా దిగి రావాల్సిందేనని'.. డిసిఐ పోరాటంలో కేంద్రం వెనక్కి తగ్గక తప్పలేదంటూ ఉటంకించిన మధు మాటలకు జనం జేజేలు పలికారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు నర్సింగరావు, సిపిఐ నాయకులు స్టాలిన్, జనసేన నాయకులు కోన తాతారావు తదితరులు ప్రసంగించారు.

ఫైనల్‌కు బెంగళూరు

బెంగళూరు : ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్ ఫైనల్లోకి బెంగళూరు ర్యాప్టర్స్ జట్టు ప్రవేశించింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్ పోటీలో 4-3 పాయింట్ల తేడాతో అవధే వారియర్స్‌ను ఓడించి ఫైనల్‌బెర్త్ ఖాయం చేసుకుంది. మిక్స్‌డ్ డబుల్స్ ట్రంప్ మ్యాచ్‌లో క్రిస్టియన్‌సేన్-పొన్నప్ప(అవధే) జోడీ15-7, 15-10తో గెలిచి బెంగళూరుపై 2-0 ఆధిక్యతలో నిలిచింది. సాయిప్రణీత్, కిదాంబి శ్రీకాంత్‌లు పురుషుల సింగిల్స్ మ్యాచుల్లో గెలుపొంది బెంగళూరును 2-2తో సమంగా నిలిపారు. ఆ మ్యాచ్‌లో కిదాంబి శ్రీకాంత్(బెంగళూరు) 15-7, 15-10 పాయింట్ల తేడాతో హో(అవధే)ను చిత్తుగా ఓడించాడు. అనంతరం బెంగళూరు ట్రంప్ మ్యాచ్‌గా తీసుకున్న పురుషుల డబుల్స్ మ్యాచ్‌లో అహసన్- సాధియాన్ జోడీ 15-14, 15-9 పాయింట్ల తేడాతో లీ-క్రిస్టియన్‌సేన్(అవధే) జోడీని ఓడించి ఫైనల్ బెర్త్ ఖాయం చేశారు. మహిళల సింగిల్స్ చివరి మ్యాచ్‌లో బెవెన్ జంగ్ గెలిచినా ప్రయోజనం లేకపోయింది. శనివారం హైదరాబాద్ హంటర్స్-ముంబయి రాకెట్స్ జట్ల మధ్య జరిగే రెండో సెమీఫైనల్ విజేతతో ఆదివారం టైటిల్‌కై బెంగళూరు తలపడనుంది.



బాల్‌బ్యాడ్మింటన్‌లో మెరిసిన ఎపి

- 3 బంగారు పతకాలు కైవసం
- ముగిసిన జాతీయ పోటీలు

ప్రజాశక్తి - నెల్లూరు

అండర్ 14,17,19 బాలురు విభాగంల్లో ఎపికి చెందిన క్రీడాకారులు ప్రారంభం నుంచి ఆధిక్యతను ప్రదర్శించి బంగారు పతకాలను కైవసం చేసుకున్నాయి. అదే విధంగా అండర్ 14,17 బాలికల విభాగంలో తమిళనాడుకు చెందిన క్రీడాకారులు, అండర్ 19 బాలికల విభాగంలో కర్ణాటకకు చెందిన క్రీడాకారులు బంగారు పథకాన్ని సాధించారు.ఈ పోటీలకు 17 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు, 2 అసోసియేషన్లకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. 64వ జాతీయ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి.

ప్రాణాలు తీసిన పందేలు

పోలీసుల భయంతో పరుగులు తీస్తూ బావిలో పడి ఇద్దరు మృతి



మృతిచెందిన యువకులు

ప్రజాశక్తి - నూజివీడు

కోడి పందాలకు వెళ్లి ఇద్దరు ప్రాణాలు కోల్పోయిన సంఘటన కృష్ణాజిల్లా చాట్రాయి మండలం చిత్తపూరులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం చిత్తపూరు గ్రామ సమీపంలోని మామిడి తోటలో గురువారం రాత్రి ఫ్లడ్ లైట్ వెలుతురులో కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు పక్కా ప్రణాళిక ప్రకారం పందెపు రాయుళ్లను చుట్టుముట్టారు. దీంతో పందెపు రాయుళ్ల భయంతో పరుగులు తీశారు. గ్రామంలో ఓ ఇంటి సమీపంలో నేల బావి ఉండడంతో చిత్తపూరుకు చెందిన చిట్టూరి శ్రీనివాసరావు (23), విస్సన్నపేట మండలం కొండపర్వకు చెందిన కుక్కల చెన్నారావు (30) గమనించకుండా పరుగులు తీసి నేల బావిలో పడిపోయారు. ఇటీవల కురిసిన వర్షాలకు బావిలో నీళ్లు ఉండటంతో ఇద్దరు యువకులు నీటిలో మునిగిపోయారు. పోలీసులు ఫ్లడ్ లైట్ల వెలుతురుతో ఎంత సేపు గాలించినా మునిగి పోయిన వారి జాడ తెలియలేదు. దీంతో శుక్రవారం ఉదయం గ్రామస్తులు ఇద్దరి మృత దేహాలనూ బయటకు తీశారు. తిరువూరు సిఐ ప్రసన్న గౌడ్ తన సిబ్బందితో కలిసి మృతదేహాలను తిరువూరు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

మరోవైపు కుక్కల చెన్నారావుకు చంద్రన్న బీమా నమోదు కాకపోయినా చంద్రన్న బీమా వర్తి స్తుందని పోలీసులు మభ్యపెట్టి హడావుడిగా పోస్టు మార్టానికి తరలించారని కుటుంబ సభ్యులు ఆరోపి ంచారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి మృతుల కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరారు.

టిఆర్ఎస్ నేతల ద్వారా వైసిపి మధ్యవర్తిత్వం

- బలం లేదంటూనే పొత్తు కోసం వెంపర్లాట
- పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గతంలో జనసేనకు స్థానాలు రావని చెప్పినవారే, ఇప్పుడు కలసి రావాలని ఆహ్వానిస్తున్నారని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అన్నారు. టిఆర్ఎస్ నాయకులతో మాట్లాడిస్తున్నారని చెప్పారు. ఇది జనసేన బలానికి నిదర్శనమన్నారు. విజయవాడలోని జనసేన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లా నాయకులతో సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ వ్యవస్థలో అవినీతి రోజురోజుకీ పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. టిడిపి పాలనలో అవినీతి తక్కువగా ఉంటుందని ఆశించినా, పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉందన్నారు. చట్టాలను వారికి అనుకూలంగా మలచుకుని రాజకీయ పార్టీ నాయకులు వాడుకుంటున్నారన్నారు. దెందులూరు ఎమ్మెల్యే వేధిస్తున్నాడని తనను కలిసిన దళితులు తెలిపారన్నారు. అటువంటి వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం ఆ పని ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. సమాజ వికాసం కోసం జనసేన పని చేస్తోందే తప్ప, కులం పేరుతో ప్రజలను విడగొట్టదన్నారు. తాను



చదువును ఇంటర్‌తోనే నిలిపేసినా పుస్తకాల్ని చదవడం మాత్రం ఆపలేదన్నారు. రోజుకు కనీసం 8 గంటల పాటు పలు అంశాలకు సంబంధించిన పుస్తకాలు చదువుతూనే ఉంటానని చెప్పారు. పార్టీ సంస్థాగత నిర్మాణం కోసమే జిల్లాల సమీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జనసేన భావజాలం ప్రజల్లోకి తీసుకువెళ్లాలంటే కనీసం రెండు దశాబ్దాల సమయం పడుతోందన్న విషయం గత అనుభవాల్ని బట్టి తెలుస్తోందన్నారు. అందుకే రెండున్నర దశాబ్దాల పాటు పోరాటానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ పోరాటం కోసమే తాను టిడిపికి మద్దతు తెలిపినా వారి నుంచి ఏమీ ఆశించలేదన్నారు. ఒక పార్టీకి ఒక నాయకుడు సరిపోడని, అందుకే పార్టీలోకొచ్చే వారిని మనస్ఫూర్తిగా ఆహ్వానిద్దామని అన్నారు. 25 కిలోల బియ్యం వద్దని, 25 ఏళ్ల భవిష్యత్తు కావాలని యువత కోరుతోందన్నారు. నాయకులంతా కలిసి వ్యవస్థను బలహీన పరిచారన్నారు. నాయకులు బలపడితే వాళ్ల చుట్టూ మనం తిరగాలని, వ్యవస్థ బలపడితే ప్రజల్ని అదే కాపాడుతుందని చెప్పారు. సిఎం మళ్లీ మీరే రావాలని పోస్టర్లు వేయించుకుంటున్నారని, క్షేత్ర స్థాయిలో ప్రజలు పడుతున్న కష్టాలు మాత్రం వారికి అవసరం లేదన్నారు. సినిమాల్లో ఉన్నప్పుడు ఎవరైనా ఇబ్బంది అంటూ వస్తే తోచిన సాయం చేస్తూ వచ్చానన్నారు. రాను..రాను సమస్యలతో వచ్చే వారి సంఖ్య పెరుగుతూ వచ్చిందని, అందరి సమస్యలకీ పరిష్కార మార్గం అది రాజకీయంగానే సాధ్యమనిపించిందన్నారు. పార్టీ నడపాలంటే రూ.కోట్ల పెట్టుబడి అవసరం లేదన్నారు. ఆశయాలు, భావజాలం బలంగా ఉంటే చాలని చెప్పారు. కృష్ణా జిల్లా రాజధాని ప్రాంతం కనుక పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత బలంగా పని చేయాలన్నారు. ఎన్నికల గుర్తుగా టీ గ్లాసు సామాన్యుడిని ప్రతిభింబించేలా ఉందన్నారు.

ఇబిసి రిజర్వేషన్ మోడీ రాజకీయకుట్ర

- డిఎస్ఎమ్ఎమ్ జాతీయ కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మోడీ అధికారంలోకొచ్చిన నాలుగున్నరేళ్లలో గుర్తుకు రాని ఇబిసి రిజర్వేషన్ అంశం పార్లమెంట్ చివరిరోజున ఈ బిల్లును ఆమోదించడంలో రాజకీయ కుట్ర ఉందని దళిత్ శోషణ్ ముక్తి మంచ్(డిఎస్ఎమ్ఎమ్) జాతీయ కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శించారు. విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇబిసి రిజర్వేషన్ల బిల్లు అగ్రకులాల ఓటుబ్యాంకు కోసమే తప్ప, సామాజిక న్యాయం కోసం కాదని విమర్శించారు. ఈ బిల్లు అమల్లోకొస్తే సంపన్నులైన టాటా, బిర్లాలకు కూడా మన దేశంలో రిజర్వేషన్లు వర్తిస్తాయన్నారు. ఆర్థిక, సామాజిక ప్రాతిపదికలు రెండూ ఒకటి కాదనీ, సామాజిక ప్రాతిపదికను కాపాడుకోవాల్సి ఆవశ్యకత ఉందనీ అభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్ల పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగంలో రిజర్వేషన్లు అమలు కానందునే జీతాలు పెంచాలని ఉద్యోగులు పోరాటాలు చేస్తున్నారన్నారు. 3లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలున్న నేపథ్యంలో, ఉద్యోగాలివ్వకుండా ప్రధాని మోడీ నిరుద్యోగుల మధ్య రిజర్వేషన్ల చిచ్చు పెడుతున్నారన్నారు. రిజర్వేషన్లు వర్తించే ఎస్సీ, ఎస్టీలకు రెండున్నర లక్షల బ్యాక్‌లాగ్ పోస్టులున్నాయనీ, వాటిని కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే భర్తీ చేయడంలేదనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలో రెండున్నర లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు వివిధ రంగాల్లో ఖాళీలున్నప్పటికీ రాష్ట్రప్రభుత్వం ఉద్యోగ నియామకాలు ఎందుకు చేపట్టడంలేదని ప్రశ్నించారు. ఉద్యోగాలు ఇవ్వడం పక్కనపెడితే రాష్ట్ర ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్లలో 60వేల మందిని ఉద్యోగాల నుండి తొలగించిందన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలతో కాలం గడుపుతున్న ప్రభుత్వాలు ఏ రకంగా రిజర్వేషన్లను అమలు చేస్తాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

సిఆర్‌డిఎ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అమరావతిబ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఎపిసిఆర్‌డిఎ) ఉద్యోగుల సంఘం 2019 సంవత్సరం డైరీని సిఆర్‌డిఎ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులకు, సంఘం నేతలకు, కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. గతేడాది డైరీ ఆవిష్కరణ సందర్భంగా సంస్థ అభివృద్ధికి చేసిన తీర్మానాలు అమలుచేయడమే కాకుండా మరో రెండు విజయాలు సాధించి చరిత్ర సృష్టించారన్నారు. అన్ని జీవోల సమగ్ర సమాచారంతో ఉద్యోగుల సంఘం డైరీ తీసుకురావటం సంతోషదాయకమన్నారు. ఎపిసిఆర్‌డిఎ స్పెషల్ కమిషనర్ వి.రామమనోహర్‌రావు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి పని తీరుతోనే సంస్థ ఇంత స్థాయికి వచ్చిందన్నారు. ఎపి ఎన్జీవోల సంఘం పశ్చిమ కృష్ణా అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ సిఆర్‌డిఎ ఎంతో ప్రతిష్టాత్మకమైన సంస్థ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్జీవోల సంఘం పశ్చిమ కృష్ణా సెక్రటరీ ఇక్బాల్, ఎపిసిఆర్‌డిఎ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బి.ప్రభాకర్‌రావు, జనరల్ సెక్రటరీ ఎం.నాగేంద్రరావు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేశాం

- 16వేల గ్రామాల్లో సభలు నిర్వహించాం
- 4,57,007 వినతుల్లో 3,10,000 పరిష్కరించాం
- జన్మభూమి అఖరి రోజు టెలీకాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వయం కృషి, పట్టుదలతో నాలుగేళ్ళలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఉండవల్లిలోని ప్రజావేదికలో శుక్రవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో జన్మభూమి చివరి రోజు నిర్వహణపై ఆయన మాట్లాడారు. విభజనతో దిక్కుతోచని స్థితిలో ఉన్నామనీ, అప్పుడు ఇక్కడికి రావడానికి ఎవరూ ఇష్టపడలేదనీ అన్నారు. ఇప్పుడు అద్భుత ప్రగతి సాధించామనీ, యావత్ ప్రపంచమే మన వైపు చూస్తోందనీ అన్నారు. నాలుగేళ్లలో వచ్చిన 670 అవార్డులే ప్రభుత్వ కషికి నిదర్శనమన్నారు. 'మీ కష్టార్జితం, సమిష్టి కషితోనే రాష్ట్రాభివద్ధి జరిగింది. గతంలో తొమ్మిదేళ ముఖ్యమంత్రిగా తానొక్కడే పరుగెత్తాను. ఇప్పుడు ఒక బందంగా పరుగులు తీస్తున్నాం. అందువల్లే ఫలితాలు సాధిస్తున్నాం' అని అన్నారు. 16వేల గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించామనీ, 16 వేల గ్రామాభివద్ధి ప్రణాళికలను అప్‌లోడ్ చేశామనీ, పోలవరం కాంక్రీట్ పనుల్లో గిన్నిస్ రికార్డు సాధించామనీ తెలిపారు. ఇక్కడి ఆర్టీజీని టోని బ్లెయర్, ఈశ్వరన్ అభినందించారని తెలిపారు. నరేగా నిధుల సమీకరణ, వయాడక్ట్, ప్రకతి వ్యవసాయం, ఒక్క రోజులో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు, ఎల్ఈడి బల్బులు ఒక వినూత్న ఆవిష్కరణ అని అన్నారు. లక్షా 30 వేల మంది యువతకు ఉపాధి కల్పన చేశామన్నారు. అదాని రూ.30 వేల కోట్లతో డేటా పార్కులు, రూ.40 వేల కోట్లతో సోలార్ పార్కులు వంటివి వచ్చాయన్నారు. ప్రకాశం జిల్లాలో కాగితం గుజ్జు పరిశ్రమ వస్తోందనీ, 50 వేల రైతు కుటుంబాలకు ప్రయోజనముంటుందని తెలిపారు. సులభతర వాణిజ్యంలో మనమే ముందున్నామనీ, ప్రజల భాగస్వామ్యం కోసమే జన్మభూమి-మా ఊరు, గ్రామ వికాసం, జలసిరికి హారతి కార్యక్రమాల్ని నిర్వహించామన్నారు. రేపటి నుంచి సంక్రాంతి సంబరాలు నిర్వహించాలన్నారు. ఇప్పటివరకు 4,57,007 వినతులు అందగా, అందులో 3,10,000 పరిష్కరించామనీ, 35 వేల వినతుల్ని తిరస్కరించామని చెప్పారు. మొదటి విడత జన్మభూమికి 40 లక్షల వినతులు రాగా, ఈ జన్మభూమికి 4.5 లక్షల వినతులొచ్చాయని వివరించారు. వినతుల సంఖ్య తగ్గడమే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కూడా పనిచేయాలనీ, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాలనీ కోరారు. జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.



ఎన్టీయార్ అనుకున్నది సాధించారు

అచంచల విశ్వాసంతో ఎన్‌టీఆర్ ముందుకు సాగారనీ, తన భావాలతో రాజీపడలేక ఉద్యోగాన్ని వదిలేసి, మద్రాసు వెళ్లి, అష్టకష్టాలు పడినా మనోధైర్యాన్ని కోల్పోకుండా అనుకున్న లక్ష్యాన్ని సాధించారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఉండవల్లిలోని ప్రజావేదికలో శుక్రవారం జరిగిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ రైతులు, పేదల కష్టాల్ని చిన్నప్పుడే చూశారు కాబట్టే సినీ నటుడు కాగానే జోలెపట్టి విరాళాలు సేకరించారనీ, తానే స్వయంగా విరాళమిచ్చి స్ఫూర్తి నింపారని అన్నారు. ఎన్టీఆర్ సినిమా ఎనలేని స్ఫూర్తిని నింపిందని, 30 ఏళ్ల చరిత్రను మూడు గంటల్లో చూపారని చెప్పారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68